www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
11-12-2024
సంపుటి : 01 | సంచిక : 219 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## డిజిటల్ యుగంలో సవాళ్లు పొంచి ఉన్నాయి

- కృత్రిమ మేధ కొత్త సమస్యలను సృష్టిస్తోంది
- ప్రజల హక్కులను, గౌరవాన్ని కాపాడే డిజిటల్ వాతావరణాన్ని కల్పించాలి
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**ఢిల్లీ:** ప్రస్తుత డిజిటల్ యుగంలో సవాళ్లు పొంచిఉన్నాయని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం విస్తృతంగా వ్యాప్తి చెందుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. సైబర్ నేరాలు, డీప్ ఫేక్, ప్రజల గోప్యతకు భంగం వంటి విషయాలు మానవులకు కొత్త ముప్పుగా పరిణమిస్తున్నాయన్నారు. వీటిని నివారించాలంటే ప్రజల హక్కులను, గౌరవాన్ని కాపాడే డిజిటల్ వాతావరణాన్ని కల్పించడం చాలా ముఖ్యమని 'మానవ హక్కుల దినోత్సవం' సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిచేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలతో పాటు వాతావరణంలో వచ్చే వివిధ రకాల మార్పులను మిగతా2లో...

## ఆశా వర్కర్లు సంయమనం పాటించాలి

- రాజకీయంగా ప్రేరేపించే వారి ఉచ్చులో పడొద్దు
- శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ప్రభుత్వం ఊరుకోదు
- ఆశాలను అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష పార్టీ రాజకీయం చేస్తోంది
- విజయోత్సవాలు నిర్వహిస్తుంటే తట్టుకోలేకపోతున్నారు
:దామోదర రాజనర్సింహ



**విశ్వంభర, హైదరాబాద్:** ఆశా వర్కర్లను అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష పార్టీ రాజకీయం చేస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని చాటేలా విజయోత్సవాలు నిర్వహిస్తుంటే ప్రతిపక్ష పార్టీ నేతలు తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఆశా వర్కర్లను రెచ్చగొట్టారని విమర్శించారు. మిగతా2లో...

## రణరంగంగా బెళగావి

- రిజర్వేషన్ కోరుతూ ఆందోళనలు..
- విద్య, ఉద్యోగ రంగాల్లో 15 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్
- పోలీసులు, ఆందోళన కారుల మధ్య చోటుచేసుకున్న ఉద్రిక్తత
- పరిస్థితులు అదుపు తప్పడంతో పోలీసులు లాఠీఛార్జ్



2

## ఆర్జీవీకి హైకోర్టులో భారీ ఊరట

- డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మకు ముందస్తు బెయిల్
- మూడు కేసుల్లో బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- పోలీసుల విచారణకు సహకరించాలని ఆదేశాలు



10

# రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్‌పై అవిశ్వాస తీర్మానం!



### పార్లమెంటరీ చరిత్రలోనే తొలిసారి

- పక్షపాతిగా వ్యవహరిస్తున్నారంటూ ఆక్షేపించిన ఇండియా కూటమి
- ఖర్గే మాట్లాడేటప్పుడు మైక్రోఫోన్‌ను ఛైర్మన్ తరచూ కట్ చేస్తున్నారని విపక్ష ఎంపీల ఆరోపణ
- 70మంది సంతకాలు చేశారు: కాంగ్రెస్ నాయకురాలు రణజీత్ రంజన్
- ఉపరాష్ట్రపతిపై అవిశ్వాస తీర్మానం విచారకరం: కేంద్రమంత్రి రిజిజు

2



జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజ్యసభ ఛైర్మన్‌గా వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ 'ఇండియా' కూటమి అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చింది. కాంగ్రెస్‌తో సహా ఆర్జేడీ, టీఎంసీ, సీపీఐ, సీపీఎం, జేఎంఎం, ఆప్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలకు చెందిన 70 మంది విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేసి దానిని రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీకి మంగళవారంనాడు అందజేశారు.


## ఎన్ని ఇబ్బందులొచ్చినా ప్రజావాణి కొనసాగిస్తాం

- జవాబుదారీగా ఉండాలని, అవసరాలు తీర్చాలనేదే లక్ష్యం
- మీ కోసమే మేం ఉన్నామనే భావన అధికారులు.. ప్రజలకు కల్పించాలి: డిప్యూటీ సీఎం భట్టి



**విశ్వంభర, హైదరాబాద్:** ఎన్ని ఇబ్బందులొచ్చినా 'ప్రజావాణి' కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో కొనసాగిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారం అవుతున్నాయి. ప్రతి పౌరుడికి నమ్మకం కలిగేలా ప్రజావాణి నిర్వహిస్తున్నాం. ప్రజలకు జవాబుదారీగా మిగతా2లో...

## హైడ్రా కమిషనర్‌ను కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే



- 5 కంపెనీలపై ఫిర్యాదు
- ఈ అంశంపై ప్రభుత్వం స్పందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా
- భూ ఆక్రమణలను అరికట్టేందుకు నూతన చట్టం రూపొందించాలి
- మీడియాతో వెంకటరమణారెడ్డి

2

## మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

మీడియాపై దాడి అమానుష చర్య

విచక్షణమరిచి మోహన్‌బాబు ప్రవర్తించడం సిగ్గుచేటు

వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రికల సీఎండీ డా.కాచం

2

# ఉద్యమ తల్లే మా తల్లి

- హస్తం గుర్తు తల్లిని ఆమోదించం
- మా తల్లి చేతి నుంచి బతుకమ్మను తొలగించారు
- రేవంత్ పిట్ట బెదిరింపులకు భయపడేవారు ఎవరూలేరు
- తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్సీ కవిత



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రాండ్‌గా ఉండే తెలంగాణ తల్లిని తీసి.. బీద తల్లిని పెట్టామని రేవంత్ రెడ్డి గొప్పలు చెప్తున్నాడని ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యమ తల్లే తమ మిగతా2లో..

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## మార్చి నాటికి లక్ష ఎకరాల్లో పామాయిల్ ప్లాంటేషన్

- ఇందుకోసం అన్ని చర్యలు తీసుకోవాలి
- వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్ పథకాల అమలును వేగవంతం చేయాలి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు



2



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 90 | ₹ 112 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 162 | ₹ 185 |


## భారతీయ విద్యార్థులకు భారీగా వీసాలు తగ్గించిన అగ్రరాజ్యం

- ఎఫ్ 1 వీసాల్లో 38శాతం తగ్గుదల
- ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి

2

## హైదరాబాద్‌కు రానున్న రాష్ట్రపతి

- డిసెంబర్ 17 నుంచి 21వరకు శీతాకాల విడిది..
- ద్రౌపదీ ముర్ము పర్యటనకు ఏర్పాట్లు చేయాలి
- అధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష




2

## ఇండియన్ కోస్ట్‌గార్డ్ అదుపులో 78 మంది మత్స్యకారులు

- బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో అప్రమత్తంగా సిబ్బంది
- అంతర్జాతీయ జలాల్లో పెట్రోలింగ్
- రాత్రి సమయాల్లో కోల్‌కతా నుంచి భువనేశ్వర్ వరకు ఎయిర్‌క్రాఫ్ట్‌లతోనూ పహారా

2



# మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

**విశ్వంభర, హైదరాబాద్:** సినీ నటుడు మోహన్ బాబు అకారణంగా జల్‌పల్లిలో తన నివాసంలో మీడియా ప్రతినిధులపై దాడి చేయడాన్ని వి3 న్యూస్, విశ్వంభర దినపత్రిక అధినేత డా.కాచం సత్యనారాయణ ఖండించారు. మీడియా ప్రజలకు, ప్రభుత్వాలకు మీడియా వారధిగా పనిచేయడంతో సమాజానికి వాస్తవాలు చెప్పడం కోసం పాత్రికేయులు వృత్తి నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తారన్నారు.అలాంటి వారిపై మోహన్‌బాబు దాడి చేయడం అమానుష చర్య అన్నారు. విచక్షణ మరిచి ఇలా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. మీడియా ప్రతినిధులకు మోహన్‌బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఆయన మీద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఆయనకిచ్చిన పద్మశ్రీని కూడా రద్దు చేయాలన్నారు.

# హైదరాబాద్‌కు రానున్న రాష్ట్రపతి

**విశ్వంభర, హైదరాబాద్:** శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ రానున్నారు. డిసెంబరు 17 నుంచి 21 వరకు రాష్ట్రపతి హైదరాబాద్‌లో ఉండనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి శీతాకాల విడిది ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రత్యేక బృందాలను నియమించాలని అటవీ శాఖ ఉన్నతాధికారులను సీఎస్ ఆదేశించారు. బందోబస్తు, ట్రాఫిక్, అగ్నిమాపక, నిరంతర విద్యుత్ సరఫరా, రోడ్ల మరమ్మతులు, పరిసరాల పారిశుధ్య నిర్వహణ చర్యలు పకడ్బందీగా చేయాలని వివిధ శాఖలను సీఎస్ ఆదేశించారు. సమావేశంలో హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, ఆర్‌అండ్ బీ ప్రత్యేక సీఎస్ వికాస్ రాజ్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, సమాచార శాఖ ప్రత్యేక సీఎస్ హరీష్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

# హైడ్రా కమిషనర్‌ను కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే..

**విశ్వంభర, హైదరాబాద్:** చెరువులను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతోన్న పలు కంపెనీలపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో రంగనాథ్‌ను కలిసిన ఎమ్మెల్యే.. పలు కంపెనీల పేర్లను ప్రస్తావిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అంశంపై ప్రభుత్వం స్పందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. రెండు నెలల క్రితమే చెరువుల కబ్జాపై తాను మాట్లాడినట్లు చెప్పారు. అయితే, తాను మాట్లాడిన 10 రోజుల తర్వాత.. అనుమతులు ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లబోమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు తెలిపారు. ''చెరువులు కబ్జా చేశారు. అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. 5 కంపెనీలకు అనుమతి ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఈ ప్రభుత్వం గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కొత్త నాటకానికి తెర లేపింది. ఈ 5 సంస్థల విషయంలో అక్రమంగా అనుమతులిచ్చిన అధికారులు, వాటికి అండగా ఉన్న ప్రభుత్వ పెద్దలపై చర్యలు తీసుకోవాలి. భూ ఆక్రమణలను అరికట్టేందుకు ప్రభుత్వం నూతనంగా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది'' అని ఎమ్మెల్యే అన్నారు.

# మార్చి నాటికి లక్ష ఎకరాల్లో పామాయిల్ ప్లాంటేషన్

**విశ్వంభర, హైదరాబాద్:** వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్ పథకాల అమలును వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక మొత్తంలో రైతులకు లబ్ధి చేకూర్చాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ రాష్ట్రస్థాయి అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. వివిధ పథకాల పురోగతిపై అధికారులతో మంత్రి విస్తృతంగా చర్చించారు. ప్రాథమిక సహకార సంఘాల బలోపేతంపైనా మంత్రి దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు తుమ్మల సూచించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి లక్ష ఎకరాల్లో పామాయిల్ ప్లాంటేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని.. ఇందుకోసం అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# ఇండియన్ కోస్ట్‌గార్డ్ అదుపులో 78 మంది మత్స్యకారులు

**ఢిల్లీ:** భారత ప్రాదేశిక జలాల్లో అక్రమంగా చేపల వేట సాగిస్తున్న బంగ్లాదేశ్‌కు చెందిన 78 మంది మత్స్యకారులను ఇండియన్ కోస్టు గార్డు బృందం అదుపులోకి తీసుకుంది. భారత్ సరిహద్దులోని అంతర్జాతీయ జలాల్లో పహారా కాస్తున్న కోస్టుగార్డు సిబ్బందికి రెండు బోట్లు అనుమానాస్పదంగా కనిపించాయి. వాటిని వెంబడించి అడ్డుకున్న కోస్టుగార్డు సిబ్బంది.. బోట్లు బంగ్లాదేశ్‌లో రిజిస్టరై ఉన్నట్లు గుర్తించారు. వాటిలో ప్రయాణిస్తున్న 78 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకొని, బోట్లను సీజ్ చేశారు. తదుపరి విచారణ కోసం వాటిని పారాదీప్ పంపించినట్లు కోస్ట్‌గార్డ్ అధికార ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి ఏర్పడిన నేపథ్యంలో సరిహద్దులోని ఇండియన్ కోస్టుగార్డ్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి జలమార్గంలో భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించే అవకాశం ఉన్న తరుణంలో అంతర్జాతీయ జలాల్లో పెట్రోలింగ్ షురూ చేశారు. ఏ చిన్న అనుమానం వచ్చినా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా రాత్రి సమయాల్లో కోల్‌కతా నుంచి భువనేశ్వర్ వరకు ఎయిర్‌క్రాఫ్ట్‌లతోనూ పహారా కాస్తున్నారు.

# ఆశా వర్కర్లు సంయమనం పాటించాలి

(మొదటి పేజీ తరువాయి)
గత పదేళ్ల పాలనలో ఆశా వర్కర్ల వేతనాల పెంపుపై ఎన్నిసార్లు నిరసనలు, ధర్నాలు చేసినా పట్టించుకోని బీఆర్ఎస్.. ఇప్పుడెందుకు మొసలి కన్నీరు కారుస్తోందని నిలదీశారు. బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరికి ఆశా వర్కర్ల నిరసనలే నిదర్శనమన్నారు. ''2015లో వేతనాలు పెంచాలంటూ 106 రోజులు ఆశా వర్కర్లు ధర్నాలు చేసినా పట్టించుకునే వారు లేకపోయారు. ఆ తర్వాత కూడా ఆశా వర్కర్లు అనేక సార్లు సమ్మెలు, ధర్నా లు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వారి సమస్యలను పరిష్కరించలేదు. అలాంటి వారు ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారు? ఆశా వర్కర్లు సంయమనం పాటించాలి. రాజకీయంగా ప్రేరేపించే వారి ఉచ్చులో పడొద్దు. ప్రజా ప్రభుత్వం ఆశా వర్కర్ల స్వేచ్ఛను గౌరవిస్తుంది. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే మాత్రం ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు'' అని మంత్రి హెచ్చరించారు.

# రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌పై అవిశ్వాస తీర్మానం!

**ఢిల్లీ:** పార్లమెంటులో మంగళవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్యసభకు ఛైర్మన్‌గా ఉన్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఎగువ సభలో చైర్మన్ వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షంగా ఉంటోందని ఎంపీలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. రాజ్యసభ నుంచి తాము తరచూ వాకౌట్ చేయాల్సిన పరిస్థితికి చైర్మన్ ధన్‌ఖర్ వైఖరే కారణమని విపక్ష ఎంపీలు ఆరోపిస్తున్నారు.ఈక్రమంలో ఆయన పక్షపాతిగా వ్యవహరిస్తున్నారంటూ ఆక్షేపించింది. ఈ అవిశ్వాస తీర్మాణానికి తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌తో సహా ఇండియా కూటమి నేతలు మద్దతిచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు 50 మంది ఎంపీల మద్దతు కావాల్సి ఉంటుంది.ఈ తీర్మానంపై ఇండియా కూటమి పార్టీలైన తృణమూల్, ఆమ్ ఆద్మీ-పార్టీ, సమాజ్ వాదీపార్టీ, డీఎంకే, ఆర్జేడీ తదితర పార్టీలకు చెందిన ఎంపీలు సంతకాలు చేశారు. ఎంపీలు సంతకాలు చేసిన ఈ నోటీసులను రాజ్యసభ సెక్రటేరియట్‌కు సమర్పించారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం భారత పార్లమెంటరీ చరిత్రలోనే ఇది మొదటిసారి. అయితే, 70 మంది ఎంపీలు తమకు మద్దతుగా సంతకాలు చేశారని కాంగ్రెస్ నాయకురాలు రణజీత్ రంజన్ ఓ మీడియా సంస్థతో పేర్కొన్నారు.

**మైక్రోఫోన్‌ను చైర్మన్ తరచు కట్ చేస్తున్నారని విపక్ష ఎంపీల వాదన..**

రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినపుడు చైర్మన్ ఆయనకు అవకాశం ఇవ్వాలని, కాని కాంగ్రెస్ అధ్యక్షుడు, సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిలబడగానే మైక్రోఫోన్‌ను చైర్మన్ తరచు కట్ చేస్తున్నారని విపక్ష ఎంపీలు వాదిస్తున్నారు. పార్లమెంటరీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం సభ నడవాలని, కాని తాము ఫిర్యాదు చేసిన ప్రతిసారి తమను ఛాంబర్‌లోకి పిలిచి సర్దుబాటు చేసేందుకు చైర్మన్ ప్రయత్నిస్తున్నారే తప్ప నిబంధనలను పాటించాలని భావించడం లేదని సీనియర్ ప్రతిపక్ష నాయకుడు ఒకరు తెలిపారు.రాజ్యసభలో చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఆయన తమ ప్రసంగాలకు అంతరాయం కలిగిస్తున్నారని, క్లిష్టమైన అంశాలపై తగిన చర్చకు అనుమతించడం లేదని, వివాదాస్పద చర్చల సమయంలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఈ క్రమంలోనే రాజ్యంగంలోని ఆర్టికల్ 67(బీ) ప్రకారం జగ్‌దీప్ ధన్‌ఖడ్‌పై అవిశ్వాస తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టనున్నారు.



**ఉపరాష్ట్రపతిపై అవిశ్వాస తీర్మానం విచారకరం: రిజిజు**

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పై విపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం చాలా విచారకరమని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. రాజ్యసభ ఛైర్మన్‌ను చూసి ప్రభుత్వం గర్విస్తోందని, ఆయన నిష్పాక్షికంగా వ్యవహరిస్తారని కొనియాడారు. విలేకరులతో మాట్లాడియన రిజిజు.. ఎగువసభలో ఎన్డీయేకు మెజార్టీ ఉందన్నారు.

**సభా గౌరవాన్ని కాపాడుకోవాలి: ఓం బిర్లా**

పార్లమెంటులో విపక్షాల నిరసనలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తంచేశారు. 'మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. ప్రజల ఆశలు, ఆకాంక్షలను మనం నెరవేర్చాలి. మనమందరం సభా గౌరవాన్ని కాపాడుకోవాలి. కానీ, గత కొన్ని రోజులుగా జరుగుతున్న సంఘటనలు బాగుండటం లేదు' అని ఆయన పేర్కొన్నారు. ఈక్రమంలోనే ఇరు సభలు రేపటికి వాయిదా పడ్డాయి.

# భారతీయ విద్యార్థులకు భారీగా వీసాలు తగ్గించిన అగ్రరాజ్యం

**వాషింగ్టన్:** విదేశాల్లో పైచదువులు చాలామంది కల. అందులోనూ అమెరికాలో ఉన్నతవిద్య అభ్యసించేందుకు మరింత ఎక్కువ ఇష్టపడుతుంటారు. అలా మన దేశం నుంచి ఏటా వేల మంది విద్యార్థి వీసాలపై అగ్ర రాజ్యానికి వెళ్తుంటారు. అయితే, ఈసారి ఆ సంఖ్యలో భారీ తగ్గుదల కన్పించడం గమనార్హం. ఈ ఏడాది తొలి 9 నెలల్లో భారతీయ విద్యార్థులకు జారీ చేసే ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు 38శాతం తగ్గాయి. ఈమేరకు అమెరికా విదేశాంగ శాఖ గణాంకాలు వెల్లడించాయి. బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ నెలవారీ నివేదికల డేటా ప్రకారం.. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు మధ్య 64,008 మంది భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలను జారీ చేశారు. గతేడాది ఇదే సమయంలో ఈ సంఖ్య 1,03,495గా ఉండటం గమనార్హం. కొవిడ్ తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి. 2021 తొలి తొమ్మిది నెలల్లో 65,235 మందికి ఎఫ్-1 విద్యార్థి వీసాలు ఇవ్వగా.. 2022 జనవరి-సెప్టెంబరు మధ్య 93,181 మంది భారతీయ విద్యార్థులకు వీసాలు దక్కాయి. అయితే, ఈసారి భారతీయులకు మాత్రమే కాదు.. చైనా విద్యార్థులకు జారీ చేసిన వీసా ల్లోనూ 8శాతం తగ్గుదల కన్పించింది. గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది తొలి తొమ్మిది నెలల్లో 73,781 మంది చైనీస్ విద్యార్థులకు వీసాలు అందాయి. గతేడాది ఇదే సమయంలో ఈ సంఖ్య 80,603గా ఉంది. ఇదిలాఉండగా.. అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో తొలిసారిగా భారత్ అగ్రస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. అక్కడ ఉన్న విదేశీ విద్యార్థుల్లో ఎన్నోఏళ్లుగా ప్రథమస్థానంలో ఉన్న చైనాను ఈసారి మన దేశం వెనక్కి నెట్టింది. గత విద్యా సంవత్సరం(2023-24) నాటికి 3.30 లక్షల మంది విద్యార్థులతో భారత్ తొలిస్థానంలో నిలిచింది. చైనా విద్యార్థుల సంఖ్య 2,77,398 మాత్రమే. అమెరికాలో అంతర్జాతీయ విద్యార్థులు 11.26 లక్షల మంది ఉండగా.. వారిలో 29 శాతం మంది మన వాళ్లేనట..!




**ఏంటీ ఎఫ్-1 వీసా?**

ఎఫ్-1 వీసా అనేది నాన్-ఇమిగ్రెంట్ వీసా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అమెరికాలో ఫుల్ టైమ్ విద్యను అభ్యసించేందుకు ఈ వీసా అనుమతినిస్తుంది. అగ్రరాజ్యంలోని విద్యాసంస్థలు ఏటా రెండుసార్లు ప్రవేశాలను అనుమతిస్తాయి. ఆగస్టు-డిసెంబర్ సెమిస్టర్ సమయంలోనే మన విద్యార్థులు అధికంగా వెళ్తుంటారు.

# ఎన్ని ఇబ్బందులొచ్చినా ప్రజావాణి కొనసాగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)
ఉండాలని, ప్రజల అవసరాలు తీర్చాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం. మీ కోసమే మేం ఉన్నామనే భావన అధికారులు.. ప్రజలకు కల్పించాలి. రాజ్యాంగ పీఠికలోని లక్ష్యాలను ప్రజలకు అందించాలని ప్రయత్నిస్తున్నాం'' అని భట్టి విక్రమార్క తెలిపారు. ఫారెస్ట్ రైట్ యాక్ట్ ద్వారా పట్టాలు పొందిన పోడు రైతులు సాగు చేసుకోవడానికి సోలార్ ద్వారా ప్రతి వ్యవసాయం పంపు సెట్ కు కరెంటు అందించడానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పోడు రైతులు సోలార్ పవర్ పెట్టుకోవడానికి కావలసిన ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ శాఖకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలు వారి ఇబ్బందులను నేరుగా చెప్పుకోవడానికి ప్రజా ప్రభుత్వం ప్రజావాణి ని ఏర్పాటు చేసిందన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రజావాణి కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని వెల్లడించారు. ఏడాది పూర్తి చేసుకున్న ప్రజా ప్రభుత్వంలో నిర్వహించిన ప్రజావాణిలో పెట్టుకున్న దరఖాస్తులకు పరిష్కారం లభించిందని లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ప్రజల అవసరాలు తీర్చడం కోసం పనిచేస్తున్నదని ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును కంప్యూటరైజ్ చేసి సంబంధిత అధికారులకు ఆ దరఖాస్తులను పంపించి, ఆ సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారి తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు చెప్పే విధంగా నిరంతరాయంగా పర్యవేక్షణ చేయడంవల్ల దరఖాస్తుదారులు సంతోషాన్ని వెలిబుచ్చుతున్నారని వివరించారు.ప్రభుత్వంలో ఉన్న అన్ని వ్యవస్థలు ప్రజల కోసమే పని చేస్తూ ప్రజాస్వామ్యానికి పునాదులు వేస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించాలనే రాహుల్ గాంధీ ఆలోచన విధానానికి అనుగుణంగా, భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రియాంబుల్స్, చట్టాలను తూచా తప్పకుండా ప్రజలకు అందించాల్సిన బాధ్యతతో ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నదని అన్నారు.



తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ వారి అవసరాలు తీర్చడం కోసం తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేర్చకపోగా 70 సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లిందని విమర్శించారు, భావ స్వేచ్ఛ, ప్రగతిశీల ఆలోచనలకు స్థానం లేకుండా గుప్పిట్లో బంధించి పాలన అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిగా తుంగలో తొక్కడమే కాకుండా పోడు రైతుల సమస్యలను గత బిఆర్ఎస్ పాలకులు పట్టించుకోలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే తప్ప మన ఆశలు ఆకాంక్షలు నెరవేరవని భావించి అప్పటి పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఒక వైపు భారీ బహిరంగ సభలు నిర్వహించగా, సిఎల్పీ నాయకుడిగా నేను ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేసి ప్రజల వద్దకు వెళ్లామన్నారు. ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసుకుని మన సమస్యలు పరిష్కరించుకుందామని ప్రజలకు చెప్పడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని దీవించి అధికారాన్ని కట్టబెట్టారని తెలిపారు.

# ఉద్యమ తల్లే మా తల్లి

(మొదటి పేజీ తరువాయి)
తల్లి అని, హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. రేవంత్ పిట్ట బెదిరింపులకు భయపడేవారు ఎవరూలేరన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పునకు నిరసనగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యమకారులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది. జొన్నలు, మక్కలు ఇతర రాష్ట్రాల్లో కూడా పండుతాయి. పూలనే పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది. తెలంగాణ తల్లి చేతి నుంచి బతుకమ్మను తొలగించారు. తెలంగాణ ప్రత్యేకతే బతుకమ్మ. మహిళలకేమో విగ్రహాలు.. మగవాళ్లకేమో వరాలా అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లిని మార్చి కాంగ్రెస్ తల్లిని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. 9 మంది తెలంగాణ కవులు, కళాకారులకు స్థలాలు, డబ్బులిస్తామన్నరు. గుర్తింపునకు మల్లు స్వరాజ్యం, విమలక్క, సంధ్య పనికిరారా అని ప్రశ్నించారు. గ్రాండ్‌గా ఉండే తల్లిని తీసేసి.. బీద తల్లిని పెట్టినమని రేవంత్ గొప్పలు చెప్తుండు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అన్ని ప్రశ్నించారు. మీ నోటి నుంచి ఎరుకల నాంచారమ్మ, బీడీ కార్మికుల మహిళల పేరు రాలేదన్నారు. ఉద్యమ కాలంలో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లిని మార్చారని విమర్శించారు. విగ్రహం పెట్టామని చెప్పి సామన్య మహిళలకు ఇచ్చిన హామీలు ఎగ్గొడతారా అని నిలదీశారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యమ తల్లే మా తల్లి.. హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. రేవంత్ పిట్ట బెదిరింపులకు ఎవరూ భయపడరని తెలిపారు.

# డిజిటల్ యుగంలో సవాళ్లు పొంచి ఉన్నాయి

(మొదటి పేజీ తరువాయి)
ఎదుర్కొంటోందని ముర్ము అన్నారు. ప్రస్తుత ప్రజల జీవితాల్లో ఏఐ ప్రభావం గురించి ఆమె మాట్లాడుతూ ''కృత్రిమ మేధ ఇప్పుడు మన రోజూవారీ జీవితంలోకి ప్రవేశించింది. మన సమస్యలను పరిష్కరిస్తోంది. కానీ మనకు తెలియకుండానే పలు కొత్త సమస్యలను సృష్టిస్తోంది. దీనికి ప్రాణం లేకపోయినా సృష్టించింది మానవులే కాబట్టి.. ఈ సవాళ్లకు మనమే తగిన పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది'' అని తెలిపారు. సార్వత్రిక మానవ హక్కుల పరిరక్షణ ప్రకటనను ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1948లో ఆమోదించింది. ఆ తీర్మానంలో రూపొందించిన హక్కులు, స్వేచ్ఛపై అందరిలోను అవగాహన పెంచి, వాటి అమలుకు రాజకీయ దృఢ సంకల్పాన్ని పెంపొందించడానికి ఏటా డిసెంబరు 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం జరుపుకొంటున్నాం. ప్రజల్లో మానవ హక్కులపై అవగాహన పెంచడానికి, ప్రభుత్వాలు మరింత బలంగా వాటి పరిరక్షణకు పూనుకోవడానికి ఈ కార్యక్రమాలు ప్రేరణగా నిలిచే అవకాశం ఉందని ఐరాస పేర్కొంది. ఇందులోభాగంగా రూపొందించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి సాకారం చేయాలని పిలుపునిచ్చింది.

# రణరంగంగా బెళగావి

**బెంగళూరు:** కర్ణాటక లోని బెళగావి రణరంగంగా మారింది. విద్య, ఉద్యోగ రంగాల్లో 15 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లింగాయత్ పంచమసాలి వర్గీయులు ఆందోళనకు దిగారు. వివిధ ప్రాంతాల నుంచి బెళగావికి ర్యాలీగా చేరుకున్న ఆందోళన కారులు.. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే విధాన సౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో పోలీసులు, ఆందోళన కారుల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకుంది. పరిస్థితులు అదుపు తప్పడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తరుణంలో తమ డిమాండ్లను పరిష్కరించుకునేందుకు ఇదే సరైన సమయమని ఆందోళకారులు భావించారు. మంగళవారం ఓవైపు సమావేశాలు జరుగుతుండగానే పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించుకుంటూ దూసుకుపోయేందుకు యత్నించారు. పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల కార్లను ధ్వంసం చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా రణరంగంగా మారింది. అంతకుముందే ఈ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు మృత్యుంజయ్ స్వామీజీతోపాటు పలువురు బీజేపీ నేతలు, ఆందోళన కారులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.ప్రస్తుతం ఈ సామాజిక వర్గానికి చెందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో 5శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. అయితే, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రిజర్వేషన్లను మరింత పెంచాలని లింగాయత్ పంచమసాలీలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతమున్న 5 శాతం కోటాను 15శాతానికి పెంచాలని కోరుతున్నారు.



# తెలంగాణ తల్లిని అవహేళన చేస్తే నాలుక కోస్తాం

○ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ తల్లిని అవహేళన చేస్తే నాలుక కోస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయం లో మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి పైన బీఆర్ఎస్ పార్టీ అత్యంత హేయమైన, నీచమైన రాజకీయాలు చేస్తోందన్నారు.తల్లివిగ్రహావిష్కరణ తర్వాత కూడా దీక్షలు, ధర్నాలు చేయడం వారి అహంకారానికి పరాకాష్ట అని తెలిపారు .పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహానికి ఎందుకు అధికారిక గుర్తింపు ఇవ్వలేదో ముందు సమాధానం చెప్పాలని తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు అధికారంగా ప్రతిష్టించలేదని ప్రశ్నించారు.తెలంగాణ భవన్ లో పెట్టుకున్న విగ్రహాన్నే అధికారికంగా గుర్తించాలని డిమాండ్ చేయడం పరాకాష్ట ప్రతి రూపం అన్నారు .తెలంగాణ తల్లి విగ్రహం పై కేసీఆర్ కుట్ర లు చేశాడని..తెలంగాణ పిత గా తన విగ్రహాన్ని ఏర్పాటు చేయించుకోవాలనే తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించలేదున్నారు.తాను చనిపోయేంత వరకు తెలంగాణ లో బీఆర్ఎస్ పార్టీ నే అధికారంలో ఉంటుందని కేసీఆర్ భావించాడు.. అందుకే తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ప్రతిష్టించలేదన్నారు.తన మరణం తర్వాత తెలంగాణ పిత గా తన విగ్రహాన్ని పెట్టించుకోవాలన్నదే కేసీఆర్ కుట్ర అన్నారు .



ఉద్యమా సమయంలో మొట్టమొదటగా తెలంగాణ తల్లి విగ్రహన్నీ ఆలేరు నియోజకవర్గం రాజపేట మండలం బేగం పేట గ్రామంలో ఇలంతో రుపమ్ తోనే విగ్రహాన్ని నెలకొల్పరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరికీ ఆమోదయోగ్యమైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఆ విగ్రహంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆడబిడ్డ ను చూసుకుంటున్నారు.. ఆకుపచ్చని రంగులో తల్లి విగ్రహం చూస్తుంటే ఆనందం తో ఒళ్ళు పులకరించి పోతుంది..ఇలాంటి అద్భుతమైన తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, శిల్పి కి ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూసి ఓర్వ లేక బీఆర్ఎస్ ధర్నాలు, దీక్షలు అంటోంది..తెలంగాణ భవన్ లో కవిత దీక్ష చేస్తున్నారు..? ఆమె దీక్ష ఎందుకు అని ప్రశ్నించారు..తెలంగాణ తల్లి విగ్రహం తనలా లేదని ఆమె దీక్ష చేస్తుందా? నీ లాగా వజ్ర వైడూర్యాలు, కిరీటాలు, ధగధగా మెరిసే పట్టు చీరలు తెలంగాణ తల్లికి లేవని బాధ పడుతున్నావా అని, ఒక చేతిలో లిక్కర్ బాటిల్ పెట్టి ఫామ్ హౌస్ లు, గెస్ట్ హౌస్ ల్లో తెలంగాణ తల్లి ఉన్నట్లు పెట్టాలా?కొంచెమైనా సిగ్గుండాలి మాట్లాడటానికి అన్నారు .

ఏ మొహం పెట్టుకొని దీక్ష చేస్తున్నారు..?..తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారంగా ఎందుకు ప్రతిష్ట లేదని మీ అయ్య ఫామ్ హౌస్ ముందు దీక్ష చేయి..అమ్మ ను మార్చారని కేటీఆర్ అంటున్నాడు.. మాట్లాడటానికి సిగ్గుండాలి. మీరు కనీసం అమ్మ ను గుర్తించని బిడ్డలు మీరు.. అమ్మ ను అనాథ చేసిన నీచులు, రాక్షసులు, కిరాతకులు మీరు తెలంగాణ తల్లిని అనాథ గా మార్చి తెలంగాణ భవన్ లో బందీ చేసింది మీరు..అమ్మ గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు.. మా ముఖ్యమంత్రి అమ్మ ను గుర్తించి, సగర్వంగా సచివాలయంలో నడిబొడ్డులో ప్రతిష్ఠించారు..అమ్మకు తెలంగాణ రూపాన్ని ఇచ్చి రాష్ట్ర ప్రజల ఇలవేల్పుగా మార్చారు.కేటీఆర్ .. తెలంగాణ తల్లి అవహేళన చేస్తే నాలుక కోస్తాం అని హెచ్చరించారు.

# అరుణోదయ 50 వసంతాల సభలను విజయవంతం చేయాలి

- కామ్రేడ్ విమలక్క



**విశ్వంభర, హైదరాబాద్ :** అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యగా పిలువబడుతున్న అరుణోదయ 1974 ఆగస్టు 16న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో అమరుడు కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ నేతృత్వంలో ఏర్పడి 50 ఏళ్ళు పూర్తవుతుంది. ఈ సందర్భంగా అరుణోదయ 50 వసంతాల ప్రస్థానాన్ని ఎత్తి పడుతూ డిసెంబర్ 14, 15 తేదీల్లో హైదరాబాదులోనే మహా సభలు జరగనున్నాయి. మొదటి రోజు వి.ఎస్.టి హాలులో రెండవ రోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న ఈ సభల విజయవంతానికి ప్రజా కళాకారులు, సాహితీవేత్తలు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు సహకరించాలని కామ్రేడ్ విమలక్క కోరారు. 50 వసంతాల సభల నిర్వహణ కామ్రేడ్ విమలక్క నాయకత్వంలో 15 మందితో నిర్వహణ కమిటీ ఏర్పరిచారు. 14వ తేదీ ఉదయం 10 గం.లకు ర్యాలీగా వివిస్టి హాలుకు బయలుదేరుతారు. ప్రొఫెసర్ రామస్వామి (చెన్నై), ఇస్లాం (ఢిల్లీ), డాక్టర్ బుర్ర రమేష్ (బోపాల్) లతో పాటు ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, సతీష్ చందర్, ప్రొఫెసర్ హరగోపాల్ , కే.శ్రీనివాస్, ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ కొల్లాపురం విమల, ప్రొఫెసర్ జయదీర్ తిరుమల రావు తదితరులను సభలకు ఆహ్వానిస్తామని విమలక్క తెలిపారు. అన్ని అరుణోదయలతో పాటు, విప్లవ సాంస్కృతిక సంఘాలన్నింటినీ సౌహార్ద ప్రతినిధులుగా ఆహ్వానించి, అంతిమంగా అరుణోదయలన్ని ఏకం కావాలనే ఐక్యత తీర్మానాన్ని ప్రవేశపెడతారని విమలక్క తెలిపారు. ఆధిపత్య మత చాందసవాదం సాంస్కృతిక సామ్రాజ్యవాదంలో కేంద్ర బిందువుగా సాగుతున్న తరుణంలో ఈ సభలను విప్లవ ప్రజాస్వామిక, లౌకిక శక్తులన్నీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# రైతు-కూలీ సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



**విశ్వంభర, హైదరాబాద్ :** రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం కై డిమాండ్ చేస్తూ, మోసాల పుట్ట ధరణి డొల్ల తనపు భూమాత అనే అంశంపై రాష్ట్ర రైతాంగ సదస్సు నిన్న (సోమవారం) హైదరాబాదులోని, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర రైతాంగ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సు లో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.గౌరవ అధ్యక్షులు : బొమ్మకంటి కొమురయ్య (నల్లగొండ), అధ్యక్షులు: పట్లోళ్ల నాగిరెడ్డి (రంగారెడ్డి), ప్రధాన కార్యదర్శి: వెలుతురు సదానందం. (పెద్దపల్లి), ఉపాధ్యక్షులు: బోనాల స్వామి(మెదక్), మోకాళ్ళ సమ్మయ్య(ఖమ్మం) సహాయ కార్యదర్శి: జి సైదులు(నల్లగొండ),రత్న కుమార్ ( పెద్దపల్లి), కోశాధికారి: వెంకటేశ్వరరావు( జనగాం), కార్యవర్గ సభ్యులుగా కిష్టయ్య(సూర్యాపేట), బాబన్న( నిజామాబాద్), మండల యుగేందర్, బండారి పల్లి రాజయ్య,నరేందర్( వరంగల్), చంద్రం, ( మెదక్), వజ్రక్క( సిరిసిల్ల),కరుణాకర్( జగిత్యాల), అంత్రం కాశీరాం ( ఆదిలాబాద్)లను సదస్సు ఏకగ్రీవంగా 17 మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.తదనంతరము రాష్ట్ర సదస్సు కొన్ని తీర్మానాలను ప్రవేశ పెట్టడం జరిగింది. (1) ధరణిని సంపూర్ణంగా ప్రక్షాళన చేసి రూపొందించామని చెబుతున్న భూ మాత కూడా డొల్లతనంగానే ఉందని సదస్సు అభిప్రాయపడింది. కావున అన్ని చట్టబద్ధహక్కులు కల్పించి సమస్యల పరిష్కారానికి గ్రామసభలకే సర్వాధికారాలు ఇవ్వాలని సదస్సు అభిప్రాయపడింది.(2) తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ రైతుకూలీ పోరాట సమితి ఏర్పడి సుదీర్ఘకాలం పనిచేసింది.ఇప్పుడది భూమి సమస్యతో పాటు భూస్వామ్య వ్యతిరేక పోరాటాల నిర్మాణం కై కృషి చేయాల్సిన అవసరం నుండి టీఆర్‌సీపీఎస్ ను రైతుకూలీ సంఘం గా మార్చాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది.(3) బిఆర్ఎస్ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వ్యతిరేకించి, ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా రుణమాఫీ, రైతు భరోసాలతో, పాటు ఆరు గ్యారెంటీలను అమలుపరచాలని సదస్సు డిమాండ్ చేసింది. రైతాంగానికి గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కల్పించాలని సదస్సు తీర్మానించింది. (4) ప్రజాస్వామ్య హక్కుల పునరుద్ధరణను ఏడో గ్యారెంటీగా ఇచ్చినా , ప్రజాసంఘాలపై ఊపా తదితర అక్రమ కేసులు ఎత్తివేయకపోగా, బూటకపు ఎన్ కౌంటర్ లతో నెత్తుటేర్లు పారియుటకు సిద్ధమైంది. కావున అక్రమ కేసులు ఎత్తేసి, బూటకపు ఎన్ కౌంటర్ లపై జ్యూడిషియల్ న్యాయవిచారణ జరపాలని సదస్సు తీర్మానించింది. ఆపరేషన్ కగారును నిలిపివేయాలని డిమాండ్ చేసింది. (5) బీడీ కార్మికులకు చేతినిండా పని కల్పించకపోగా కోప్తా 2003 చట్టంతో పరిశ్రమను ఎత్తేసే కుట్రలనువ్యతిరేకిస్తూ,కోప్తా 2003 ను రద్దు చేయాలని సదస్సు డిమాండ్ చేస్తూ తీర్మానాలను ప్రవేశ పెట్టడం జరిగింది.




# విచారణకు రండి..

## మోహన్‌బాబు, విష్ణు, మనోజ్‌కు రాచకొండ సీపీ నోటీసులు



**విశ్వంభర, హైదరాబాద్:** జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం వద్ద జరిగిన ఘటనపై రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని మంచు మోహన్‌బాబు, విష్ణు, మనోజ్‌కు రాచకొండ సీపీ నోటీసులు జారీ చేశారు. అదనపు జిల్లా మేజిస్ట్రేట్ హోదాలో సీపీ ఈ నోటీసులు జారీ చేశారు. సీపీ ఆదేశాలతో ఇప్పటికే పోలీసులు మంచు విష్ణు, మోహన్‌బాబు వద్ద ఉన్న లైసెన్స్ గన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

**ఏం జరిగిందంటే?**

జల్‌పల్లిలో సినీనటుడు మోహన్‌బాబు నివాసం వద్ద మంగళవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. తెలంగాణ అదనపు డీజీపీని కలిసిన అనంతరం మనోజ్ దంపతులు మోహన్‌బాబు నివాసానికి చేరుకోగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. భద్రతా సిబ్బంది గేట్లు తీయకపోవడంతో.. 'నా కుమార్తె లోపల ఉంది' అంటూ మనోజ్ అక్కడి భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గేట్లు తోసుకుని లోపలికి దూసుకెళ్లారు. మనోజ్ వెంట వచ్చిన బౌన్సర్లను పోలీసులు బయటకు పంపించేశారు. దాడి జరగడంతో చిరిగిన చొక్కాతోనే మనోజ్ బయటకు వచ్చారు. మరోవైపు, ఈ ఉద్రిక్తతల నడుమ మోహన్‌బాబు తీవ్ర అసహనానికి గురయ్యారు. అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు ప్రతినిధులపై ఆయన చేయి చేసుకున్నారు. మోహన్‌బాబు బౌన్సర్ల దాడిలో ఓ కెమెరామెన్ కిందపడ్డారు. విలేకరులను బయటకు నెట్టేసి బౌన్సర్లు గేటుకు తాళం వేశారు.

### ఆశావర్కర్లపై చేయి చేసుకున్న

# పోలీసులను డిస్మిస్ చేయాలి: కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** హామీల అమలుకు ఆశా వర్కర్లు ఆందోళన చేస్తున్నారని.. నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దాడులు చేయడం హేయమైన చర్య అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పోలీసుల దాడిలో గాయపడిన ఆశావర్కర్లను ఉస్మానియా ఆస్పత్రిలో పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు.

''కరోనా సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఆశావర్కర్లు సేవలందించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేస్తాం. ఆడబిడ్డలపై చేయి చేసుకున్న పోలీసులను డిస్మిస్ చేయాలి. ఆశా వర్కర్ల తరపున ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తాం. వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం'' అని కేటీఆర్ అన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆశ వర్కర్లకు స్థిర వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల సంఘం (బీఆర్‌టీయూ అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీసిన విషయం తెలిసిందే.

## సిద్దిపేటలో వెంకన్న ఆలయం.. టీటీడీ చైర్మన్‌కు హరీశ్‌రావు విజ్ఞప్తి

**విశ్వంభర, తిరుపతి:** కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలిచే తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సిద్దిపేటలో కొలువు దీరనుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. మంగళవారం తిరుపతి వెళ్లిన హరీశ్ రావు టీటీడీ బోచైర్మన్ బీఆర్ నాయుడిని కలిశారు. సిద్దిపేట కోమటి చెరువు ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణం చేపట్టాలని కోరారు.వేంకటేశ్వర ఆలయ నిర్మాణం కోసం సిద్దిపేట కోమటి చెరువు ప్రాంతంలో 5 ఎకరాల 10 గుంటల స్థలాన్ని మంజూరు చేశామని టీటీడీ చైర్మన్‌తో హరీశ్‌రావు తెలిపారు. గతంలోనే టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు పర్యటించి ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. దానికి అనుగుణంగా ఆలయ నిర్మాణ నమూనా, డిజైన్స్ ను రూపొందించారని వివరించారు.

తిరుపతి వేంకటేశ్వర స్వామి అంటే ప్రజలు ఇష్టదైవంగా.. ఇలవేల్పుగా కొలుస్తారని, అలాంటి ఆలయం సిద్దిపేటలో నిర్మించడం గొప్ప అదృష్టమని హరీశ్‌రావు అన్నారు. వచ్చే టీటీడీ బోర్డు మీటింగ్‌లో సిద్దిపేటలో వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి ఆమోదం తెలిపి, మీరే ఆలయ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా బీఆర్ నాయుడిని కోరారు. అందుకు చైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు. వెంటనే చీఫ్ ఇంజనీర్ అధికారి, సంబంధిత అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

# 'మనోజ్.. నువ్వు నా గుండెల మీద తన్నావ్ రా' : మోహన్‌బాబు

**విశ్వంభర, హైదరాబాద్:** తన కుటుంబంలో చోటు చేసుకున్న పరిణామాలపై సినీనటుడు మోహన్‌బాబు స్పందించారు. మంగళవారం రాత్రి తన నివాసం వద్ద జరిగిన ఘటన అనంతరం ఆయన ఆడియో సందేశం విడుదల చేశారు.

''మనోజ్ నువ్వు నా బిడ్డవి. లక్ష్మీప్రసన్న, విష్ణువర్ధన్‌బాబు, మనోజ్ కుమార్ మిమ్మల్ని ఎలా పెంచాను? అందరికంటే నిన్నే గారాబంగా పెంచాను. నీకే ఎక్కువ ఖర్చుపెట్టి చదివించాలని ప్రయత్నించాను. నువ్వు ఏది అడిగినా నీకు ఇచ్చాను. నువ్వు ఈరోజు నా గుండెల మీద తన్నావ్. నా మనసు ఆవేదనతో కుంగిపోతోంది. నా బిడ్డ నన్ను తాకలేదు. కొన్ని కారణాల వల్ల ఇద్దరం ఘర్షణ పడ్డాం. ప్రతి కుటుంబంలోనూ ఘర్షణలు ఉంటాయి.

జల్‌పల్లి ఇల్లు నా కష్టార్జితం.. నీకు సంబంధం లేదు. మంచు మనోజ్ మద్యానికి బానిసగా మారాడు. మద్యం మత్తులో ఎలాగో ప్రవర్తిస్తున్నాడు. ఇంట్లో పనిచేస్తున్న వారిపై దాడికి దిగడం మనోజ్‌కు సరికాదు. ఇక చాలు నా పరువు ప్రఖ్యాతలు మంటగలిపావు. నన్ను ఎవరూ మోసగాడు అనలేదు. నీకు జన్మనివ్వడమే నేను చేసిన పాపమా? ఆస్తులు ముగ్గురికీ సమానంగా రాయాలా? వద్దా? అనేది నా ఇష్టం. ఆస్తులు ఇస్తానా.. లేదా.. దాన ధర్మాలు చేస్తానా? అనేది నా ఇష్టం నా ఇంట్లో అడుగు పెట్టడానికి నీకు అధికారం లేదు. మనోజ్ నీ వల్ల మీ అమ్మ ఆసుపత్రిలో చేరింది. భార్య మాటలు విని




తాగుడుకు అలవాటు పడ్డావు. తప్పు చేయనని చెప్పి మళ్లీ ఇంట్లోకి వచ్చావు. మోహన్ బాబు కొడతాడు, తిడతాడు అనేది సినిమా షూటింగ్‌ల్లో తప్ప ఇంట్లో కాదు. నా ఫిర్యాదుపై పోలీసులు స్పందించ లేదు. నా ఇంట్లోకి ఎవరినీ రానివ్వకుండా అడ్డుకోవాల్సిన పోలీసులు చూస్తూ ఊరుకున్నారు. పోలీసు శాఖ అంటే నాకెంతో గౌరవం ఉంది. న్యాయం, ధర్మంగా నడుచుకోవాలి. మనోజ్ వచ్చి తన బిడ్డను తీసుకెళ్లొచ్చు. రాకపోతే ఆ బిడ్డను జాగ్రత్తగా పెంచుతా. ఆసుపత్రి నుంచి మీ అమ్మ డిశ్చార్జ్ అయిన తర్వాత .. పోలీసుల సమక్షంలో నీకు అప్పగించమని చెబతా. ఇక చాలు.. ఇంతటితో గొడవకు ముగింపు పలుకుదాం'' అని మనోజ్‌కు పంపిన ఆడియో సందేశంలో పేర్కొన్నారు.

**చిరిగిన చొక్కాతో బయటకు వచ్చిన మనోజ్..**

జల్‌పల్లిలో సినీనటుడు మోహన్‌బాబు నివాసం వద్ద మంగళవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. తెలంగాణ అదనపు డీజీపీని కలిసిన అనంతరం మనోజ్ దంపతులు మోహన్‌బాబు నివాసానికి చేరుకోగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. భద్రతా సిబ్బంది గేట్లు తీయకపోవడంతో.. 'నా కుమార్తె లోపల ఉంది' అంటూ మనోజ్ అక్కడి భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గేట్లు తోసుకుని లోపలికి దూసుకెళ్లారు. మనోజ్ వెంట వచ్చిన బౌన్సర్లను పోలీసులు బయటకు పంపించేశారు. దాడి జరగడంతో చిరిగిన చొక్కాతోనే మనోజ్ బయటకు వచ్చారు.

**మీడియా ప్రతినిధులపై చేయిచేసుకున్న మోహన్‌బాబు...**

మరోవైపు, ఈ ఉద్రిక్తతల నడుమ మోహన్‌బాబు తీవ్ర అసహనానికి గురయ్యారు. అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు ప్రతినిధులపై ఆయన చేయి చేసుకున్నారు. మోహన్‌బాబు బౌన్సర్ల దాడిలో ఓ కెమెరామెన్ కిందపడ్డారు. విలేకరులను బయటకు నెట్టేసి బౌన్సర్లు గేటుకు తాళం వేశారు.

## సామాన్యులను లోకమాన్యులుగా తీర్చిదిద్దేది

# శ్రీ మద్భగవద్గీత

> శ్రీమద్భగవద్గీత ద్వారానే మనం భగవంతుడి అనుగ్రహాన్ని పొందగలుగుతాం. గీతలో వర్ణించబడిన ధర్మమే మానవ కల్యాణానికి తోడ్పడే మహత్తర సాధనం. ఆత్మ పరమాత్మ రెండింటిలో సమాన రూపంలో కనిపించే భగవత్ శక్తి భగవద్గీత ద్వారా ప్రజల ముందుకు వచ్చింది. భగవంతుడి కృప దుర్బలుడిని కూడా శక్తిశాలినిగా చేస్తుంది. సామాన్యుడిని సైతం లోకమాన్యుడిగా తీర్చిదిద్దుతుంది. అతడికి దివ్యసంకల్పాన్ని, అద్భుత శక్తిని ఇస్తుంది. పాపాత్ములకు, దీనులకు, దుఃఖితులకు కూడా భగవద్గీత ముక్తిని ప్రసాదిస్తుంది. ప్రతి వ్యక్తికి భగవద్గీత- "నీవు శరీరానివి మాత్రమే కావు. ఆ శరీరంలో నివసించే పరమాత్మవు కూడా అని ఉద్బోధిస్తుంది.



శ్రీమద్ భగవద్గీత యోగ పురుషుడైన, పురుషోత్తముడైన శ్రీకృష్ణ పరమాత్ముని దివ్యవాణి నుండి వెలువడిన అద్భుతమైన తత్వశాస్త్రము. వేదమాత అయిన గాయత్రి పరమ రహస్యం భగవద్గీతలో దాగి ఉందని ధర్మధురందరులైన గీర్వాణ పండితులు భావించారు. జ్ఞానులు, ఆచార్యులు, తత్వశాస్త్రాన్ని బాగుగా తెలిసినవారు శ్రీమద్ భగవద్గీత ను వేదార్థ సంగ్రహంగాను భగవంతుని తత్వదర్శినిగాను భావించారు. కర్మయోగులు గీతను పంచమ వేదంగాను, జీవన సంగ్రామపు ఉపనిషత్తుగాను, కర్మ విజయ సారథిగాను ఎన్నో రీతుల కీర్తించారు. సాధువులు, భక్తులు, యోగులు దీనిని పరబ్రహ్మ అయిన పరమేశ్వరుడి వాక్కుగాను, కల్పవృక్షముగాను, కామధేనువుగాను, శక్తి శాలిగాను, లోక కళ్యాణకారునిగాను, భగవంతుడి గీతం గానూ అభివర్ణించారు.

భగవద్గీత ద్వారానే మనం భగవంతుడి అనుగ్రహాన్ని పొందగలుగుతాం! గీతలో వర్ణించబడిన ధర్మమే మానవ కల్యాణానికి తోడ్పడే మహత్తర సాధనం. ఆత్మ పరమాత్మ రెండింటిలో సమాన రూపంలో కనిపించే భగవత్ శక్తి శ్రీమద్ భగవద్గీత ద్వారా ప్రజల ముందుకు వచ్చింది. భగవంతుడి కృప దుర్బలుని కూడా శక్తిశాలినిగాను చేస్తుంది. సామాన్యుని లోకమాన్యునిగా తీర్చిదిద్దుతుంది. అతడికి దివ్యసంకల్ప శక్తిని ఇస్తుంది. పాపాత్ములకు, దీనులకు, దుఃఖితులకు కూడా భగవద్గీత ముక్తిని ప్రసాదిస్తుంది. ప్రతి వ్యక్తికి అది "నీవు శరీరానివి మాత్రమే కావు. ఆ శరీరంలో నివసించే పరమాత్మవు కూడా.." అని ఉద్బోధిస్తుంది.

శ్రీకృష్ణుడు చెప్పిన భగవద్గీత ఉపదేశాన్ని విని అవిద్య వల్ల అర్జునునిలో ఏర్పడినటువంటి మోహం నశించింది. అతడు సంశయ రహితుడిగా మారాడు. శ్రీకృష్ణుడి సచ్చిదానంద స్వరూపంతో జ్ఞానోదయం పొంది మమేకమయ్యాడు. అర్జునుడు తన అనన్య భక్తి, ఆత్మ సమర్పణం, శరణాగతి ద్వారా ఏ విధంగా భగవంతుని దర్శించుకున్నాడో, అదేవిధంగా మనం కూడా శ్రీమద్భగవద్గీత నిత్య పఠనం తో పరమాత్ముని దర్శించుకోగలుగుతాం. విజయాన్ని, లక్ష్మిని, సంపదను, కీర్తిని, ముక్తిని పొందగలుగుతాం. కృష్ణ ద్వైపాయనుడిగా పిలవబడుతున్న మహర్షి వేద వ్యాసుడు భగవద్గీత వైశిష్ట్యాన్ని గురించి ఇలా అంటాడు.

**గీతా సుగీతా కర్తవ్యాః;**

కి మన్యైః శాస్త్ర సంగ్రహైః|
యా స్వయం పద్మనాభస్య;
ముఖపద్మాత్ వినిఃసృతా||

గీతను సుగీతగా మార్చుకోవడమే మానవుల పరమ కర్తవ్యం. గీత స్వయంగా పద్మనాభుడైన శ్రీమహావిష్ణువు ముఖారవిందము నుండి వెలువడిన దివ్య వాక్యము. అందువల్ల దీనిని విస్మరించి అన్యశాస్త్రముల గ్రంథముల అధ్యయనం వల్ల ప్రయోజనమేమి ఉండదు. అని భావం.

**శ్రీమద్భగవద్గీతపై మహాపురుషుల అభిప్రాయాలు**

జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యుల వారు శ్రీమద్భగవద్గీత పై తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ చెప్పిన ఈ మాటలు ఎంతో గమనించదగినవి. " ప్రజల కళ్యాణమే ప్రయోజనంగా కల ఈ గీతా శాస్త్రము పరమార్థ తత్వానికి విశేష మహత్వాన్ని ఇచ్చి మానవజాతికి అసాధారణమైన ప్రయోజనాన్ని కలగజేస్తుంది. దీన్ని అర్థం చేసుకున్న వారికి సమస్త పురుషోర్థాలు సిద్ధిస్తాయి. అందువల్ల భగవద్గీత పఠనమే పరమ ధర్మం." భక్తి యుగానికి చెందినటువంటి శ్రీమద్ రామాను జాచార్యులు శ్రీ మధ్వాచార్యులు శ్రీ నింబార్కాచార్యుడు మహాప్ర భువు వల్లభాచార్యులు గీతా ప్రభావం వల్ల తమ తమ సంప్రదాయాలను తమ బోధనలను గీత సమ్మతంగా మార్చడానికి యత్నించారు. మరాఠీ కవులైన సంత్ నామదేవ్, భక్తకవి ఏకనాథ్, సమర్థ రామదాసు తదితరులు భగవద్గీత భక్తులే గాక, గీత గాయకులు కూడా. 13వ శతాబ్దంలోని మరాఠీ ప్రముఖ కవి జ్ఞానేశ్వర్ 'జ్ఞానేశ్వరి' అను పేరిట భగవద్గీతను మరాఠీ భాషలోనికి పద్యాలు అనువాదం చేశారు. ఆయన దృష్టిలో- "భగవద్గీత సిద్ధ సరస్వతి పరమార్థ సాధనకు ఆధారం. సాక్షాత్తు శ్రీ మహా విష్ణువు ద్వారా చూపబడిన పరమధామం."

ఇక హిందూ పద పాదషాహి గా ఘన కీర్తి సాధించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ తల్లి గారైన 'జీజియాబాయి' జీవితాంతం భగవద్గీతను పఠనం, గానం చేసింది. ఆమె తన పుత్రుని మనస్సులో కర్మ, భక్తి, జ్ఞానాలతో కూడిన త్రివిధశక్తులకు పునాది వేసింది. అందువల్లనే శివాజీ మహారాజ్ ముస్లింల రాజ్యాధికారంలో ఉన్న కాలంలోనే సువిశాల హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించగలిగాడు. ఇంతటి ఘనత శ్రీమద్భగవద్గీత వల్లే సాధ్యపడిందనే విషయం తెలుస్తుంది. ఝాన్సీ రాణి శ్రీమతి లక్ష్మీబాయి బాల్యంలోనే గీతను కంఠస్థం చేసింది. అందువల్లనే ఆమె భగవద్గీతలో చెప్పబడిన సర్వ ధర్మ పాలనను అనుసరించి అద్భుత సాహసాన్ని, అపూర్వ త్యాగాన్ని, మహత్తర బలిదానాన్ని ఆదర్శాలుగా తన దేశ ప్రజల ముందుంచింది. 19వ శతాబ్ది చివరిలో రామకృష్ణ పరమహంస శిష్యుడైన వివేకానంద స్వామివారు గీత ప్రచారాన్ని విదేశాల దాకా తీసుకొని వెళ్లారు. అందువల్ల ప్రభావితులైన ఎందరో పాశ్చాత్య పండితులు తమ తమ రచనల ద్వారా భగవద్గీత గొప్పదనాన్ని నేటికి కూడా వారి వారి దేశ ప్రజల ముందు ఉంచుతున్నారు అంటే అతిశయోక్తి కాదు.

బాలగంగాధర్ తిలక్ భగవద్గీత పై ఒక పుస్తకాన్ని రచించారు. "స్వాతంత్ర్యమె నా జన్మహక్కు"నే తారక మంత్రాన్ని దేశ ప్రజలకు ఇచ్చిన ఘనత తిలక్ మహాశయుడిదే. అతనిలో అంతటి అద్భుతమైన శక్తిని కలిగించింది శ్రీమద్భగవద్గీత పఠనమే. మోహన్ దాస్ కరంచంద్ గాంధీ అనే సామాన్యుని మహాత్ముడిగా మార్చగలిగింది శ్రీమద్ భగవద్గీత. గాంధీజీ శిష్యుడైన వినోబాభావేను ఋషి తుల్యాయునిగా మార్చింది శ్రీమద్భగవద్గీతయే. ఆయన తమ జీవితాంతం శ్రీమద్భగవద్గీత పై అనేక ప్రసంగాలు చేశారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు భగవద్గీత పై ఒక విమర్శనాత్మక గ్రంథాన్ని రచించారు. అరవింద మహర్షి భగవద్గీత పై ఎన్నో వ్యాసాలు రచించారు. గాంధీజీ భగవద్గీత పై ప్రసంగాలు చేసేవారు గీత శబ్ద కోశాన్ని డిక్షనరీని కూడా వ్రాశారు. భగవద్గీత వైశిష్ట్యాన్ని కొనియాడుతూ గాంధీజీ ఇలా అంటారు.- "ఎప్పుడెప్పుడు నన్ను ఆపదలు ఎదుర్కొంటాయో అప్పుడప్పుడు నేను గీతామాత శరణు వేడుతాను." గీతను తన తల్లిగా భావించారు ఆయన భగవద్గీతను కామధేనువుగా భావించి నిరంతరం ఆ గ్రంథాన్ని గౌరవించారు.

ఇదే పరంపరలో దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారు, కృష్ణ తత్వాన్ని తమ అద్భుతమైన గీతాల ద్వారా ప్రచారం చేస్తున్న శ్రీ సుందర చైతన్యానంద స్వామి వారు 'చైతన్య భగవద్గీత' పేరుతో గీతా వ్యాఖ్యానం రచించడమే కాకుండా, వందలాది గీత జ్ఞాన యజ్ఞాలను దేశ విదేశాల్లో నిర్వహించారు. ఈ మహా పురుషులందరికీ అపారమైన జ్ఞాన శక్తిని, భక్తిని కలిగించింది శ్రీమద్భగవద్గీత పఠనమే. అని చెప్పక తప్పదు. ఇంతటి మహిమాన్వితమైనది భగవద్గీత కనుకనే హిందువులు సర్వ వేద సారముగా భావిస్తారు. భగవద్గీతను తమ ధర్మం గ్రంథంగా, పంచమ వేదంగా భావిస్తారు. భారతదేశంలో శ్రీమద్భగవద్గీతకు ఉన్నంత ప్రాశస్త్యం మరే ఇతర గ్రంథానికి లేదంటే అతిశయోక్తి కాదేమో.అందుకే ప్రతి ఒక్కరమూ ప్రతినిత్యమూ శ్రీమద్భగవద్గీతను పఠిద్దాం! భారత దేశాన్ని మరల గురు స్థానంలో నిలబెడదాం! ఆ దిశగా ప్రయత్నిద్దాం!

### భగవంతుని హృదయం
### శ్రీ మద్భగవద్గీత

శ్రీమద్ భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముని ద్వారా అర్జునుడికి చెప్పబడిన విషయాలు గమనించదగినవి. అవి: ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ కాంతి ఉంటుంది. ఎక్కడ సిగ్గు, ఎగ్గులు, వినయం, విధేయత ఉంటాయో అక్కడ లక్ష్మీదేవి నివసిస్తుంది. ధర్మస్థలిలో శ్రీకృష్ణుడు ఉంటాడు. ఎక్కడ శ్రీకృష్ణుడు ఉంటాడో అక్కడి వారందరికీ విజయం లభిస్తుంది. కీర్తి కలుగుతుంది. ఇంకా కృష్ణుడు అర్జునునితో ఇలా అంటాడు.- "శ్రీమద్భగవద్గీత నా హృదయం. అది పరబ్రహ్మ స్వరూపం. అదే ఈ విశ్వానికి పరమ గురువు." యుగ పురుషుడైన శ్రీకృష్ణునికి శ్రీమద్ భగవద్గీత ప్రచారం ఎంతో ఇష్టమైన కార్యం. కాబట్టి ఆయన అర్జునుడితో ఇలా అంటాడు.- "ఎవరైతే నా భక్తుల ముందు భగవద్గీత ప్రచారాన్ని చేస్తారో వారు నిస్సందేహంగా నా అనుగ్రహాన్ని పొందుతారు ఎవరైతే శ్రద్ధాసక్తులతో భగవద్గీతను అధ్యయనం చేస్తారో, వింటారో వారు పాప విముక్తులవుతారు, పుణ్య లోకాలను పొందుతారు."



వ్యాసకర్త: "సాహిత్య కళా విభూషణ"
-చౌదూరి నరసింహారావు
ఆధ్యాత్మిక,సామాజిక విశ్లేషకులు

# హైందవ సంస్కృతికి ప్రతిబింబం భగవద్గీత

**"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే"**



సమస్త గ్రంథాల సారం వేదం. వేదసారం ఉపనిషత్తు. ఉపనిషత్సారాంశం గీత. గీత సారాంశం భగవంతుని శరణాగతి, అనన్యభావంతో శరణు పొందినవానికి సమస్త పాపాలనుండి రక్షింపబడి భగవంతుడు ముక్తిని ప్రసాదిస్తాడు. హృషీకేశుడైన శ్రీకృష్ణపరమాత్ముడు యుద్ధరంగంలో చేసిన బోధామృతమే భగవద్గీత. 'గీ' అంటే త్యాగం. 'త' అంటే తత్వజ్ఞానం. త్యాగాన్ని, పరమాత్మ జ్ఞానాన్ని వివరించేది. లోకంలో కర్మ మార్గం, భక్తిమార్గం, జ్ఞానమార్గాలను అవలంబించే ఆధ్యాత్మికవేత్తలు ఈ క్షేత్రంలో ఉన్నారు. మోక్షం పొందడానికి కర్మ, జ్ఞాన, భక్తి, యోగ మార్గాలనే నాలుగు ద్వారాలగుండా ఏ ద్వారం నుంచైనా వెళ్లి ముక్తిసౌధంలోకి చేరుకోవచ్చు. ఎక్కడెక్కడి నదులన్నీ సముద్రం చేరునట్లు, ఈ మార్గములన్నియు, జీవుని కైవల్యధామానికి చేరుస్తాయి. చిత్తము తమోగుణంతో కూడిన వాసనలతో నిండిపోయి, కఠినశిల వలె ఉన్నంత వరకు, ఎన్ని పూజలు, హోమాలు, ఉపవాసాలు ఉన్నా, భగవంతునిగాంచలేరు. కొన్ని వేల యుగాలలో చేసిన ఫలితాన్ని సులభంగా పొందే మార్గం భగవద్భక్తి. పంచమవేదంగా ప్రసిద్ధికెక్కిన మహాభారతంలోని భగవద్గీతకు ప్రత్యేకస్థానముంది. భగవద్గీతలోని అక్షరాలకు అనంత శక్తి ఉంది. భగవద్గీత కేవలం భక్తి బోధనే కాదు. హిందూ సంస్కృతి వికాసానికి మూలాధారాలు అందులో ఉన్నాయి. ధర్మక్షేత్రం కురుక్షేత్రం. ఈ కురుక్షేత్రంలోని పాండవులకు, కౌరవులకు మధ్య జరుగనున్న భీకర సంగ్రామం. ధర్మానికి, అధర్మానికి అనాదిగా అవిరామంగా జరుగుతున్న పోరాటం. ఆ పరిస్థితుల్లో పార్థుడే కాదు, ఎవరున్నా, అంతర్మథనానికి లోను కావలసిందే. పార్థుని సందేహాలకు ఇచ్చిన సమాధానమే ఈ గీతాసారం.


నిరాశా నిస్పృహలతో అచేతనావస్థలో ఉన్న పార్థునికి కర్తవ్య బోధ చేసి శ్రీకృష్ణుడు అతనిని యుద్ధోన్ముఖుని కావించాడు. ధర్మసంస్థాపన కోసం బోధించిన ఈ గీత నేటి తరాన్ని కూడా అంతే సమర్థంగా కర్తవ్యోన్ముఖుల్ని చేయగలదు. అనేక సంశయాలకు దారి చూపగల జ్ఞానసంపత్తి ఇది. ఈ జ్ఞాన సంద్రాన్ని మథించిన వారెందరో, మహానుభావులు, విద్యావేత్తలు, తాత్వికులు, వేదాంతులు తమ తమ పరిధిలో వారి అవగాహన ప్రస్ఫుటంగా వివరించారు.

ఇది భారతీయులకే కాక, భగవద్గీతకు గల ప్రాముఖ్యం ఎంతటిది అంటే ఖండ ఖండాంతరాలలో ఆయా దేశ భాషల్లోకి అనువదింపబడి, అభ్యసించబడుతుంది. యావత్ప్రపంచానికీ మహా ప్రసాదం, ఇహపరాలకు, ప్రాపంచిక, ఆధ్యాత్మికాలకు సంబంధించిన అనేక అంశాలు, పండు వొలచినట్లుగా, తర్కబద్ధంగా సుబోధంగా వివరించారు. భగవద్గీతలో స్వల్పంగా కనిపించే విషయాలను వివరిస్తూనే మోక్షాన్ని పొందేందుకు వీలుగా బ్రహ్మవిద్యను బోధించే జ్ఞానాన్ని నిబంధించబడి ఉంది.

గీత అంటే భగవద్గీతే కాదు. వశిష్ఠ గీత, హంసగీత, భ్రమరగీత, శ్రుతిగీత, బ్రాహ్మణ గీత - ఇలా దాదాపు 18 గీతలున్నాయి. గీత శబ్దం వినబడగానే భగవద్గీత ఒక్కటే మన కళ్లముందు.. ప్రత్యక్షమయ్యేది.

నేను యుద్ధం చేయను, బంధువులు, తాతలు, అన్నగార్లు, మేనమామలు, వీరిని చంపి రాజ్యాన్ని పాలించాలి. అందుకే నాకీ రాజ్యం వద్దన్నాడు అర్జునుడు. యుద్ధం ఎందుకు చేయాలో గీతలో రక్కుగా విడమర్చి చెప్పాడు. శ్రీకృష్ణుడు నీ విద్యుక్తధర్మాన్ని నీవు నెరవేర్చు అది కర్మ చేయడం కన్నా గొప్పది. గీత భౌతిక అజ్ఞానం నుండి వుద్ధరించడమే పరమతత్వం. ప్రతి ఒక్కరు కర్మలపై ఆశ లేకుండా కర్మలు చేస్తూ వాటిపైన ఆసక్తి రూపాలి. అపుడే మానవుడు. అభివృద్ధి చెందుతాడు. జడపదార్థం కంటే ఇంద్రియాలు ఉత్తమం. ఇంద్రియాలకంటే మనసు ఉత్తమం. మనసుకంటే ఆత్మ ఉత్తమమైనది. అందుకే మనిషి తాను చేయబడలచిన పని, ఆత్మసాక్షిగా చేయాలి. ఆత్మను ఒప్పిస్తే అన్నిటినీ ఒప్పించినట్లే. ప్రతిఫలాపేక్ష లేకుండా మనము పని చేయడమే మన ధర్మం. యోగశాస్త్రమైన భగవద్గీత ప్రతి యోగాన్ని మరొక యోగంతో సమన్వయ పరుస్తూ అత్యద్భుత రీతిలో ప్రవచిస్తూ ప్రతి ఒక్కరూ తమ జీవితాలకు అన్వయించుకోవాలని చెప్పాడు. మానవజాతికి క్రియాశీలురుగా రూపొందించి ఆత్మ సాక్షాత్కారాన్ని పొందేందుకు శ్రీకృష్ణుని ముఖతః వెలువడిన ఉపనిషత్సారం భగవద్గీత. ధర్మరక్షణకై అర్జునుడికి ప్రబోధించబడినట్టిది.

భగవద్గీతలో జ్ఞాన,కర్మ మార్గాలలో ఏది విశిష్టమైనది అనేదానికి ఎంతటి జ్ఞాని అయినా కర్మలుచేయక తప్పదని కర్మలు చేస్తే ప్రతిఫలాపేక్ష లేకండా చేస్తే దోషం ఉండదని సమన్వయం కనిపిస్తుంది. భగవద్గీతలో ఒక్కొక్క అధ్యాయానికి ఒక్కొక్క పేరు ఉంది. ఒక్కొక్క అధ్యాయ మహత్తు చెప్పడానికి ఒక్కొక్క కథ ఉంది. భగవద్గీతలో 100 శ్లోకాల దాకా సంజయాదుల ప్రశ్నోత్తరాలు, వర్ణనలు, విమర్శలు ఉన్నాయి. గీత మొదటి ఐదు అధ్యాయాలు తన ముఖంగాను, తరువాత వచ్చే 10 అధ్యాయాలు 10 భుజాలుగాను, 16వ అధ్యాయం ఉదరంగాను, 17, 18 అధ్యాయాలు తన రెండు పాదాలుగాను ఉంటాయని శ్రీమహావిష్ణువు చెప్పాడు. భగవద్గీతలో ఒక అధ్యాయమైనా పారాయణం చేయాలి. కనీసం ఒక శ్లోకమైనా త్రికరణ శుద్ధిగా పఠించాలి.



- కావ్యసుధ
హయత్ నగర్
9247313488

# భగవానుడు గీతను ఉపదేశించిన రోజు

## నేడు గీతా జయంతి

దేవదేవుడు శ్రీమహావిష్ణువు ద్వాపరయుగంలో శ్రీ కృష్ణుడిగా అవతరించి దుష్టసంహారం గావించాడు. కురుక్షేత్ర సంగ్రామంలో తన బంధువులను, గురువు, స్నేహితులను చూసిన అర్జునుడి వారితో యుద్ధం చేయడానికి మనసు అంగీకరించదు. ఆ సమయంలో కార్యోన్ముఖుడిని చేయడానికి శ్రీ కృష్ణపరమాత్మ లోకానికి అందించిన బ్రహ్మవిద్య భగవద్గీత. దీనిని మార్గశిర శుద్ధ ఏకాదశి రోజున భగవానుడు అందించాడని నమ్మకం. అందుకే ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా గీతా జయంతిని జరుపుకుంటారు. గీత సాక్షాత్తు భగవానుడి నోటి నుంచి వచ్చింది. ఎలాంటి సందేహానికి తావులేకుండా పరమ ప్రామాణికమైన మానవజాతికి దివ్యమార్గాన్ని చూపే పవిత్ర గ్రంథం భగవద్గీత.

**గీకారం త్యాగరూపం స్యాత్, తకారమ్**
**తత్వబోధకమ్, గీతా వాక్య మిదమ్ తత్వం,**
**జ్ఞేయమ్ సర్వ ముముక్షుభి:**

గీత అనే రెండక్షరాల తాత్పర్యాన్ని ఈ శ్లోకం తెలియజేస్తుంది. "గీ" అనే అక్షరం త్యాగాన్ని బోధిస్తే, "త" అనే అక్షరం తత్వాన్ని అంటే ఆత్మస్వరూపాన్ని ఉపదేశిస్తుంది. గీత అనే రెండు శబ్దాలకు అర్థం ఇదేనని ముముక్షువులు తెలుసుకోవాలని పండితులు పేర్కొంటున్నారు. త్యాగ శబ్దానికి నిష్కామ యోగమైన కర్మ ఫలత్యాగమనీ లేక సర్వసంగపరిత్యాగమనీ అర్థం. అలాగే తత్వబోధన ఆత్మసాక్షాత్కారమనీ, బంధం నుంచి విముక్తి పొందడం అనే అర్థం ఉంది. ఈ పరమ రహస్యాన్నే గీతాశాస్త్రం ఉపదేశిస్తుంది. అలాంటి పరమపావనమైన గీత భగవానుని నోటి నుంచి వెలువడిన మహాపుణ్యదినం మార్గశిర శుద్ధ ఏకాదశి. నేడు ఈ పవిత్ర గ్రంథాన్ని స్పృజించినా మహాపుణ్యం దక్కుతుంది. ఇక దీని పఠన ప్రభావాన్ని వర్ణింపసాధ్యం కాదు. మానవాళి సర్వ సమస్యలకు పరిష్కారాన్ని సూచించే జగద్గురువైన ఈ గ్రంథాన్ని పఠించడం నేటి నుంచైనా ప్రారంభిద్దాం.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాననందనః|,**
**పార్థోవత్సః సుధీర్భోక్తాదుగ్ధం గీతామృతమ్మహత్||**

సర్వ ఉపనిషత్తులను ఒక ఆవుగా,అర్జునుడిని దూడగా మలిచిన కృష్ణుడు తాను గోపాలకుడిగా వ్యవహరించాడు. అర్జునుడనే దూడను ఆవు దగ్గర పాలు తాగడానికి విడిచి, ఒక పక్క పార్థుడికి అందిస్తూనే, మరొవైపు లోకానికి పాలను (ఉపనిషత్ సారమైన గీతను)అందిచాడు. అందుకే గీత సకల ఉపనిషత్‌ల సారం. అర్జునుడు తప్ప, మరెవరి ద్వారా ఈ ఉపదేశం ఇంత చక్కగానూ శాశ్వతకాలంగానూ అందరికీ చేరదు. అందువల్లనే కృష్ణుడు బాగా ఆలోచించి తానే అర్జునునడికి ఈ మోహబుద్ధిని పుట్టించి, ఇనుముతో వస్తువుని తయారుచేయదలిచాడు. కమ్మరి ఒక వస్తువును తయారుచేయాలంటే ఇనప ముక్కను కొలిమిలో ఎర్రగా కాలుస్తాడో, అలా అర్జునుడికి శ్రీకృష్ణుడు నిర్వేదాన్ని కలిగించాడు. ఆ విషయాన్నే తన ఉపదేశంలో పరోక్షంగా చెప్పాడు. మన వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః. అంటే నేననుకున్న మార్గానికే వాళ్లస్తారు తప్ప నేను వాళ్ళ మార్గానికి వెళ్ళను అని అర్థం.

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.

**చిరునామా:**
V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్

editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# జిల్లాలో గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలలో హాజరు కానున్న 7,470 మంది అభ్యర్థులు
- ఇన్చార్జి కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ లెనిన్ వత్సల్ టోప్పో



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. వీరబ్రహ్మచారి, అదనపు ఎస్పీ చెన్నయ్య, గ్రూప్ 2,పరీక్షల ఆర్సిఓ డాక్టర్ బలరామ్ నాయక్, సంబధిత అధికారులతో కలిసి గ్రూప్ 2, పరీక్షల నిర్వహణపై ఇన్చార్జి కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్ 2, పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం, పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 7,470 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. డిసెంబర్ 15వ తారీకు ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుంది. డిసెంబర్ 16 ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు జరుగును. నాలుగు దఫాలుగా పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రంలోకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాలని, మొబైల్ ఫోన్స్ ఎలక్ట్రానిక్స్ వస్తువులతో రాకూడదని, పరీక్షలు జరుగు కేంద్రాల వద్ద 144, సెక్షన్ విధించి, రక్షణ చర్యలు తీసుకుని ఆ ప్రాంతంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయడం జరుగుతుందని తెలిపారు.

పరీక్షా కేంద్రాలలో విద్యుత్ సదుపాయం సరిచూసుకోవాలని, టాయిలెట్స్, త్రాగునీరు, అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత సెంటర్ నిర్వాహకులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయం రాకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్రాల వద్ద సానిటేషన్ నిర్వహించాలని, పరీక్షలు జరిగే సమయాలలో అభ్యర్థుల సౌకర్యార్థం బస్సుల సమయాలను మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డీవోలు గణేష్,కృష్ణవేణి, డీ ఆర్ డీ ఓ మధుసూదన్ రాజు, డీపీఓ హరిప్రసాద్, డీవీహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, వేముల సురేష్, తహసీల్దర్లు, గ్రూప్ 2, పరీక్షల ప్రత్యేక అధికారులు, చీఫ్ సూపర్డెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, కలెక్టరేట్ పర్యవేక్షకులు భద్రకాళి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఫార్మసీ మహిళా కళాశాలలో

## విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




**విశ్వంభర, మహబూబాబాద్ :** మహబూబాబాద్ పట్టణం అనంతారం శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ ఫార్మసీ మహిళా కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ సిద్ది వీరేశం, జిల్లా కోఆర్డినేటర్ జాక్వలైన్ హాజరయ్యారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.స్వప్న మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కళాశాలలో సీటు సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఫార్మసీ విద్యలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ సిద్ది వీరేశం, జిల్లా కో.ఆర్డినేటర్ జాక్వలైన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని, ఫార్మసీ విభాగం ప్రపంచంలోనే ప్రథమస్థానంలో ఉందని కొనియాడారు. విద్యార్థులు ఉత్సాహంగా అన్ని పోటీ పరీక్షలలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో గోడౌన్ లోని సీసీ కెమెరాలు, భద్రతా పరిస్థితులను సమీక్షించారు. తనిఖీ అనంతరం లాక్ బుక్‌లో సంతకం చేసి, అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ తనిఖీలో భాగమని, ఈవీఎం గోడౌన్ భద్రతకు ఎల్లప్పుడూ పటిష్ఠ నిఘా ఉండాలని ఆదేశించారు. ప్రత్యేకంగా, సీసీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, గోడౌన్ భద్రతను మరింత బలపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ అబ్బాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, గోదాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ నగర్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు




**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఫేజ్ 3 లో తెలంగాణ పాస్టర్ ఫెల్లోషిప్ ఆధ్వర్యంలో ప్రీ క్రిష్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ అంటేనే ఏసుప్రభు ఆరాధించడం, పూజించడం అన్నారు. తెలంగాణ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ హానరబుల్ ప్రెసిడెంట్ ఎ.ఎలీష, ప్రెసిడెంట్ ఎన్.జాన్, జనరల్ సెక్రెటరీ ఎస్.వసంత్ కుమార్, ట్రెజరర్ ఎన్. విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్స్ తిమోతి బాబు, కె.ప్రభాకర్, జాయింట్ సెక్రటరీస్ కె.రాజు, యం. సంజీవ, గంట డేవిడ్ రాజ్, పి. ఐజాక్ రాజ్, టి. నొవాహు, ఈ.సీ. మెంబర్లు యం. ప్రేమ్, యం. భాస్కర్, సి.యాకోబు, బి. పాండు, ఎన్. మోజెస్, ఏస్.ఆనంద్, ఆర్. డానియల్, బీఆర్ఎస్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, భాలు శ్రీ, ముచ్చింతల జగన్, మహమ్మద్ జాహెద్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ 2024 మండల స్థాయి పోటీలు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** సీఎం కప్ 2024 మండల స్థాయి పోటీలను మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ భద్రాచలం జూనియర్ కాలేజ్ గ్రౌండ్ నందు వాలీబాల్, కోకో, కబడ్డీ, ఫుట్బాల్, అథ్లెటిక్స్ క్రీడలను ప్రారంభించడం జరిగింది. ఈ పోటీల్లో సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడాకారులు ఈ పోటీలలో ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయిలో కూడా మెడల్స్ సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ స్పోర్ట్స్ ఆఫీసర్, ఎం పరంధామ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంఈఓ, డీ ఎల్ పీ ఓ భద్రాచలం గ్రామపంచాయతీ ఈవో, పీడీ లు మరియు పీఈటీ లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జీవి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

**విశ్వంభర, హైదరాబాద్:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. పాఠశాల విద్యార్థులకు వరుసగా మూడు రోజులు సెలవులు రానున్నాయి. డిసెంబర్ 24 నుంచి 26 వరకు ప్రభుత్వం క్రిస్మస్ హాలిడేస్ గా ప్రకటించింది. డిసెంబర్ 24 న క్రిస్మస్ ఈవ్, 25 న క్రిస్మస్, 26న బక్సింగ్ డే (జనరల్ హాలిడే) కాబట్టి వరుసగా మూడు రోజులు సెలవులు వస్తున్నాయి. హైదరాబాద్ తో పాటు తెలంగాణలోని ఇతర జిల్లా లోని స్కూళ్లకు ఈ సెలవులు వర్తించనున్నాయి.

## రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రి కోమటిరెడ్డిని కోరిన ఎమ్మెల్యే జీఎంఆర్



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గంలో రహదారులను విస్తరించడంతోపాటు, మరమ్మత్తు పనులకు నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి ని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. మంగళవారం బంజారాహిల్స్ లోని మంత్రి నివాసంలో కలిసి, వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు రోడ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకమైన పరిశ్రమలు ఉండటంతో పాటు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటంతో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, దీంతో వివిధ కాలనీల ప్రజలు, ఈ ప్రాంతంలో ఉన్న ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు నిత్యం ప్రమాదాలబారిన పడుతున్నారని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా పటాన్ చెరు నుంచి శంకర్ పల్లి వరకు ఉన్న డబుల్ లైన్ రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించాలని.. ఇందుకోసం 84 కోట్ల రూపాయలు కేటాయించాలని..పటాన్ చేరు నుండి ఇంద్రేశం, పెద్ద కంజర్ల మీదుగా బేగంపేట వరకు రహదారి విస్తరణకు 56 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అతి త్వరలో రహదారుల అభివృద్ధి మరమ్మతులకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం రోడ్ల మరమ్మత్తులు, విస్తరణ విషయంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతుందని మంత్రి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ఇంటింటికి తిరుగుతూ..

## సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం కార్యదర్శి



**విశ్వంభరం, మహబూబాబాద్:** కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామంలో సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అధ్యయనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న మాట్లాడుతూ గ్రామంలో పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పనులు చేసి డబ్బుల కోసం వెళ్లాల్సి వస్తుందని, ఆసరా పెన్షన్ల కోసం కూడా కొన్నిసార్లు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నట్లు గతంలో చిట్టే కొమురమ్మ అనే మహిళ పెన్షన్ డబ్బుల కోసం ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తు పడి మరణించడం జరిగిందని, గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మరణించిన దగ్గర్నుండి ఉపాధి పనులు చేయించట్లేదని ప్రజలు తెలిపారని ఫీల్డ్ అసిస్టెంట్ నియమించి పనులు కల్పించాలని, పెండింగ్ బిల్లులు ఇప్పించాలని, మూడు సంవత్సరాల క్రితం అంగన్వాడి ఆయా మరణించిందని ఆమె బదులు వేరే వారిని నియమించాలని, గ్రామంలో డిగ్రీలు పూర్తిచేసి సాంకేతిక విద్య అభ్యసించిన నిరుద్యోగులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక తమ ఇబ్బందులు తెలియజేశారని పరిష్కారానికి , ఈ ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయని వాటికి అనుబంధంగా ప్రాసెస్ సింగ్ పరిశ్రమలు ఏర్పాటుచేయాలని, ఇండ్లు లేవని పెళ్లిళ్లు జరిగి పిల్లలు స్కూల్లోకి వెళుతున్న రేషన్ కార్డులు లేక సంక్షేమ పథకాలు అందడం లేదని ప్రజలు తమ ఆందోళన సర్వే బృందానికి తెలిపారని వాటి పరిష్కారానికి ఆందోళన పోరాటాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నీరుటి జలంధర్ సోమారపు ఎల్లయ్య అల్పుగొండ సావిత్ర తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులను నియంత్రించాలి




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో విచ్చలవిడిగా వెలసిన బెల్టు దుకాణాలను బందు చేయించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి కందుల హనుమంతు డిమాండ్ చేశారు. సీపీఎం రామన్నపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి, అనంతరం మాట్లాడుతూ రామన్నపేట కేంద్రంలో వీధివీధికి బెల్టు షాపులు వెలసి, అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాడవాడలా బెల్టు షాపులు వెలియడంతో, ఎలాంటి సమయంలో అయినా మద్యం లభిస్తుండటంతో యువత మద్యానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, స్థానిక మద్యం దుకాణాలు, బెల్టు దుకాణాదారులు కుమ్మక్కైనా ఎక్సైజ్ శాఖ వారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటి సభ్యులు బావండ్లపల్లి బాలరాజు, గొరిగే సోములు, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, అప్పం సంతోష్, బావండ్లపల్లి సత్యం, రాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సేన సమావేశంలో అన్ని జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షునిగా పెద్ద సన్యాసి రావు



**విశ్వంభర, షాద్‌నగర్:** నాలుగు కోట్ల జనాభా గల తెలంగాణలో రెండు లక్షల పై చిలుకు బీసీ జనాభా ఉన్నప్పటికీ వారు విద్యా, ఉద్యోగ, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగకపోవడంతో బీసీలను విద్యా , ఉద్యోగ, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదుగుదల చేయాలనే ఉద్దేశంతో బీసీ సేన ఏర్పాటు చేయబడిందని, అలాగే తెలంగాణలోని అన్ని జిల్లాలలో జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే మహబూబ్నగర్ జిల్లాలో కమిటీ ఏర్పాటు చేశామని మంగళవారం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాకు పెద్ద సన్యాసిరావును నూతన అధ్యక్షులుగా నియమిస్తున్నట్లు బీసీ సేన జిల్లా యువజన అధ్యక్షుడు శ్రీధర్ వర్మ ముదిరాజ్, బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ అధ్యక్షతన ప్రకటించారు. బీసీ సేన రాష్ట్ర కార్యదర్శి మానపాటి ప్రదీప్ ఆధ్వర్యంలో, రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు కాడ శ్రీనివాస్ అధ్యక్షతన బీసీ సేన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా దిశలు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజికపరంగా ఎదగాలని ఉద్దేశంతో రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ ఒంటరి పోరాటం చేస్తున్నారని, మనందరం కలిసికట్టుగా సహాయ సహకారాలు అందించుకొని అందరం ఒక్కటై పోరాడితే బీసీలకు రాజ్యాధికారం సాధించడం సులువు అవుతుందని ఈ సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మేడ్చల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెద్ద సన్యాసిరావు మాట్లాడుతూ తనకు న్యాయవాదిగా ఎంతో అనుభవం ఉందని, నూతన బాధ్యతలతో బీసీలకు విద్యా వృత్తి ఆర్థిక రాజకీయ సామాజికపరంగా ఎదగడానికి సంపూర్ణ సహకారాలు అందిస్తానని, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్, జిల్లా బీసీ సేన అధ్యక్షుడు క్యాసెట్ శ్రీనివాస్, జిల్లా యువజన అధ్యక్షుడు శ్రీధర్ వర్మ ముదిరాజ్, బాలకృష్ణ, యాదయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 26 నుంచి నెహ్రూ కప్ క్రికెట్ పోటీలు

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలంలో మూడు దశాబ్దాలుగా ప్రతి ఏట అత్యంత ప్రతిష్టాకరంగా నిర్వహిస్తున్న 29వ నెహ్రూ కప్ అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు డిసెంబర్ 26 నుంచి జనవరి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి,వాతాడి దుర్గా అశోక్ లు తెలిపారు. భద్రాచలంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నెహ్రూ కప్ షెడ్యూల్ ని విడుదల చేయడం జరిగింది. టోర్నమెంట్ లో విజేతకు రూ. 50,000 లు ట్రోఫీ, రన్నర్స్ కు రూ. 30,000 లు ట్రోఫీ వీటితో పాటు టోర్నమెంట్ లో ప్రతిభ చాటిన వారికి బెస్ట్ బ్యాట్స్ మాన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ తదితర అవార్డ్స్ తో పాటు వ్యక్తిగత బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. టోర్నమెంట్ లో పాల్గొనేందుకు ఆసక్తిగల ప్రముఖ పేరొందిన క్రికెట్ జట్లు డిసెంబర్ 20వ తేదీలోగా తమ ఎంట్రీలను కన్వీనర్, ఎస్ కే సలీం, అబ్బాస్ ఫుట్ వేర్, క్రికెట్ గ్రౌండ్ ఎదురుగా, భద్రాచలం, సెల్ 9440101108 అనే చిరునామాకు పంపించాలని వెల్లడించారు. గత 30 ఏళ్లుగా నెహ్రూ కప్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని, ఈసారి నిర్వహించే ఈ టోర్నమెంట్ కూడా ఎప్పటిలాగే అందరూ తమ అమూల్యమైన సలహాలు, సహకారం అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ కప్ క్రికెట్ టోర్నమెంట్ అధ్యక్షులు అట్లూరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి దాట్ల శ్రీనివాసరాజు, కన్వీనర్ ఎస్కే సలీం, కోశాధికారి కుంచాల సదానందం (సిద్దు) ఉపాధ్యక్షులు గుమ్ములూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మడిపల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## పోరాట పటిమకు ప్రతిరూపం సాధారణ మహిళ రూపం



**విశ్వంభర, ఆమనగల్లు:** రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలు ప్రతి బింబించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపకర్తలు, ప్రో గంగాధర్, ఎంపీ రమణారెడ్డిలు తెలంగాణ ముఖ్యమంతి ఎనుముల రేవంత్ రెడ్డి సలహాతోనే రూపొందినట్లు తెలంగాణ రాష్ట్ర చిత్రకాళాకారుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆమనగల్లు కు చెందిన రూపం వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఆయన టీమ్ సూచన మేరకు సాధారణ మహిళగా కనిపించేలా, పోరాట పటిమకు ప్రతిరూపం గా విగ్రహాన్ని తీర్చిదిద్దినట్లు, కిరిటాలు, అభరణాల వంటి అడంబారాలు లేకుండా తెలంగాణ ఆకుపచ్చగా, ఆశీస్సులు అందజేసే విధంగా తెలంగాణ సుభిక్షంగా ఉండాలన్న భావన స్పూరించేలా వ్యవసాయానికి గుర్తుగా ఆకుపచ్చ రంగు అవసరమని సీఎం తెలిపారని వెంకటరెడ్డి అన్నారు. సమావేశంలో కళలింగం, జానుశ్రీనివాస్ తదితరులు వున్నారు.

## మాత పోచమ్మ దేవాలయానికి ఉప్పల భారీ విరాళం



**విశ్వంభర, తలకొండపల్లి:** తెలంగాణ మిషన్ భగీరథ కార్పొరేషన్ మాజీ వైస్ ఛైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ గత బోనాల ఉత్సవాల సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని శ్రీ మాతా పోచమ్మ దర్శించుకుని నూతన దేవాలయ నిర్మాణానికి ఒక లక్ష 51 వేల విరాళం ప్రకటించారు. ఆ ప్రకారం మంగళవారం ఆలయం భూమి పూజ కార్యక్రమం కొరకు మొదటి విడతగా 50 వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు ను అందజేశారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ సర్పంచ్ జ్యోతియ్య, బీఆర్ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్,హన్మ నాయక్, ఆలయ కమిటీ అధ్యక్షులు నరసింహ,సత్యం, శ్రీనివాసులు, రాజశేఖర్,బాలస్వామి,రాజు, కిష్టయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో

## విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిహాల్ జన్మదినం సందర్భంగా సంబు అనూష, మహేష్‌లు సమకూర్చిన 100 పరీక్షా ప్యాడ్ లను క్లాస్మేట్ క్లబ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, లైన్స్ క్లబ్ కు చెందిన చంద్రశేఖర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాండు, ఉపాధ్యాయులు, అశోక్ రెడ్డి, కృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



# జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- రాజీపడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో ఇరు వర్గాలు రాజీ కుదుర్చుకునేల చూడాలి
- సైబర్ నేరాలలో హోల్డ్ చేయబడిన డబ్బు తిరిగి బాధితులకు అందే విధంగా చూడాలి
- అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరితగతిన చేదించాలి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యస్.హెచ్.ఓ లకు పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పి రూపేష్




**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా పోలీసు అధికారులతో ఎస్.పి రూపేష్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్.పి రూపేష్ మాట్లాడుతూ ఈ నెల 01 నుండి 14 వరకు జరుగుతున్న జాతీయ మెగా లోక్అదాలత్ ను పురస్కరించుకొని, జిల్లా వ్యాప్తంగా నమోదైన, రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి, అన్ని కేసులలో ఇరు వర్గాలు రాజీ పడేలా వారికి గైడ్ చేయాలని సీఐ లకు సూచనలు చేశారు. సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు కోల్పోయిన/ హోల్డ్ చేయబడిన డబ్బు తిరిగి బాధితులకు చేరే విధంగా సంబంధిత బ్యాంక్ అధికారులకు కోర్టు ద్వారా ఉత్తర్వులు అందించాలని సూచించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో ఇరు వర్గాలు రాజీ పడవలసిందిగా సూచించారు. ఈ కాన్ఫరెన్స్ నందు అదనపు (ఎస్.పి) ఎ.సంజీవ రావ్, డీ 4 సీ (డీఏస్పీ) వేణుగోపాల్ రెడ్డి, డీ 4 సీ సీఐ రవి, యస్.బి సీఐ విజయ్ కృష్ణ, డీసీఆర్బీ సీఐ రమేష్, కోర్టు లైజనింగ్ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## సమాచార హక్కు ప్రచార సమితి జిల్లా కన్వీనర్‌గా అంజ్యా

**విశ్వంభర, వెల్దండ:** సమాచార హక్కు ప్రచార సమితి నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ గా వెల్దండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన పాత్లావత్ అంజ్యా ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.సమాచార హక్కు చట్టం2005పై ప్రజలకు విస్తృతంగా అవగాహన చేయడానికి సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు సేవచేయడానికి తగినంత సమయం కేటాయించాలని, ప్రచార సమితి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడంలో తనవంతు బాధ్యతను నిర్వహిస్తూ, ప్రచార సమితి నియమ నిబంధనలకు లోబడి, రాష్ట్ర కమిటీ మరియు జిల్లా కమిటీ నిర్ణయాలు, ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని ప్రజలందరికి మేలు కోసం కృషి చేయాలని అంజ్యా కు సమితి నాయకులు సూచించారు.

## మున్సిపల్, వాటర్ వర్క్స్, విద్యుత్ సిబ్బందికి సత్కారం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కే పురం డివిజన్ పరిధిలోని ఆర్కే పురం నివాసుల ఐ టీ డీ ఇ ఎస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ పురం కాలనీలో విద్యుత్ వీధి దీపాలు, వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు,సానిటేషన్ సిబ్బంది, ఇతర సేవలు అందించే వారందరికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిలుక ఉపేందర్ రెడ్డి సర్వీస్ ప్రొవైడర్ల ను ఘనంగా సత్కరించి, కొత్త బట్టలు, చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ అనునిత్యం కాలనీలో నివాసులందరికీ సేవలందిస్తున్న వారందరు సేవలు అభినందనీయమన్నారు. ఇంత అద్భుతమైన కార్యక్రమం చేపట్టిన సొసైటీ కార్యదర్శి రామారావు ని ఇతర సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ అన్నపూర్ణ, నరహరి రావు, గణేశాబాబు, గోపాల్, మునిపల్లె శ్రీనివాస్, శ్రవణ్, సుధాకర్‌రావు, నీలిమ, రాధ, విజయలక్ష్మి, స్వప్న, అర్చన, పుష్ప, సరిత, సురేఖ, మాధవి డాక్టర్ పద్మకుమారి, రాజశేఖర్, సునీల్ కుమార్, లక్ష్మణ్, శ్రీధర్‌రావు, నరసింహారాజు, నరసింహామూర్తి, యాకయ్య, రవి, బాబు పాల్గొన్నారు.

## కేఎల్ఐ కాలువలో గుర్తుతెలియని మృతదేహం

**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణ శివారులోని కెఎల్ఐ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు కల్వకుర్తి ఎస్ఐ తెలిపారు. వ్యక్తి వయస్సు 35 సం. నుండి 40 సం. మధ్య ఉంటుందని బట్టలు లేకుండా ఉన్నాడని, స్నానానికి వెళ్లి కాలువలో జారి పడినట్లుగా స్థానికులు అనుమానం వ్యక్తం చేశారని తెలిపారు. అనుమానాస్పదంగా మృతి చెందినట్లుగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆల్ ఇండియా యూనివర్సిటీకి ఎంపికైన పురుషోత్తం



**విశ్వంభర, హైదరాబాద్ :** ఇటీవల మధ్యప్రదేశ్ భోపాల్ లో జరిగిన సౌత్ వెస్ట్ యూనివర్సిటీ టోర్నమెంట్ లో 55 కేజీల విభాగంలో జాతీయస్థాయిలో 4వ స్థానంలో నిలిచి, హర్యానాలో జరుగనున్న ఆల్ ఇండియా యూనివర్సిటీ టోర్నమెంట్ కు సెలెక్ట్ అయిన ఏ.పురుషోత్తం ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఏ సోనీ బాలాదేవి అభినందించారు. యూసఫ్ గూడలోని కెవిబిఆర్ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ కోచ్ ఉత్తంకుమార్ వద్ద శిక్షణ పొందుతున్న పురుషోత్తం ఆల్ ఇండియా యూనివర్సిటీ టోర్నమెంట్ కు ఎంపిక అయినందుకు ఆమె అభినందనలు తెలియజేశారు. ఎల్బీ స్టేడియం ఎండి చాంబర్లో జరిగిన ఈ కార్యక్రమంలో యూసుఫ్ గూడా స్టేడియం అడ్మినిస్ట్రేటర్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



**డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 216 వ జన్మదిన కార్యక్రమానికి స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నరసింహ రెడ్డిని ఆహ్వానిస్తున్న దారుల్షిఫా అందుల పాఠశాల ఉపాధ్యాయులు రామారావు, జావిద్, రమాదేవి, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి.**

**- విశ్వంభర, మలక్ పేట్**

# ఐటీఐ కళాశాలను ప్రారంభించిన ఐటీ మంత్రి శ్రీధర్ బాబు



**విశ్వంభర ఘట్కేసర్ :** ఘట్కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ లో గర్ల్స్ ఐటిఐ రెసిడెన్షల్ కళాశాలను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ హెచ్ఏఎల్ ఆధ్వర్యంలో ఎనిమిది కోట్ల రూపాయలతో గర్ల్స్ ఐటిఐ రెసిడెన్షల్ కలశాల నిర్మించడం జరిగింది అని అన్నారు. ఈ కళాశాల మూడు ఎకరాల భూమిలో నిర్మించాం అని అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజా పాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది అని అన్నారు. ఈ కళాశాలలో మొత్తం ఐదు కోర్సులు ఉన్నాయి అని ఈ రెసిడెన్షల్ లో రాష్ట్ర వ్యాప్తంగా 65 కళాశాలలు నిర్మించాలని ప్రభుత్వం ఆలోచన, రాష్ట్రంలో చదువుకునే విద్యార్థులకు విద్యతో పాటు పరిశ్రమలో,అడ్వాన్స్ టెక్నాలజీ రంగాలల్లో రాణించాలి అని ఆలోచన చేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జంగయ్య యాదవ్ ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ తదితరులు పాల్గున్నారు.

# వసతి గృహ అధికారులకు, సిబ్బందికి శిక్షణా శిబిరం




**విశ్వంభర, మహబూబాబాద్:** వసతి గృహ అధికారులకు, వసతి గృహ నాలుగో తరగతి సిబ్బందికి వ్యక్తిగత పరిశుభ్రత, గృహ పరిశుభ్రత నిర్వహణ శిక్షణా శిబిరం మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర సాంఘీక సంక్షేమ వసతి గృహంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ మరియు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ ఆదేశానుసారం శిక్షణా శిబిరంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ సారంగపాణి, డాక్టర్ నాగేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని, హాస్టల్లో ఉన్న పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే, పిల్లలు తినే ముందు మరియు తిన్న తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలని, ఆకుకూరలను పరిశుభ్రంగా కడగాలని, వండే వంట సామాగ్రి శుభ్రంగా ఉండాలని, వేడి ఆహార పదార్థాలను అందించాలని, వంట చేసేవారు ఆరోగ్య సమస్యలు లేకుండా, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కూరగాయలు ఉంచే స్థలం గిడ్డంగులను, పరిశుభ్రంగా, ఎలుకలు బొద్దింకలు రాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. పడుకునే బట్టలను, బెడ్ షీట్లను వారానికి ఒకసారి మార్చాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు తెలిపారు. అంటువ్యాధులు రాకుండా, దోమ కాటు ద్వారా మలేరియా, డెంగు చికెన్ గునియా, వ్యాధులు రాకుండా కిటికీలకు, మస్కిటో నెట్లు బిగించాలని, దోమలు రాకుండా చూడాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ నాగేశ్వరరావు డాక్టర్ సారంగపాణి, హెల్త్ ఎడ్యుకేటర్స్ కె.వి.రాజు, పురుషోత్తం, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ మహేశ్వరి, వైద్యాధికారి డాక్టర్ కిరణ్మయి, దీపిక, సూపర్వైజర్ పుష్పలీల, ఏఎన్ఎం ఉమారాణి పాల్గొన్నారు.

# అంకిత భావంతో, నిజాయతీగా ప్రజలకు సేవలు అందించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** నూతనంగా కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన పీసీలు అంకితభావంతో, నిజాయితీగా విధులు నిర్వర్తించి ప్రజలకు సేవలు అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 9 నెలల బేసిక్ శిక్షణను పూర్తిచేసుకుని జిల్లాకు వచ్చిన పోలీసు కానిస్టేబుల్లతో ఎస్పీ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం అనేది నిత్యం ఒత్తిడి తో కూడుకున్న ప్రొఫెషన్ అని, ప్రతికూల పరిస్థితులలో కూడా ఉద్యోగం చేయవలసి ఉంటుందని అన్నారు. జిల్లా నుండి పోలీస్ శాఖకు మొత్తం 52 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, 6 మంది సివిల్, 46 మంది సాయుధ దళ (ఏఆర్) కానిస్టేబుళ్లు ఉన్నారన్నారు. పోలీసు శాఖ ప్రధానంగా ప్రజల రక్షణ కోసం పనిచేస్తుందని, పౌరుల హక్కులు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలీస్ ఉద్యోగంలో క్రమశిక్షణ అనేది చాల ముఖ్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. అలాగే శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. నేరాల నియంత్రణ, కొత్త టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ రాష్ట్ర పోలీసులకు దేశంలో గుర్తింపు ఉన్నదని, యూనిఫాంలో నూతన కానిస్టేబుళ్లు చేసే పనులను ప్రజలు గమనిస్తుంటారని, మంచి నడవడికతో పోలీసు ప్రతిష్టను పెంపొందించడానికి కృషి చేయాలని ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నగేష్, రత్నం, కిరణ్, శ్రీకాంత్, నూతన కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**- గ్రామపంచాయతీ కార్మికులు**




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికై గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)ఆధ్వర్యంలో ఈ నెల 13న ఇందిరా పార్కులో నిర్వహించే బహిరంగ సభకు గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరిగె సోములు, గ్రామపంచాయతీ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, కార్మికులకు ఉరితాడుగా ఉన్న మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు ప్రతేక స్టేటస్ కల్పించి, రెండో పీఆర్సీ అమలు చేసి కార్మికులను పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఆరోగ్య భద్రత కల్పించాలని, ఎన్నికల్లో వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పంచాయతీ కార్మికులకు స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం, గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు గాదె ఎల్లయ్య, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత శిక్షణా శిబిరం

**సందర్శించిన యూనియన్ ఆర్ సిటీ డైరెక్టర్ జీఎస్ఆర్ కృష్ణా**



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్లో ముచ్చింతల్ స్వర్ణ భారత్ ట్రస్ట్ జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ మల్లారెడ్డి ఇన్స్టిట్యూషన్స్ వారి సౌజన్యంతో పుట్టగొడుగుల పెంపకం ఉచిత శిక్షణ శిబిరాన్ని యూనియన్ ఆర్టిసిటీ ముచ్చింతల్ డైరెక్టర్ జి.ఎస్.ఆర్ కృష్ణ సందర్శించారు. మహేశ్వరం మండల ఏపీఎం సత్యనారాయణ మరియు ప్రోగ్రాం కోర్స్ కోఆర్డినేటర్ శివ ట్రైనింగ్ మాస్టర్ చంద్రమోహన్ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది. ఈ ఉచిత శిక్షణ శిబిరంలో స్త్రీలు పురుషులు అధిక సంఖ్యలో నేర్చుకొని మంచి అవకాశాలున్న పుట్టగొడుగులు ఉత్పత్తి చేయాలని వారు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని రుణాలు ఇప్పిస్తామని అన్నారు. ట్రైనింగ్ లో భాగంగా 10వ రోజు స్వర్ణ భారత్ ట్రస్టు ద్వారా ప్రాంగణంలో నిర్మిస్తున్న పుట్టగొడుగుల పెంపకం క్యాంపస్ సందర్శించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రామ క్లస్టర్ సురేష్, మహేశ్వరం గ్రామ యాదవ సంఘం అధ్యక్షులు దొడ్డు కృష్ణ యాదవ్, మహేశ్వరం మండల ముస్లిం కమిటీ మండల అధ్యక్షుడు షేక్ హాజీ బాబా, మహేశ్వరం గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ప్రేమ లత మహిళలు పాల్గొన్నారు.

# ట్రస్టుల సేవలు ఉపయోగించుకోవాలి

**విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్ట్ నగదు ప్రోత్సాహకాలు**




**విశ్వంభర, త్రిపురారం:** విద్యార్థులు చదువులో రాణించాలంటే ఉల్లాస్ ట్రస్ట్ లాంటిసేవలు ఉపయోగించుకోవాలని త్రిపురారం ప్రధానోపాధ్యాయులు చల్లా రవికుమార్ అన్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మిర్యాలగూడ కేంద్రంగా పనిచేసే ఉల్లాస్ ట్రస్ట్ వారు పాఠశాలకు రూ. 10,500 లను 10 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి ప్రోత్సాహకాలు పొందటానికి అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరారెడ్డి, పద్మ, శీనయ్య, లక్ష్మీ నర్సయ్య, వెంకన్న, శ్రీనివాస్, విష్ణు కుమార్, సైదా, జానకమ్మ, పద్మావతి, ఏడుకొండలు, వెంకయ్య లు పాల్గొన్నారు.

# జ్ఞానవాహిని ఫౌండేషన్ చూచి వ్రాత పరీక్ష



**విశ్వంభర, ఆమనగల్లు:** జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు "12వ సంవత్సరం చూచి వ్రాయు పరీక్ష" నిర్వహించారు. ఆమనగల్, మాడుగుల, కర్తాల్, తలకొండపల్లి, మండలాల నుండి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు 6, 7, 8, 9, 10 తరగతుల నుండి తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు సుమారు 500 మంది కి స్థానిక వాసవి కళ్యాణ మండపం లో పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి "ముఖ్య అతిథులుగా"ఆమనగల్ ఎంఈఓ పాండు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా "విద్యార్థులలో పఠన సామర్థ్యం పెరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో జ్ఞాన వాహిని ఫౌండేషన్ అధ్యక్షుడు రవీంద్రానంద్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి కాడిగె సత్యం, పౌండర్ రంగారావు, రామనాథం, నరసింహ బిక్కుమళ్ళ, డాక్టర్ శ్రీనివాస్, యాదగిరి, జగదీష్, నరసింహ, సతీష్, సురేష్, మూర్తి, సాయిబాబా, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వేతనం పెంపుపై హోంగార్డ్స్ హర్షం

**సీఎం చిత్రపటానికి హోంగార్డుల క్షీరాభిషేకం**



విశ్వంభర, భూపాలపల్లి: హోంగార్డుల రోజువారి వేతనం 1000 కి పెంపు చేయడంతో పాటు, ప్రమాదవశాత్తు చనిపోతే 5 లక్షల ఎక్స్ గ్రేషియా, వీక్లీ పరేడ్ అలవెన్స్ ను రూ. 200కు పెంచడంతోపాటు, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని 2025 జనవరి 1 నుంచి హోంగార్డులకు వర్తింప చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి, ఈ నెల 6 న హోంగార్డుల రైజింగ్ డే సందర్భంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా జిల్లా కేంద్రం లోని జిల్లా ఆర్మడ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో హోంగార్డులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో హోంగార్డు నాయకులు మొగిలి, వెంకటేష్, శ్యాం, సౌమ్య, లాలయ్య, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# తలకొండపల్లి లో పండుగ సాయన్న వర్ధంతి



**విశ్వాంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రం లో పండుగ సాయన్న వర్ధంతి కార్యక్రమాన్ని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ సాయన్న ఆశయ సాధన కోసం ప్రతి ముదిరాజ్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మచ్చ పారిశ్రామిక సంఘం మండల అధ్యక్షుడు బొల్ల యాదగిరి ముదిరాజ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట పండు, మాజీ ఉప సర్పంచ్ అనిల్, మాజీ సర్పంచ్ కుమార్, ముదిరాజ్ మండల అధయక్షుడు సుదర్శన్, పాండు ప్రసాద్, బాలకృష్ణ, బోల శ్రీనివాస్, మహేష్, శీను మల్లేష్ శేఖర్ పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్మెంట్ ప్రోటోకాల్ శిక్షణ



**విశ్వంభర, భూపాలపల్లి:** జిల్లా సమీకృత కార్యాలయంలో డీఎంహెచ్వో డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటిగ్రేటెడ్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్మెంట్ ప్రోటోకాల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణలో జిల్లా నుండి 140 మంది ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు. స్టేట్ టీం సభ్యులు డాక్టర్ రోహిణి, డాక్టర్ శివప్రసాద్, భాస్కర్ సంపత్ హాజరయ్యారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ సమస్యలు రక్తహీనత, డయాబెటీస్, టీబీ, హెచ్ఐవీ, జాండీస్, పీపీఏచ్, ఏపీహెచ్, ఎపీలెప్సీ వంటి జబ్బుల గుర్తింపు పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. గర్భిణీ స్త్రీలకు సరైన చికిత్స అందించి సుఖప్రసవానికి అనుకూలమైన విధంగా మేనేజ్ చేయడానికి అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు. అమ్మ కోసం ఆన్లైన్ యాప్ ద్వారా గర్భిణీల సర్వే, సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీఓ ఎంసీహెచ్ డాక్టర్ శ్రీదేవి, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

# ఎలక్ట్రికల్ యూనియన్ పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం యువ ఎలక్ట్రిషన్, ప్లంబర్స్ యూనియన్ కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ పనిలో ప్లంబర్ సంబంధించిన విషయాలలో యూనియన్ ప్రకారంగా నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే లక్ష రూపాయల జరిమానా సంఘానికి చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. మండలంలో ఎలాంటి ఎలక్ట్రికల్ పనిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అందుబాటులో ఉండే విధంగా ఉండాలని యూనియన్ ఐక్యతకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్, ఉపాధ్యక్షులు సత్యం, చుక్క అశోక్, తులసి దాస్, సురపల్లి జోహార్, రవి, జంగయ్య, లింగస్వామి, గోపీ పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్లా జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు బీసీ సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు పెంచి విద్యార్థుల సమస్యలను తీర్చాలని కలెక్టర్ కు విన్నవించారు.విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్,జిల్లా కార్యదర్శి సిలువేణి మల్లేశం, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి అరుణ్ తేజ చారి,జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సంబు ఎలందర్,తంగళ్లపల్లి మండల అధ్యక్షులు ఎగుర్ల కర్ణాకర్,బోయిని పెల్లి మండల అధ్యక్షులు పెంచల మహేష్ పటేల్,ఎల్లారెడ్డి పేట మండల అధ్యక్షులు పెద్దోళ్ల బాలయ్య, రుద్రంగి మండల అధ్యక్షులు మీసాల మల్లేష్ పటేల్, గంబీరావుపేట మండల అధ్యక్షులు కాల్వ ప్రసాద్, సామల రమేష్, కాసార్ల అరుణ్, మొగుళోజి నర్సయ్య తదితర బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జున గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, నీర్నెముల గ్రామంలోని శ్రీ మల్లికార్జున గొర్రెల మేకల పెంపకం దారుల నూతన కమిటీ ఎన్నిక యాదవ సంఘం ఆధ్వర్యంలో సంఘం భవనంలో జరిగింది. సంఘం అధ్యక్షునిగా ఆవుల క్రాంతి కుమార్ యాదవ్, కార్యదర్శిగా చల్ల పద్మ ఆనంద్ యాదవ్, ఉపాధ్యక్షునిగా కడారి నాగరాజు యాదవ్, నూతన డైరెక్టర్లుగా ఆవుల శ్రీధర్ యాదవ్, చల్ల యాదయ్య యాదవ్, జెట్టి శివప్రసాద్ యాదవ్, కడారి స్వామి యాదవ్ లను యాదవ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు తమ ఎన్నికకు సహకరించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపినారు. రానున్న రోజుల్లో సంఘం యొక్క అభివృద్ధి కోసం పని చేస్తామని నూతన కమిటీ తెలిపింది.

## బూత్ స్థాయి నుండి బీజేపీని పటిష్టం చేయాలి : బీజేపీ నేత గౌతమ్ రావు



**విశ్వంభర, హైదరాబాద్** : సంస్థాగతంగా బలంగా ఉన్నప్పుడే ఎన్నికలలో మనం ఆశించిన ఫలితాలు వస్తాయని భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు పేర్కొన్నారు. అనంతరం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన హైదరాబాద్ సెంట్రల్ జిల్లా సమావేశానికి గౌతమ్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఇవాళ బీజేపీ బలమైన శక్తిగా అవతరించడం వెనక బలమైన బూత్ ల నిర్మాణం ఉందని ఆయన గుర్తు చేశారు. పార్టీ ఆదేశం మేరకు పూర్తి స్థాయిలో బూత్ కమిటీలను వెయ్యాలని పార్టీ శ్రేణులకు గౌతమ్ రావు మార్గదర్శనం చేశారు. బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చెయ్యాలని గౌతమ్ రావు కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, నేతలు జె. శ్రీకాంత్, సందీప్ సాయి, ఆనంద్ గౌడ్, అజయ్, కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల అభ్యంతరాలు తెలపాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రకటించిన పోలింగ్ కేంద్రాల పై ఈ నెల 12వ తేది వరకు అభ్యంతరాలు తెలియ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల్లో మార్పులు, చేర్పులల్లో అభ్యంతరాలు తెలియచేయాలనే అంశంపై డిపిఓ నారాయణ రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతి ఎన్నికలు నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రకటించామని అన్నారు. జిల్లాలోని 240 గ్రామ పంచాయతిల పరిధిలో 2044 వార్డులున్నాయని, 295246 మంది ఓటర్లు న్నారని తెలిపారు. 2044 పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రకటించామని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి జాబితా రూపొందించగా జిల్లా కలెక్టర్ ఆమోదించారని తెలిపారు.

## మొగుళ్ళపల్లిలో సీఎం కప్ ఆటల పోటీలు

**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి మండల స్పెషల్ అధికారి సునీత, తహసిల్దార్ సునీత, ఎంపీడీవో మహబూబ్ హుస్సేన్, ఎంఈఓ కుమారస్వామి, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ పాల్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజయ్య, మొగుళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి నరేష్ లు హాజరై సేమ్ కప్ ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడలు శరీర దారుణ్యానికి, మానసికొల్లాసానికి ఉపయోగపడతాయన్నారు. అలాగే క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు.



అంబర్పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తన జన్మదినం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను తన సతీమణి కాలేరు పద్మ తో కలిసి కేసీఆర్ ను కలిశారు. కేసీఆర్ కాలేరు వెంకటేశ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

- విశ్వంభర, హైదరాబాద్

# సొంత ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ నాయకుల విమర్శలు



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు లేవనెత్తిన ఒక అంశం ఉద్యమకారులపై తుపాకులు ఎక్కుపెట్టిన వారే నేడు తెలంగాణ ఉద్యమకారుల గురించి మాట్లాడుతున్నారని అంశంపై కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత బీఆర్ఎస్ నాయకులు కేవలం రాజకీయ దురుద్దేశంతోనే నూతన తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో కాంగ్రెస్ పార్టీపై అబండాలు మోపుతున్నారని, అసలు పాత తెలంగాణ తల్లి విగ్రహం 2014 కన్నా ముందే ఏర్పాటు చేశారని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ తల్లి విగ్రహం పై ఎలాంటి అధికారిక ప్రకటనలు చేయలేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ నాయకులు అధికారం అనుభవించారు తప్పితే తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయలేదని, ఉద్యమకారును అసలే పట్టించుకోలేదని, ప్రొఫెసర్ కోదండరాంను ఇంట్లో తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేయించిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని సోనియమ్మ దయవల్లె తెలంగాణ ఏర్పడిందని తెలిపారు.అనంతరం నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాట్లు కాంగ్రెస్ ఎంతో కీలక పాత్ర పోషించిందని రేవంత్ రెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి వాళ్ళు తమ పదవులను త్యాగం చేశారని, గవర్నర్ ప్రసంగాన్ని రేవంత్ రెడ్డి అడ్డుకోవడం, అప్పటి ముఖ్యమంత్రితో రేవంత్ రెడ్డి వాదనకు దిగడం బీఆర్ఎస్ నాయకులకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఒక్క బీఆర్ఎస్ పార్టీతోనే రాలేదని కవులు, కళాకారులు, విద్యార్థులు, సబ్బండ వర్గాలు ఉధృత పోరాటం చేశారని, తొలి దశ పోరాటంలో రాని తెలంగాణ, మలిదశ పోరాటంలో తెలంగాణ జాయింట్ కమిటీ ఏర్పాటై, తెలంగాణ వాదులందరూ ఏకమై సాధిస్తే తెలంగాణ వచ్చిందని, ఈరోజు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేమే తెలంగాణ సాధించాం అని చెప్పుకుంటున్నారని, అప్పటి కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ అధినేత్రి సోనియా దయవల్ల తెలంగాణ ఏర్పడిందని, తెలంగాణ ఇచ్చిందే కాంగ్రెస్, ప్రస్తుత ప్రభుత్వం కాంగ్రెస్ తెలంగాణను పట్టించుకుందని, ప్రస్తుత తెలంగాణ తల్లి విగ్రహం కవులు కళాకారులు సామాజిక వర్గాల అభ్యున్నతిని ప్రతిబింబించేదిగా ఉందని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందంటే అందుకు కాంగ్రెస్ ప్రధాన కారణమని తెలిపారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పండుగ సాయన్న వర్ధంతి వేడుకలు



**విశ్వంభర, షాద్ నగర్:** ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్, స్వేచ్ఛ, స్వాతంత్ర సమానత్వం కోసం, పెత్తందారీ వ్యవస్థ పై రాజీలేని పోరాటం చేసిన పోరాట యోధుడు, బహుజన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన సూర్యుడు, సామాజికవేత్త, దార్శనికుడు పండుగ సాయన్న అని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మెట్టు కాడి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్ కుమార్ అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని పండుగా సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పండుగ సాయన్న తెలంగాణకు ప్రధానంగా సామాజిక న్యాయం, పేదల కోసం పోరాటాలు, భూస్వాముల పాలనకు వ్యతిరేకంగా ప్రతిఘటించిన నాయకుడిగా ప్రసిద్ధి పొందారు. ఆయన పేదలకు భూములను తిరిగి పొందటానికి, పెత్తందార్లను ఎదిరించేందుకు సాయుధ పోరాటాలను నిర్వహించారు. పండుగ సాయన్నను "తెలంగాణ రాబిన్‌హుడ్" అని పిలుస్తారు. ఆయన ధనవంతుల నుండి సంపదను తీసుకొని పేదలకు పంపిణీ చేశారు.సాయన్న తెలంగాణలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆదర్శప్రాయుడిగా నిలిచారు. నేటి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. సాయన్న ఎవ్వరికి భయపడకుండా, తన ప్రాణాలను పణంగా పెట్టి ఆత్మ గౌరవం కోసం పోరాటాల నాయకత్వ స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు క్యాసెట్ శ్రీనివాస్ , బీసీ మహాసభ రంగారెడ్డి జిల్లా యువత విభాగం అధ్యక్షులు ఏవీఎం శ్రీధర్ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొడిచెర్ల యాదయ్య, కార్యనిర్వహక కార్యదర్శి చెల్లా భరత్, సంస్కృతి విభాగం జిల్లా అధ్యక్షులు కుతలి వేణుగోపాల్, ప్రచార ఇంచార్జ్ మల్లేష్ పాల్గొన్నారు.

## నిషేధిత మత్తు పదార్థాలు అమ్మడం నేరం- సీఐ ప్రమోద్ కుమార్



**విశ్వంభర, ఆమనగల్లు :** షాద్ నగర్ ఏసిపి రంగస్వామి ఉత్తర్వుల మేరకు విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా మంగళవారం అమనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆమనగల్ సీఐ ప్రమోద్ కుమార్ నేతృత్వంలో హోటళ్ళు, దాబాలు, షాపులు, వాహనాలు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల సందర్భంగా పలు షాపులలో మద్యం, నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం (4) మద్యం కేసులు, (1) గుట్కా కేసు, (6) మందిపై బహిరంగంగా మద్యం సేవించిన వారిపై కేసులు నమోదయ్యాయి. అలాగే సరియైన పత్రలు లేని 10 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో కేశంపేట్ సీఐ నరహరి, ఆమనగల్ ఎస్సై వెంకటేష్, తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్, కడ్తాల్ ఎస్సై వరప్రసాద్, కేశంపేట ఎస్సై రాజ్ కుమార్, నలుగురు ట్రైనీ ఎస్సైలు మరియు 40 మంది సిబ్బంది పాల్గొన్నారు. భవిష్యత్ లో ఈ విధంగా ఎవరైనా అక్రమం మద్యం గాని గుట్కా గాని ఇతర నిషేధిత హానికర పదార్థాలు అమ్మినా, నిల్వ ఉన్నా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రమోద్ కుమార్ తెలిపారు.

## మానవ హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత కావాలి




విశ్వంభర, భూపాలపల్లి : 76వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం డిసెంబర్ 10 పురస్కరించుకొని మానవ హక్కుల మండలి జాతీయ అధ్యక్షులు అయిలినేని శ్రీనివాసరావు అధ్యక్షతన మొదటి జాతీయ సమావేశం జగిత్యాల జిల్లా కేంద్రంలోని లక్ష్మి నరసింహ పంక్షన్ హల్ ప్రాంగణంలో జరిగింది. ఈ సమావేశం లో ముఖ్య వక్త గా కేంద్ర సమాచార హక్కుమాజీ కమీషనర్&నల్సార్ న్యాయ విద్యాలయం డీన్ మాడభూషి శ్రీధర్ పాల్గొన్నారు.జ్యోతి ప్రజ్వలన తో ఈ కార్యక్రమం ప్రారంభమై ఉత్తమ సేవలు అందించిన వారికి సన్మానాలు ప్రశంస పత్రాలు అందించడంతో ముగిసింది.మనిషి పుట్టుక నుండి జన్మత స్వతగా వచ్చేవి సహజ హక్కులని,మనుషులందరికి సమానంగా హక్కులు ఉంటాయని,హక్కులను ఉల్లఘించకుండా పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత కావాలని,సామాజిక స్పృహ తో హక్కుల పరిరక్షణ కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాడభూషి శ్రీధర్ పిలుపు నిచ్చారు.అనేక మంది అక్షరంతో పోరాడి హక్కులు సాధించారని అన్నారు..స్థాపించిన 5మాసల్లోనే తెలంగాణ రాష్ట్రంలో 300మంది క్రియాశీల సామాజిక కార్యకర్తలు ఉన్నారని,మానవ హక్కుల కార్యకర్త అంటే ప్రభుత్వానికి,సమాజానికి వ్యతిరేకం అనే భావన ఉంటుందని,సమాజంలో రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేయబడి సమాచార చట్టాన్ని సద్వినియోగం చేసుకొని న్యాయం కోసం పోరాడుతున్నామని జాతీయ అధ్యక్షులు అయిలినేని శ్రీనివాసరావు అన్నారు.

## ప్రముఖ పాత్రికేయులు పాశం యాదగిరికి ఏఐటీయూసీ ఘన సన్మానం


### కార్మిక రాజ్యం స్థాపనకు పోరాటాలు మరింత విస్తృతం చేయాలి : - పాశం యాదగిరి




**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ సమాజానికి విశేష సేవలందించిన ప్రముఖ పాత్రికేయులు పాశం యాదగిరి కి రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, సన్మానించి, ఆదుకోవాలని నిర్ణయించడం పట్ల ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ హర్షం వ్యక్తం చేస్తూ హైదరాబాద్, సత్యనారాయణ రెడ్డి భవన్ లో మంగళవారం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి తరపున పాశం యాదగిరి ని శాలువా పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ మహత్తర తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని కార్మిక రాజ్యం స్థాపనకు పోరాటాలు మరింత విస్తృతం చేయాలన్నారు. ప్రపంచీకరణ ఉదారవాద ఆర్థిక విధానాలు కార్మికులకు పై తీవ్ర ప్రభావం పడి ఉపాధి కోసం వలస వెళ్తున్నారని, దేశంలో 28 కోట్ల మంది కార్మికులు ఎలాంటి హక్కులు ప్రయోజనాలు పొందకుండా నష్ట పోతున్నారని తెలిపారు. ప్రభుత్వాల నిరంకుశ తీరు వల్ల దేశంలో కార్మిక వర్గ సంక్షేమం సంక్షోభంలోకి నెట్టబడిందని, దీని ఫలితంగా అసంఘటిత కార్మికుల సగటు జీవన ప్రమాణాలు దిగజారి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు తమ హక్కుల కోసం సమరశీల పోరాటాలు నిర్మించాలని అలాగే కమ్యూనిస్ట్ సిద్ధాంత పటిమతో కార్మికులు నిత్య చైతన్యవంతమై వర్గ రహిత సమాజ స్థాపనకు జరిగే పోరాటాలలో ముందు వరసలో నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు విలాస్ రావు, ఓమయ్య, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, నేతలు సబ్బు రాజమౌళి, వి. జైపాల్ రెడ్డి, ముఖరం, ఉస్మాన్, సుతారి రాములు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటయోధుడు పండుగ సాయన్న

### ఆయన స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం : నీలం మధు ముదిరాజ్



**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చేరు నియోజకవర్గం నిజాం రజాకర్లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల కడుపు నింపిన పోరాటయోధుడు పండగ సాయన్న అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. పండగ సాయన్న వర్ధంతిని పురస్కరించుకొని చిట్కుల్లోని మత్స్యభవనంలో ఆ మహనీయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూఈ పేద ప్రజలు ఆకలితో అలమటించకూడదని భూస్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడని కొనియాడారు. ఆకలితో అల్లాడుతున్న గ్రామాలలో పండగ సాయన్న అడుగు పెడితే వారి కడుపు నింపి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత వల్లే సాయన్న కు పండగ సాయన్న అని పేరు వచ్చిందన్నారు.ముదిరాజ్ కులంలో పుట్టిన ఈ మహనీయుడు బంధుక్ ఎత్తి రజాకర్ల అన్యాయాలను ఎదిరించి ఎదురొడ్డి బహుజనులకు అండగా నిలిచాడని గుర్తు చేశారు.అలాంటి మహావీరుడు స్ఫూర్తితో భవిష్యత్తు తరాలు పోరాటాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమావేశం



**విశ్వంభర, మహబూబాబాద్:** ఐ.డి.ఓ.సి లోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యు అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి మంగళవారం జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాల జాబితా డ్రాఫ్ట్ ప్రచురణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ ప్రచురణ అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 7 న ప్రకటించనైనదని, నాటి నుండి డిసెంబర్, 12 వరకు ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో ఆయా మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులకు అబ్జెక్షన్ లు ఇవ్వవచ్చని డిసెంబర్, 13 న పోలింగ్ కేంద్రాల జాబితా అభ్యంతరాలు పరిష్కరించి జిల్లా కలెక్టర్ ఆమోదంతో తుది జాబితా డిసెంబర్, 17 న ప్రచురించబడునని, అదేవిధంగా డిసెంబర్, 12 న మండల స్థాయిలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు వివిధ రాజకీయ పక్షాల ప్రతినిదులతో సమావేశాలు నిర్వహించబడునని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, డి.ఎల్.పి.ఓ లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా మానవ హక్కుల దినోత్సవం




**విశ్వంభర, భూపాలపల్లి:** రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఆరోగ్యంగా జీవించే హక్కును కల్పించిందని భూపాలపల్లి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి తెలిపారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం జరిగింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ స్థాయిలో ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటంలో వైద్య శాఖ సిబ్బంది నిరంతరం కృషి చేయాలనీ అన్నారు. నాగరిక సమాజంలో లింగ వివక్షతకు తావు లేదని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని జడ్జి పేర్కొన్నారు. ఆర్టికల్ పధ్నాలుగు ప్రకారం చట్టం ముందు అందరూ సమానం అనే హక్కును పొందడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్, ప్రోగ్రాము ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, ఏ ఎం ఎం లు మరియు న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతంలో యువత పాత్ర కీలకం

### - శివసేన రెడ్డి




**విశ్వంభర, ఆమనగల్లు:** కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకమని పోషించిందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ఆమనగల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలుపొందిన వస్పుల శ్రీకాంత్ ని ఆయన నివాసంలో శాలువాతో సత్కరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో యూత్ కీలకంగా నిలిచిందన్నారు. పార్టీ కల్పిస్తున్న అవకాశాలను నాయకులు సద్వినియోగం చేసుకుని మరింత ఉన్నతంగా ఎదగాలన్నారు. అదేవిధంగా యువతను క్రీడల్లోకి ఆహ్వానించాలని శివసేన రెడ్డి శ్రీకాంత్ కు సూచించారు. యువతకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది అని స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి అన్నారు.

## అభివృద్ధిలో దూసుకుపోతున్న చిల్కానగర్ డివిజన్

### - ఎమ్మెల్యే బండారి

**విశ్వంభర, సికింద్రబాద్ :** చిల్కానగర్ డివిజన్‌లోని మల్లికార్జున్ నగర్ కాలనీలో సుమారు 20 లక్షల వ్యయంతో పలు వీధుల్లో నూతన సీవరేజ్ పైప్ లైన్ పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిలుక నగర్ డివిజన్ కార్పొరేటర్ గీతా ప్రవీణ్ సారధ్యంలో వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రశంసిస్తూ వారు ఎప్పుడూ ప్రజలతో మమేకమై ప్రజల మధ్య ఉంటూ, డివిజన్లోని సమస్యలను ఓ ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసుకుంటూ పార్టీ నాయకులను అందరిని కలుపుకుంటూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. గడిచిన నాలుగు సంవత్సరాలలో డివిజన్లో సుమారు రూ. 80 కోట్లతో అభివృద్ధి చేశామని అన్నారు. చిల్కానగర్ డివిజన్ పై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నిధుల సేకరణలో ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డికి డివిజన్ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ డబ్ల్యూ ఎస్ అధికారులు జీఎం సంతోష్ కుమార్, డీజీఎం రజనీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ, బాణాల నారాయణరెడ్డి, ఈరల్లి రవీందర్ రెడ్డి, పిటల్ నరేష్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బలరాం, రామాంజనేయులు, సకినాల ప్రసాద్, ప్రతాప్ రెడ్డి, ఎండి హనీఫ్, బాలేందర్, నర్సింగ్ నేత,కుమార్, ఫారూఖ్ , ఓబేద్, అక్షయ్,శ్యామ్,జయమ్మ, రాయలమ్మ, రమ, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, మల్లికార్జున్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, అశోక్ చారి, జీవీస్ పెంటయ్య, అసోసియేషన్ సభ్యులు సంతోష్ రెడ్డి , ప్రసాద్ చారి, సుందర్, ఉపేందర్, నరసింహ రెడ్డి, పాండు, సంతు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ అధ్యక్షుడు పత్య నాయక్ ఆధ్వర్యంలో..



భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం పట్టణంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో..



మిర్యాలగూడ: మిర్యాలగూడ టౌన్ రెడ్డికాలనీ బీఆర్ఎస్ పార్టీకార్యాలయ ఆవరణలో..



కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంలోని దేవర చెరువు ఆనకట్టపై ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, పీఏసీఎస్ ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కడారి రామకృష్ణ

**విశ్వంభర, ఎల్బీనగర్/ సికింద్రబాద్/ మీర్ పెట్/ మహేశ్వరం/ కడ్తాల్/ ఆమనగల్లు/ భద్రాద్రి కొత్తగూడెం/ మిర్యాలగూడ/ భూపాలపల్లి/ సంస్థాన్ నారాయణపురం:** కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ తల్లి విగ్రహానికి నిరసనగా మంగళవారం భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు వారి వారి నియోజకవర్గాల్లో పార్టీ కార్యాలయాల్లో, ప్రధాన కూడలిల్లో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నేతలు మాట్లాడారు. తెలంగాణ తల్లిని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం దుర్మార్గమని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అన్నారు. ప్రభుత్వాలు మారితే ప్రజల తలరాతలు మార్చాలని గానీ, తెలంగాణ తల్లిని మార్చడం సరికాదని ఎల్ బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఏ గ్రామానికి వెళ్ళిన కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లబ్ధి పొందని ఇల్లు లేదని, ఆయన గుర్తును ఎవరు చెరిపి వేయలేరని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ తల్లి గా మార్చి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాలరాస్తుందని కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, పీఏసీఎస్ ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. పార్టీలు మార్చినంత ఈజీగా తెలంగాణ చరిత్రను మార్చలేరని, తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ మేధావులు, విద్యార్థులు, యువకుల పోరాటాల వల్లనే తెలంగాణ సాధ్యమైందని తెలంగాణ ప్రతీక అయినా బతుకమ్మని చెరిపేయడం మంచి పద్ధతి కాదని ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షుడు పత్య నాయక్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లమోతు భాస్కర్ రావు పిలుపు మేరకు మిర్యాలగూడ టౌన్ రెడ్డికాలనీ బీఆర్ఎస్ పార్టీకార్యాలయ ఆవరణలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మునుగోడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని సర్వేల్, పుట్టపాక, నారాయణపురం గ్రామాల్లో తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రతిష్ఠించిన తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలవేసి పాలాభిషేకం చేశారు.



సంస్థాన్ నారాయణపురం: తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రతిష్ఠించిన తెలంగాణ తల్లి విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు పూలమాలవేసి పాలాభిషేకం చేశారు



భూపాలపల్లి బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో..



మహేశ్వరం: మహేశ్వరం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు నాయక్ నాయక్ అధ్యక్షతన తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం



ఎల్బీనగర్: ఆర్కేపురంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకాన్ని నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ



ఎల్బీనగర్ : చైతన్యపురి డివిజన్ పరిధిలోని ప్రభాత్ నగర్ లో తెలంగాణ తల్లి విగ్రహనికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



విశ్వంభర, సికింద్రబాద్ : చిల్కానగర్ డివిజన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు



మీర్‌పెట్: మీర్‌పేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో చందన చెరువు వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ధైద వెంకన్న సేవలు

## భావి తరాలకు ఆదర్శం

**- తెలంగాణ రాష్ట్ర హౌసెంగ్ బోర్డ్ డైరెక్టర్ వి.పి గౌతమ్(ఐఏఎస్)**



**విశ్వంభర, మహబూబాబాద్:** హైదరాబాద్ లో మంగళవారం సెక్రటేరియట్ లో తెలంగాణ రాష్ట్ర హౌసెంగ్ బోర్డ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ (ఐఏఎస్) ఛాంబర్ లో హరిత మిత్ర అవార్డు గ్రహీత ధైద వెంకన్న ఆయనను కలసి పూల మొక్కను అందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం నా జీవితం అంకితం చేసి 16 సంవత్సరాలుగా రాబోయే భావితరాల కోసం ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో మొక్కలు నాటుతూ నాటిన మొక్కలకు నీరుపోశానని అన్నారు. కొన్ని లక్షల మొక్కలు ఈ రోజు వృక్షాలుగా మారాయని తెలిపారు. మీలాంటి వారి సహాయ సహకారాలు నాకు కావాలని వి.పి. గౌతమ్ ని కోరారు. నేను నా కుటుంబం ఉండడానికి నాకు ఒక ఇల్లు మంజూరు కి తమరు కృషి చేయగలరాని కోరారు.

## క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎదగాలి

**- యాట నరసింహ**

విశ్వంభర, కడ్తాల్: కడ్తాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. వివిధ గ్రామాల నుండి విద్యార్థులు పలు క్రీడల్లో పోటీ పడుతున్నారు. మంగళవారం జరుగుతున్న పోటీలను పరిశీలించి కడ్తాల్ విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయికి ఎదగాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ సూచించారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ ఎమ్మార్వో ఎంపీడీవో, ఎంఈఓ, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ ముదిరాజ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్చ నాయక్, హన్మా నాయక్, డైరెక్టర్ నరేష్, మాజీ సర్పంచ్ శంకర్, రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాజేష్, జాంగిర్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



14న జాతీయ లోక్ అదాలత్‌ను

## కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**- ఎస్.ఐ బి. యాదయ్య**




**విశ్వంభర, చింతపల్లి:** రాజీమార్గం రాజమార్గమని, కక్షకారుణ్యాలతో ఏమీ సాధించలేమని, రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనని చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ బీసమోని యాదయ్య అన్నారు. ఈ నెల 14వ తేదీన జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ మెగా అదాలత్ ను జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, దేవరకొండ నందు నిర్వహించబడునని ఆయన తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. రాజీపడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో, ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గ మని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు.

## తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కమిటీ



## విజయవంతంగా ముగిసిన వాగ్దేవి క్లబ్ ఏడాది కుంకుమ పూజ

**విశ్వంభర, అశోక్‌నగర్ :** వాసవి వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెల పున్నమి రోజు కుంకుమ పూజ పేరుతో పున్నమి రోజున అమ్మవారి ఆలయాల్లో కుంకు పూజ నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత కార్యవర్గంలో ఈ సంవత్సరంలో చివరిదైన కుంకుమ పూజ మంగళవారం స్థానిక అశోక్ నగర్ లోని వాసవి అమ్మవారి ఆలయం లో నిర్వహించారు. ఆలయ పూజారి అనంతయ్యగారి ఆధ్వర్యంలో వైభవోపేతంగా కుంకుమ పూజను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి మాట్లాడుతూ ప్రస్తుత కార్యవర్గం ఆధ్వర్యంలో ప్రతినెల కుంకుమ పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించామని ఈ పూజ ఈ సంవత్సరంలో చివరి పూజ అని పేర్కొన్నారు. సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అందరూ క్షేమంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ కాంప్లెక్స్ లోని వినాయకుడిని అలాగే సుబ్రహ్మణ్యస్వామిని పూజించడంతో పాటు గోమాత పూజ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి తో పాటు 2025 సంవత్సరానికి కాబోయే అధ్యక్ష కార్యదర్శులు రూప శ్రీ, రాజమణి సభ్యులు పద్మ, తిరుపతమ్మ, నిర్మల, సరోజినీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అందరికీ ప్రసాద వితరణ చేశారు.



ఉచిత వైద్య శిబిరాలను

## సద్వినియోగం చేసుకోవాలి

**- మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్**




**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియం చేసుకోవాలని మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్ అన్నారు. మంగళవారం చింతపల్లి మండలం గోడకొండ్ల గ్రామపంచాయతీ ఆవరణలో మాల్ వెంకటేశ్వర్ నగర్ కు చెందిన పద్మావతి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో చూసిన వ్యక్తులకు హాస్పిటల్ వారు ఇచ్చిన చిట్టి తీసుకొస్తే మూడు నెలల వరకు ఉచితంగా ఓపి చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంగిరేకుల గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాస భాస్కర్, గ్యార పోశయ్య, డాక్టర్ రమేష్, డాక్టర్ గణేష్, డాక్టర్ హుస్సేన్, ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, ఓంకార్, రాజు, కృష్ణ, శివ, శ్రీనివాస్, హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్**

**విశ్వంభర, జల్‌పల్లి :** మీడియా ప్రతినిధులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి తీవ్రంగా గర్హనీయం. ప్రశ్న అడిగిన పాత్రికేయుడి నుంచి మైక్ లాక్కొని, దుర్భాషలాడుతూ బలంగా దాడి చేయడం దారుణం. కుటుంబ వివాదాలు రచ్చకెక్కి, ఉద్రిక్త పరిస్థితులు నేపథ్యంలో మీడియా ప్రతినిధులు మంగళవారం జల్ పల్లి లోని మోహన్ బాబు ఇంటికి మీడియా ప్రతినిధులు చేరుకున్నారు. టీవీ 9 ప్రతినిధి రంజీత్ ఏం జరిగింది? చెప్పండంటూ మోహన్ బాబును ప్రశ్నించగా..ఏం చెప్పాలా అంటూ ఆవేశంగా మైక్ లాక్కొని దాంతోనే బలంగా కొట్టారు. పోలీసులు ఉన్న సమయంలోనూ ఆయన అత్యంత ఆవేశంతో మీడియాపై దాడికి పాల్పడ్డారు. దీనిని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండిస్తోంది . మీడియాపై దాడికి పాల్పడిన మోహన్ బాబుపై కేసుపెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డీమాండ్ చేస్తోంది.

# కర్ణాటక మాజీ సీఎం కన్నుమూత

- అనారోగ్యంతో మంగళవారం తుదిశ్వాస విడిచిన ఎస్ఎం కృష్ణ
- ఐదు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ రాజకీయ అనుభవం
- మహారాష్ట్ర గవర్నర్‌గాను బాధ్యతలు



**విశ్వంభర, కర్ణాటక:** కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ (92) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం తెల్లవారుజామున బెంగళూరులోని సదాశివనగర్‌లో తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఐదు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కృష్ణ కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. తన హయాంలో బెంగళూరును భారత సిలిక్యాన్ వ్యాలీగా ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేశారు. కాగా, కృష్ణకు భార్య ప్రేమ, ఇద్దరు కుమార్తెలు శాంభవి, మాళవిక ఉన్నారు. కర్ణాటకలోని మండ్య జిల్లా సోమనహళ్లిలో 1932 మే 1న సోమనహళ్లి మల్లయ్య కృష్ణ జన్మించారు. 1962లో తొలిసారి ఎన్నికల్లో అరంగేట్రం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా మద్దూర్ నియోజకవర్గం నుంచి గెలుపొంది 30 ఏళ్లకే అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత కొంతకాలం పాటు ప్రజా సోషలిస్ట్ పార్టీలో పనిచేసి అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ లో సీనియర్ నేతగా కొనసాగాడు. పలు కీలక పదవులు నిర్వర్తించారు. 1999–2004 మధ్య కర్ణాటక 16వ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ సమయంలోనే బెంగళూరులో ఐటీ రంగం అభివృద్ధికి విశేష కృషి చేశారు. 2004 డిసెంబర్ నుంచి 2008 మార్చి వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం యూపీఏ హయాంలో 2009– 2012 మధ్య విదేశాంగ మంత్రిగా వ్యవహరించారు. దాదాపు 50 ఏళ్లు కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎస్ఎం కృష్ణ 2017లో బీజేపీలో చేరారు. గతేడాది రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఆయన సేవలను గుర్తించి 2023లో కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది. 1960లో ఎస్ఎం కృష్ణ తన 28 ఏళ్ల వయసులో అమెరికాలో న్యాయ విద్యనభ్యసించారు. అదే సమయంలో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థిగా జాన్ ఎఫ్ కెనడీ పోటీ చేశారు. ఆ సమయంలోనే ఎస్ఎం కృష్ణ కెనడీకి లేఖ రాశారు. భారత అమెరికన్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పార్టీ ప్రచారం కోసం వ్యూహాలు చెబుతానని ప్రకటించారు. కెనడీకి నచ్చడంతో ఆ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కెనడీకి గెలిచి అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. దీంతో కెనడీ కృష్ణ సహకారాన్ని అభినందిస్తూ ఓ లేఖ రాశారు. ఎన్నికల్లో ప్రచారంలో అద్భుతంగా పనిచేశారని, తన గెలుపునకు ఎంతగానో కృషిచేశారని మెచ్చుకున్నారు.

### ఎస్ఎం కృష్ణ మృతికి ప్రధాని సంతాపం

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ మృతికి ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఎస్ఎం కృష్ణ అసాధారణ నేత అని, జీవితాంతం ఆయన ఇతరుల కోసం పాటుపడ్డారని గుర్తు చేసుకున్నారు. కర్ణాటక సీఎంగా అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని.. ఆయన అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు.
ప్రత్యేకంగా మౌలిక సదుపాయాల కల్పనపై ఎక్కువ శ్రద్ధ చూపేవారని పేర్కొన్నారు. ఎస్ఎం కృష్ణలో గొప్ప పాఠకుడు, ఆలోచనాపరుడు ఉన్నారని మోదీ కొనియాడారు. అనేక సార్లు తాను ఆయనతో సమావేశమయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబసభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## కొవిడ్.. కనీవినీ ఎరుగని విపత్తు : కేంద్రం



**ఢిల్లీ:** కొవిడ్ 19 మహమ్మారి కనీవినీ ఎరుగని విపత్తు అని, టీకాల పంపిణీ ప్రక్రియ ప్రజల ప్రాణాలను రక్షించిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కొవిడ్ వ్యాక్సిన్ కారణంగా ఇద్దరు మహిళలు మృతి చెందారని ఆరోపిస్తూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా కేంద్రం ఈ విధంగా స్పందించింది.
కరోనా వ్యాక్సిన్ కారణంగా తమ పిల్లలు ప్రాణాలు కోల్పోయారంటూ ఇద్దరు మహిళల తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీవీ వరాలేలతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ వాదనలు వినిపిస్తూ.. కొవిడ్ కనీవినీ ఎరుగని విపత్తు అని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను ఇవి రక్షించాయన్నారు. అయితే, వ్యాక్సినేషన్, దాని దుష్ప్రభావాల అంశాన్ని సుప్రీం కోర్టు ఇప్పటికే సమగ్రంగా పరిశీలించిందన్నారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కోలిన్ గాన్‌సాల్వ్స్ బదిలిస్తూ.. టీకాల విషయంలో ఎటువంటి వివాదం లేదన్నారు. అయినప్పటికీ వ్యాక్సినేషన్ తర్వాతే వీరిద్దరు కూతుళ్లను కోల్పోయారన్న విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఇద్దరు మహిళల మరణాలపై దర్యాప్తు కోసం నిపుణులతో కూడిన వైద్య బృందాన్ని ఏర్పాటు చేయడం, పోస్టుమార్టం నివేదికను ఇవ్వడం, నిర్దేశించిన కాల వ్యవధిలో దర్యాప్తు పూర్తిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. ఇరువురి వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషన్‌ను స్వీకరించామని, దానిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పింది.

## ఇజ్రాయెల్‌ను చూసి నేర్చుకోవాలి

అస్సాం సీఎం హిమంత



**దిస్పూర్:** అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. చుట్టూ శత్రువులు ఉన్నప్పటికీ ఎలా మనుగడ సాగించాలో ఇజ్రాయెల్ నుంచి అస్సాం నేర్చుకోవాలని వ్యాఖ్యానించారు. అస్సాం సరిహద్దులు ఎప్పుడూ సురక్షితంగా లేవని, రాష్ట్రంలో అనేక జిల్లాల్లో అస్సామీలు మైనారిటీలుగా ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. "బంగ్లాదేశ్, మయన్మార్, పశ్చిమ బెంగాల్‌తో మనకు సరిహద్దు ఉంది. 12 జిల్లాల్లో అస్సామీలు మైనారిటీలుగా ఉన్నాం. చుట్టూ శత్రువులు ఉన్నప్పటికీ విజ్ఞానం, శాస్త్ర సాంకేతికతలను వినియోగించుకొని ఇజ్రాయెల్ బలమైన దేశంగా మారింది. అటువంటి దేశాల చరిత్రల గురించి తెలుసుకోవాలి. అప్పుడే ఒక జాతిగా మనుగడ సాగించగలం" అని అస్సాం ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అస్సాం ఒప్పందం జరిగి నలభై ఏళ్లు గడుస్తున్న బయటి శక్తుల ముప్పు తొలగిపోలేదని హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. నిత్యం జనాభాలో మార్పు జరుగుతోందని, స్థానిక ఆదివాసీలు తమ హక్కులను కోల్పోతున్నారని అన్నారు.

## కోటక్ మ్యూచువల్ ఫండ్ మార్కెట్ అవుట్ లుక్ 2025 విడుదల




**విశ్వంభర, బషీర్ బాగ్:** కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ లిమిటెడ్ మార్కెట్ ఔట్లుక్ 2025 నివేదికను విడుదల చేసింది. కోటక్ మ్యూచువల్ ఫండ్, భారత ఆర్థిక వ్యవస్థ, మూలధన మార్కెట్ల దిశలో స్థూల-ఆర్థిక దృక్పథాన్ని పంచుకుంటూ, రాబోయే సంవత్సరంలో పెట్టుబడిదారులు చూడగలిగే వివిధ పెట్టుబడి థీమ్లను హైలైట్ చేస్తూ నివేదికను ప్రారంభించింది. కోటక్ మహీంద్రాఏఎంసీ మేనేజింగ్ డైరెక్టర్, నీలేష్ షా, మాట్లాడుతూ "మార్కెట్ దిద్దుబాట్ల సమయంలో సరసమైన ధరల వద్ద పెట్టుబడి పెట్టడం సాధ్యమవుతుంది. ఆదాయాలు పీఈ వృద్ధికి తక్కువ అవకాశం ఉన్న మార్కెట్ వృద్ధితో, స్థిరమైన, దీర్ఘకాలిక రాబడిని లక్ష్యంగా చేసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యవధిలో, స్థిర ఆదాయ పెట్టుబడులు ఇప్పుడు తక్కువ రిస్కో పోటీ రాబడిని అందిస్తాయి. పెరిగిన ప్రభుత్వ వ్యయం బలమైన వినియోగ ధోరణులు ఆశావాదానికి ఆజ్యం పోస్తున్నప్పటికీ, ప్రైవేట్ బ్యాంకులు, ఆటో, టెలికాం, ఫార్మా ఐటీ వంటి రంగాలలో విలువ అవకాశాలు ఉన్నాయి. రాబోయే వివాహ సీజన్ వినియోగం ఆర్థిక వృద్ధిని పెంచుతుందని అంచనా వేయబడిందన్నారు.

## క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటిన ఢిల్లీ ఐఐటీ

**ఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలను వివిధ అంశాలవారీగా అంచనా వేసే క్యూఎస్ ర్యాంకులు – 2025 విడుదలయ్యాయి. ఈ ఏడాది భారతీయ యూనివర్సిటీలు మెరుగైన ర్యాంకులతో సత్తా చాటాయి. సస్టయినబిలిటీ అంశంలో ఐఐటీ–ఢిల్లీ క్యూఎస్ ర్యాంకింగ్స్ పట్టికలో 255 నుంచి 171కి ఎగబాకి ప్రత్యేకతను చాటుకుంది. భారత్ నుంచి మొత్తంగా 78 వర్సిటీలు ఈ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకోవడం విశేషం. వీటిలో మన దేశం నుంచి టాప్ 10 సంస్థలలో తొమ్మిది విద్యా సంస్థలు తమ స్థానాలను మెరుగుపరుచుకోగా.. కొత్తగా 21 విద్యా సంస్థలు ఈ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నాయి.మరోవైపు, పర్యావరణ ప్రభావానికి సంబంధించి ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ కాన్పూర్ ప్రపంచంలోని టాప్ 100 జాబితాలో నిలవగా.. పర్యావరణ విద్యలో ప్రపంచంలోనే టాప్ – 50లో ఒకటిగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (%××ూఎ%), బెంగళూరు సత్తా చాటింది. భారతీయ వర్సిటీలు మెరుగైన ర్యాంకులు సాధించడంపై లండన్‌కు చెందిన క్యూఎస్ సంస్థ ఉపాధ్యక్షుడు బెన్ సోటర్ మాట్లాడుతూ.. భారత్ ఉన్న విద్యా వ్యవస్థకు ఇదో అద్భుతమైన విజయమన్నారు. అక్కడి వర్సిటీలు స్థిరమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నాయనడానికి ఈ ర్యాంకింగ్సే నిదర్శనమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 107 దేశాలు, ప్రాంతాల నుంచి 1740 వర్సిటీలకు ఈ జాబితాలో ర్యాంకింగ్స్ కేటాయించగా.. ప్రపంచంలోనే అగ్రస్థానంలో యూనివర్సిటీ ఆఫ్ టొరంటో నిలిచింది. ఈటీహెచ్ జ్యూరిచ్ రెండో స్థానంలోబీ స్వీడన్‌లోని లండ్ వర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీ మూడో స్థానంలో నిలిచాయి.

## రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో రాజ్‌నాథ్ సింగ్ భేటీ



**విశ్వంభర, ఢిల్లీ:** భారత్, రష్యా మధ్య స్నేహబంధం శిఖరం కంటే ఎత్తైనదని, సముద్రం కన్నా లోతైనదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మూడు రోజుల రష్యా పర్యటనకు వెళ్లిన రాజ్‌నాథ్ ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో రష్యా రక్షణశాఖ మంత్రి ఆండ్రీ బెలోవ్‌సోవ్ కూడా పాల్గొన్నారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు, రక్షణ సహకారంపై చర్చించారు. రష్యా స్నేహితులకు భారత్ అన్నివేళలా అండగా నిలుస్తుందని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. భారత్– రష్యా ఇంటర్ గవర్నమెంటల్ కమిషన్ ఆన్ మిలటరీ టెక్నికల్ కో–ఆపరేషన్ పైనా ఫలవంతమైన చర్చలు జరిగినట్లు రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఇరుదేశాల రక్షణ సంబంధాలపై కూలంకషంగా చర్చించామన్నారు. రెండుదేశాలకు లబ్ధి చేకూరేలా రక్షణ రంగంలో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించామన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యం పటిష్ఠమయ్యేలా చర్యలు తీసుకునేందుకు ఇరు దేశాలూ అంగీకరించాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## ఇకపై 37 సబ్జెక్టుల్లోనే సీయూఈటీ

- యూజీ.. సీబీటీ మోడ్‌లో పరీక్ష
- యూజీసీ ఛైర్మన్ ఎం.జగదీశ్ కుమార్ వెల్లడి




**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కీలక మార్పులు చేపట్టింది. వచ్చే ఏడాది నుంచి కేవలం కంప్యూటర్ ఆధారిత విధానంలోనే పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. 12వ తరగతిలో అభ్యసించిన సబ్జెక్టులతో సంబంధం లేకుండా విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు 2025 నుంచి ఏ సబ్జెక్టునైనా ఎంపిక చేసుకోవచ్చని తెలిపింది. సీయూఈటీ – యూజీలో ప్రతిపాదిత మార్పులపై తాము ఏర్పాటు చేసిన నిపుణుల ప్యానెల్ సమీక్షించిందని యూజీసీ ఛైర్మన్ ఎం.జగదీశ్ కుమార్ వెల్లడించారు.

**'అడ్వాన్స్‌డ్' లేకుండా ఐఐటీల్లో చదవొచ్చు..**

**ఎలాగో తెలుసా?**

'గతేడాది సీయూఈటీ (యూజీ) పరీక్ష హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించాం. కానీ, 2025 నుంచి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలోనే జరుగుతాయి. ఈ పరీక్షలో సబ్జెక్టుల్ని 63 నుంచి 37కు తగ్గిస్తున్నాం. గతంలో అభ్యర్థులు గరిష్ఠంగా ఆరు సబ్జెక్టులకు పరీక్ష రాసే అవకాశం ఉండేది.. ఇప్పుడు దాన్ని ఐదు సబ్జెక్టులకు కుదిస్తున్నాం. అలాగే, ఆయా సబ్జెక్టులను బట్టి గతంలో పరీక్ష వ్యవధి 45 నిమిషాల నుంచి 60 నిమిషాలుగా ఉండేది. ప్రస్తుతం ఆ వ్యవధిని 60 నిమిషాలుగా నిర్ణయించడంతో పాటు ఆప్షనల్ ప్రశ్నల కాన్సెప్ట్‌ను రద్దు చేస్తున్నాం" అని తెలిపారు.
ఈ ఏడాది మే 15 నుంచి 29 వరకు జరిగిన సీయూఈటీ (యూజీ) పరీక్షను 63 సబ్జెక్టులకు నిర్వహించారు. ఎక్కువ దరఖాస్తు వచ్చిన 15 సబ్జెక్టులకు పెన్ను, పేపర్ విధానంలో మిగతా 48 సబ్జెక్టులకు సీబీటీ విధానంలో పరీక్షలు జరిగాయి. దేశ వ్యాప్తంగా 13.48లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

## అంతర్జాతీయ వేదికల దృష్టికి బంగ్లాదేశ్ హిందువుల వెతలు






**విశ్వంభర, హైదరాబాద్:** బంగ్లాదేశ్ హిందువుల కొనసాగుతున్న నరమేధంపై అంతర్జాతీయ మానవహక్కుల దినం సందర్భంగా "మానవ హక్కుల సంస్థ" తెలంగాణ శాఖ మంగళవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం ఆవేదనతో ప్రతిధ్వనించింది. ప్రపంచవ్యాప్తంగా హిందూ సమాజం తక్షణం మరింత చైతన్య కావలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రభుత్వంలో వివిధ హోదాలలో సేవలందించిన పూర్వ అధికారులు పాల్గొని బంగ్లాదేశ్‌లోని పరిణామాలకు సంబంధించిన చారిత్రక కారణాలు, తమ పరిశీలన–అనుభవాలు, నేటి పరిస్థితి, ప్రస్తుతం–భవిష్యత్తులో తీసుకోవలసిన చర్యలు, పరిష్కారం దిశగా సూచనలు చేస్తూ అర్థవంతమైన చర్చ జరిపారు. భారత ప్రభుత్వంతో పాటు పౌర సమాజం చేపట్టవలసిన కార్యాచరణపై పలు అంశాలతో తీర్మానాన్ని ప్రతిపాదించారు. రౌండ్ టేబుల్‌లో ముఖ్యవక్తలుగా పాల్గొన్న భారత హోంశాఖ పూర్వ కార్యదర్శి పద్మనాభయ్య చర్చను ప్రారంభించారు. ఆఫ్ఘనిస్తాన్, బర్మా, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలు ఒకనాడు భారత్‌లో భాగంగా ఉండేవని గుర్తు చేస్తూ పూర్వ ప్రధాని గుజ్రాల్ నేతృత్వంలోని ప్రభుత్వం "పొరుగు దేశాలకు ప్రాధాన్యత" అంటూ అనుసరించిన విధానం ఏ మేరకు విజయవంతమైందో నేటి పరిణామాలను చూసి మనమే గ్రహించాలన్నారు. సెక్యులర్ రాజ్యాంగం ఉన్నప్పటికీ ముస్లింలు అధికంగా ఉన్న బంగ్లాదేశ్‌లో హిందువులకు తీవ్ర నష్టం జరిగిందని, మన దేశంలో కూడా ముస్లిం జనాభా వేగంగా పెరుగుతున్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. భారతదేశంలో యూసీసీని వెంటనే అమలు చెయ్యాలని పద్మనాభయ్య స్పష్టం చేశారు. అమెరికా, ఐరోపా దేశాలు ప్రపంచవ్యాప్తంగా పెత్తనం సాగిస్తూ వస్తున్నాయని పేర్కొన్న పద్మనాభయ్య అసలు మానవహక్కులకు సంబంధించి ప్రపంచంలో సర్వే నిర్వహించి కామెంట్స్ చేసే అధికారం అమెరికాకు ఎక్కడిదని ప్రశ్నించారు. ఆంధ్రభూమి పత్రిక పూర్వ సంపాదకులు, సీనియర్ పాత్రికేయులు ఎంవిఆర్ శాస్త్రి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హింసాకాండకు ప్రధాన బాధ్యత ఆ దేశ ప్రధాని మహ్మద్ యూనిస్‌దేనన్నారు. సామాజిక కార్యకర్త, న్యాయవాది అయిన మోనికా ఆరోరా స్పందిస్తూ బంగ్లాదేశ్ పరిణామాలపై 4 నెలల పాటు తాము నిర్వహించిన నిజ నిర్ధారణ కార్యాచరణ నివేదికలోని అంశాలను రౌండ్ టేబుల్ ముందుంచారు. ప్రజ్ఞాభారతి ఛైర్మన్ హనుమాన్ చౌదరి స్పందిస్తూ ఇస్లామిక్ సమాజంలో ముస్లిమేతరులకు మానవహక్కులు లేవన్నారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ స్పందిస్తూ బంగ్లాదేశ్ హిందువుల విషయంలో భారతదేశం వ్యక్తం చేసిన ఆందోళనపై అది తమ ఆంతరంగిక విషయమంటూ బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జషిముద్దీన్ చేసిన వ్యాఖ్యల వెనుక అంతరార్థాన్ని గుర్తించాలని హెచ్చరించారు. ఇది చాలక భారత్‌లోని బెంగాల్, బీహార్, ఒడిషా రాష్ట్రాలను కూడా తీసుకుంటామని బంగ్లాదేశ్‌లోని బీఎన్‌పీకి చెందిన వ్యక్తులు చేసిన హెచ్చరికల వెనుక ఎవరున్నారో గ్రహించాలన్నారు. సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్ మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న మారణకాండ యావత్ ప్రపంచానికీ చేరాలని ఆకాంక్షించారు. ఇందుకోసం పలు అంశాలతో కూడిన కార్యాచరణను అనుసరించాలన్నారు. అవి... 1. దేశరాజధాని ఢిల్లీలో ధర్మాచార్యులతో సభ 2. బంగ్లాదేశ్ హిందువుల భవిష్యత్తు ప్రపంచంలోని హిందువుల భవిష్యత్తు అని గ్రహించేలా భారత రాష్ట్రపతితో ప్రకటన చేయించడం 3. హిందువుల వేదనను తెలియజేసేలా వీలైనన్ని దేశవ్యాప్తంగా ఏకకాలంలో ర్యాలీలు జరగాలి 4. యువతరం స్పందించకుంటే వారి కుటుంబాలు దానికి మూల్యం చెల్లించుకోవాలనే సందేశం వెళ్లాలి. రౌండ్ టేబుల్‌లో భాగంగా మాట్లాడిన పలువురు వక్తలు హిందువులు మరింత చైతన్యవంతులు కావాలని, 2047 నాటికి భారత్ ఇస్లామీకరణ పేరిట పీఎఫ్ఐ విడుదల చేసిన పత్రం, 15 నిమిషాలు పోలీసులు పక్కన ఉంటే సత్తా చూపిస్తామంటూ ఎంఐఎం నేత అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు, కాశ్మీర్ సహా బెంగాల్, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలలోని పరిణామాలను గుర్తు చేసి హిందువులను అప్రమత్తం చేసే ప్రయత్నం చేశారు.

## రాజకీయ దుమారం రేపుతోన్న సీఎం బంగ్లా వివాదం

- కేజ్రీవాల్ 'అద్దాల మేడ' వీడియో విడుదల చేసిన బీజేపీ
- ఖండించిన ఆమ్ ఆద్మీ పార్టీ



**ఢిల్లీ:** మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దేశ రాజధాని ఢిల్లీలో 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. తనను తాను సామాన్యుడిగా చెప్పే మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్.. అధికారంలో ఉన్న సమయంలో రూ.కోట్లు ఖర్చుపెట్టి ముఖ్యమంత్రి నివాసానికి మార్పులు చేశారని బీజేపీ కొంతకాలంగా ఆరోపిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అందుకు సంబంధించి ఓ వీడియో విడుదల చేయడం తాజా వివాదం రాజుకుంది. ప్రజాధనం ఉపయోగించి కేజ్రీవాల్ ఇంద్రభవనాన్ని నిర్మించుకున్నారని భాజపా మండిపడింది. దీన్ని ఆప్ తీవ్రంగా ఖండించింది.

**అసలేం జరిగిందంటే..?**

బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ తన 'ఎక్స్' ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. ఢిల్లీలోని 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ఢిల్లీ సీఎం బంగ్లా వీడియో అది. దీన్ని గతంలో అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా అభివర్ణించిన భాజపా నేత.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7–స్టార్ రిసార్ట్ నిర్మించుకున్నారని మండిపడ్డారు. ఆ బంగ్లాలో మార్బుల్ గ్రానైట్ లైటింగ్ కోసం రూ.1.9కోట్లు, ఇతరత్రా సివిల్ వర్క్ కోసం రూ.1.5కోట్లు, జిమ్, స్పా వంటి వాటి కోసం రూ.35లక్షలు.. ఇలా మొత్తంగా రూ.3.75కోట్లు ఖర్చు చేసి ఈ భవనాన్ని లగ్జరీగా మార్చుకున్నారని ఆరోపించారు. "కామన్ మ్యాన్ అని చెప్పే కేజ్రీవాల్.. తన పిల్లలపై ప్రమాణం చేసి అబద్ధాలు చెప్పారు. ప్రభుత్వ నివాసం, కారు ఏవీ తీసుకోలేదన్నారు. కానీ, ఢిల్లీ ప్రజల సొమ్మును ఇలా దోచుకున్నారు" అని భాజపా నేత దుయ్యబట్టారు. ఈ వీడియోపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. భాజపా నిరాధార ఆరోపణలు చేస్తోందని, అసలైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తోందని ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోదియా మండిపడ్డారు. "విద్య, ఆరోగ్య సంస్కరణల గురించి ప్రజలు అడుగుతుంటే.. వారు మాత్రం బంగ్లాల గురించి మాట్లాడుతున్నారు" అని ఎద్దేవా చేశారు.కేజ్రీవాల్ అధికారంలో ఉన్న సమయంలో సీఎం నివాసంలో మరమ్మతుల కోసం రూ.కోట్లు ఖర్చుపెట్టారంటూ భాజపా కొద్ది నెలల క్రితం ఆరోపించింది. దీనిపై ఈ ఏడాది సెప్టెంబరులో సీబీఐ దర్యాప్తు చేపట్టింది. బంగ్లా నిర్మాణం సమయంలో టెండర్ నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఇప్పటివరకు దీనిపై రెగ్యులర్ కేసును నమోదు చేయలేదు.

# రాజ్యసభకు కూటమి అభ్యర్థుల నామినేషన్లు

- టీడీపీ తరపున బీద మస్తాన్ రావు, సానా సతీశ్
- బీజేపీ నుంచి నామినేషన్ వేసిన ఆర్.కృష్ణయ్య
- పార్టీలు మారలేదు.. పార్టీలే నా వద్దకు వస్తున్నాయన్న ఆర్.కృష్ణయ్య



**విశ్వంభర, అమరావతి:** ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలకు కూటమి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ తరఫున బీద మస్తాన్ రావు, సానా సతీశ్.. బీజేపీ నుంచి ఆర్.కృష్ణయ్య నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఏనాడూ పార్టీలు మారలేదని, పార్టీలే తన వద్దకు వస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం తన సేవలను గుర్తించి బీజేపీ అధిష్ఠానం తనకు ఈ అవకాశం ఇచ్చిందని వెల్లడించారు. బీసీలకు న్యాయం జరగాలంటే.. కేవలం బీజేపీతోనే సాధ్యమని, అందుకే బీసీల ప్రయోజనం కోసం బీజేపీ చేరినట్లు స్పష్టం చేశారు. బీసీల కోసం ఎంతదూరమైనా వెళ్తానని, తనకు అవకాశం ఇచ్చిన ప్రధాని మోదీకి ధన్యవాదములు తెలిపారు. బీసీలకు ఏం చేయాలన్న కూడా కేంద్రం సాయం తప్పనిసరిగా అవసరమని బీసీ నేత ఆర్.కృష్ణయ్య అన్నారు. 50 ఏళ్లుగా బీసీలకు చేస్తున్న సేవలకు గాను పార్టీలు గుర్తిస్తున్నాయన్నారు. ముఖ్యంగా బీసీలు చదువుకోవాలని, ఉద్యోగాల్లో వాటా రావాలని, బీసీలకు అన్ని రంగాల్లో వాటా రావాలని పోరాటం చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే నా సేవలను గుర్తించి పార్టీలే నా దగ్గరకు వస్తున్నాయని వెల్లడించారు.

**పోరాటం చేసేందుకు సరైన వేదిక కాదనే..**

2014లో చంద్రబాబు.. తెలంగాణ సీఎం అభ్యర్థిగా ప్రకటించి ఆహ్వానించారన్నారు. ఆ తర్వాత వైసీపీ అధినేత జగన్.. సేవలను గుర్తించి రాజ్యసభలో పదవి ఇచ్చారన్నారు. అందులో రెండేళ్లు ఉన్నానని.. ఇంకా నాలుగేళ్ల పీరియడ్ ఉందన్నారు. అయితే పోరాటం చేసేందుకు సరైన వేదిక కాదని, సమయం కూడా ఇవ్వడం లేదని చెప్పుకొచ్చారు. దేశ వ్యాప్తంగా ఉన్న బీసీల కోసం పోరాటం చేసి విజయం సాధిస్తానని కృష్ణయ్య అన్నారు. ప్రస్తుతం బీసీలకు ఏం చేయాలన్నా బీజేపీతోనే సాధ్యమన్నారు. ఇటు తెలంగాణ, అటు ఏపీలోనూ బీసీలకు న్యాయం చేస్తామని వెల్లడించారు. బీసీల ప్రయోజనాల కోసం ఎంతవరకైనా వెళ్తానని చెప్పారు. చట్ట సభల్లో రిజర్వేషన్ల కోసం ప్రయత్నిస్తానన్నారు.

**ఐదేళ్లు దుర్మార్గ పాలన..**

అచ్చెన్నాయుడు బీజేపీ నామినేషన్ వేసిన కృష్ణయ్య, మస్తాన్ రావు, సతీష్‌లకు పార్టీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. బీసీలకు టీడీపీ ఎప్పుడూ పెద్దపీట వేస్తుందన్నారు. ఇప్పుడు కూడా ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించామన్నారు.
ఆర్.కృష్ణయ్య అంటే జాతీయ బీసీ నాయకుడు అని, ఆయనపై కామెంట్స్ చేసే వాళ్లకు బుద్ధి, తెలివి లేదన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లు దుర్మార్గ పాలన సాగిందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రస్తుతం వ్యవస్థలన్నింటినీ గాడిలో పెడుతున్నామని చెప్పారు. రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు మంగళవారమే చివరి రోజు కావడంతో నామినేషన్ వేశారు.

**సీఎంను కలిసిన రాజ్యసభ అభ్యర్థులు**

సీఎం చంద్రబాబును రాజ్యసభ అభ్యర్థులు కలిశారు. రాజ్యసభకు టీడీపీ నుంచి ఎంపికైన బీదా మస్తాన్‌రావు, సానా సతీష్, బీజేపీ నుంచి ఎంపికైన ఆర్.కృష్ణయ్య సీఎంను కలిశారు. సచివాలయంలో నామినేషన్ వేసిన అనంతరం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ సమావేశం

పలు కీలక నిర్ణయాలకు ఆమోదం

విశ్వంభర, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 42వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను మంత్రి నారాయణ వెల్లడించారు. రూ.8,821 కోట్లతో రాజధానిలో పనులు చేపట్టేందుకు అథారిటీ ఆమోదం లభించిందని పేర్కొన్నారు. ట్రంక్ రోడ్లు, ఎల్‌పీఎస్ లేఅవుట్ రోడ్లు, మంత్రులు, జడ్జిల బంగ్లాల నిర్మాణం చేపట్టేందుకు వీలుగా అనుమతి లభించినట్టు తెలిపారు. ప్రధాన ట్రంక్ రోడ్లను రూ.4,521 కోట్లతో చేపట్టేందుకు అనుమతి మంజూరైందని వివరించారు. ఎల్‌పీఎస్ లేఅవుట్ల రహదారుల కోసం రూ.3,807 కోట్లకు సీఆర్‌డీఏ అథారిటీ అనుమతి ఇచ్చిందని తెలిపారు. 2014-19తో పోలిస్తే రహదారుల నిర్మాణం కోసం 28 శాతం మేర ధరలు పెరిగాయని మంత్రి వెల్లడించారు. భవనాల నిర్మాణం కోసం 35 - 55 శాతం మేర ధర పెరిగిందన్నారు. అదనంగా జీఎస్టీ కూడా 6 శాతం మేర పెరిగిందన్నారు.

## ఏపీ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

**అమరావతిలో చేపట్టాల్సిన పనులకు ఆమోదం**



**విశ్వంభర, అమరావతి:** అమరావతిలో చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఆర్డీఏ ఆమోదించిన 20 సివిల్ పనులకు ఆమోదముద్ర వేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాజధాని పరిధిలో చేపట్టనున్న 20 సివిల్ పనులకు రూ. 11,467 కోట్ల మేర వ్యయం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా ఇవ్వనున్న రుణంతో ఈ పనులు చేపట్టేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, ఉద్యోగుల నివాస అపార్ట్‌మెంట్లు, ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాల నిర్మాణం పూర్తికి నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. న్యాయమూర్తులు, మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారుల బంగ్లాల నిర్మాణం కోసం నిధుల మంజూరుకు ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా సచివాలయ టవర్లు, అసెంబ్లీ, రాజధాని పరిధిలో మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం ఈ నిధుల్ని వెచ్చించాలని నిర్ణయించింది.

**హ్యాపీనెస్ట్‌కు రూ.984 కోట్లు**

అమరావతిలో కొండవీటి వాగు, పాలవాగు వెడల్పు చేయటంతో పాటు శాఖమూరు, నీరుకొండ వద్ద రిజర్వాయర్ నిర్మాణం కోసం సీఆర్డీఏ రూ.1585 కోట్లు వెచ్చించనుంది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టులో భాగంగా 12 టవర్లతో 1200 అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం రూ.984 కోట్లు కేటాయించింది. రాజధాని పరిధిలో వరద నీటి కాలువలు, డ్రెయిన్లు, నీటి సరఫరా నెట్‌వర్క్, సీవరేజీ, యుటిలిటీ డక్టులు, పాదచారుల బాట, సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటుకు నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

## తలకు గాయమై ఆసుపత్రికి వస్తే..

**మహిళ దుస్తులు విప్పి అసభ్యప్రవర్తన**

**విశ్వంభర, విశాఖపట్నం:** విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో దారుణం చోటు చేసుకుంది. స్కానింగ్ కోసం వచ్చిన ఓ మహిళను సిబ్బంది వేధింపులకు గురి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖకు చెందిన ఓ మహిళ తలకు గాయమై సోమవారం రాత్రి ఆసుపత్రికి వచ్చింది. స్కానింగ్ చేయించాలని వైద్యులు సూచించడంతో .. అదే ఆసుపత్రిలోని స్కానింగ్ సెంటర్‌కు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన స్కానింగ్ సెంటర్ ఇన్‌ఛార్జి ప్రకాశ్ .. స్కానింగ్ కోసం దుస్తులు తీసేయాలని చెప్పాడు. ఆ తర్వాత ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. మహిళ కేకలు వేయడంతో స్పందించిన స్థానికులు ప్రకాశ్‌కు దేహశుద్ధి చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న విశాఖ మూడో పట్టణ సీఐ రమణయ్య ఆసుపత్రికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యంతో రోగులు నరకం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. స్కానింగ్ సెంటర్‌లో జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

## సజ్జల ముందస్తు బెయిల్ పిటిషన్ వాయిదా

**విశ్వంభర, అమరావతి:** రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు, వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో సజ్జల ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా.. విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. సజ్జలపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సూచించిన న్యాయస్థానం.. గతంలో ఇచ్చిన ఆదేశాలను మరో రెండు వారాలకు పొడిగించింది.

## ఏపీ టూరిజం కొత్త పాలసీ

**విదేశీ పర్యాటకులను మరింత ఆకర్షించేలా..**




**విశ్వంభర, అమరావతి:** వచ్చే ఐదేళ్ల (2024-29) పాటు ఆంధ్రప్రదేశ్ టూరిజం పాలసీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. వచ్చే ఐదేళ్లకు పర్యాటక పాలసీ అమల్లో ఉండేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పన తదితర అంశాలే లక్ష్యంగా నూతన విధానం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కొత్త విధానం ఉంటుందని పేర్కొంది. ఎకో టూరిజం, క్రూయిజ్ టూరిజం, బీచ్ సర్క్యూట్‌లు, బ్యాక్ వాటర్ టూరిజాన్ని ప్రోత్సహించేలా ఈ నూతన విధానం ఉండనుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేలా టూరిజం పాలసీ ఉంటుందని చెప్పింది. పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పించడం, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడం, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పాలసీని రూపొందించింది.

## విజయసాయిరెడ్డివి మితిమీరిన మాటలు



**విశ్వంభర, అమరావతి:** వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మితిమీరిన మాటలను పోలీసులు ఉపేక్షించాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆయన ఇంకా బయట తిరుగుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. అమరావతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. విజయసాయిరెడ్డిని జైలుకు పంపడానికి పింక్ డైమండ్‌పై చేసిన అసత్య ఆరోపణ ఒక్కటి చాలన్నారు. దోపిడీకి కాదేదీ అనర్హం అన్నట్లు జగన్‌తో అవినీతిలో ఆయన పోటీ పడ్డారని విమర్శించారు.

# ఏపీకి మరో కీలక ప్రాజెక్టు

- 8 ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక
- 8 స్మార్ట్ సిటీలకు రూ.8వేల కోట్లు
- ఆంధ్రప్రదేశ్ నుంచి కొప్పర్తికి చోటు



**విశ్వంభర, అమరావతి:** ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి మరో కీలక ప్రాజెక్టును తీసుకొచ్చింది. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న 8 స్మార్ట్ సిటీలలో రాష్ట్రానికి చోటు దక్కేలా కృషి చేసింది. వైఎస్ఆర్ జిల్లా కొప్పర్తిని స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు ఎంపిక చేసింది. కొత్తగా అభివృద్ధి చేసే 8 స్మార్ట్ సిటీలకు కేంద్ర ప్రభుత్వం రూ. 8వేల కోట్లు కేటాయించింది. స్మార్ట్‌సిటీ మిషన్ కింద ఇప్పటికే 100 నగరాలు అభివృద్ధి చేశామన్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్.. వేగంగా సాగుతోన్న పట్టణీకరణకు అనువుగా 8 ప్రాంతాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు. ఈ పథకం కోసం 21 రాష్ట్రాల నుంచి 26 ప్రతిపాదనలు రాగా.. ఎనిమిదింటిని ఎంపిక చేసినట్టు వివరించారు. అన్ని రాష్ట్రాల ప్రతిపాదనలు పరిశీలించిన 15వ ఆర్థిక సంఘం అందులో మెరుగైన ప్రణాళికలు పంపిన 8 రాష్ట్రాలను ఎంపిక చేసిందన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి కొప్పర్తికి చోటు కల్పించినట్టు వివరించారు. ఐసీసీగా పరిగణించే నూతన స్మార్ట్ సిటీల్లో అత్యాధునిక రవాణా సదుపాయాలు, విద్యుత్, తాగునీరు, మురుగునీటి పారుదల, పరిశుభ్రతకు పెద్దపీట వేయనున్నారు. ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అవసరమైన సదుపాయాల కల్పనతో పాటు పాలనా పరంగానూ అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే అభివృద్ధి చేసిన 100 స్మార్ట్‌సిటీల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు, వైఫై, హాట్ స్పాట్ సౌకర్యం, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, డిజిటల్ లైబ్రరీలు సకల సదుపాయాలతో అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దినట్టు కేంద్రం పేర్కొంది.

# ఆర్జీవీకి హైకోర్టులో భారీ ఊరట

- డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మకు ముందస్తు బెయిల్
- మూడు కేసుల్లో బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- పోలీసుల విచారణకు సహకరించాలని ఆదేశాలు



**విశ్వంభర, అమరావతి:** డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. సోషల్ మీడియా పోస్టింగ్ కేసులో ముందస్తు బెయిల్ మంజూరైంది. కాగా, ఎన్నికల సమయంలో చంద్రబాబు, నారా లోకేశ్, పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టుల కేసులో న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అయితే, దర్యాప్తునకు సహకరించాలని రామ్ గోపాల్ వర్మకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని మైకోర్టు స్పష్టం చేసింది. ప్రకాశం, అనకాపల్లి, తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసుల్లో ఆర్జీవీకి ముందస్తు బెయిల్ ఇచ్చింది. సోషల్ మీడియా పోస్టింగ్స్, సినిమా పోస్టర్స్‌పై రాష్ట్ర వ్యాప్తంగా రామ్ గోపాల్ వర్మపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్, వర్మ తరపున న్యాయవాదికి మధ్య వాడీవేడిగా వాదోపవాదాలు సాగాయి. ఓ స్టార్ డైరెక్టర్‌గా, సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని ప్రభుత్వం తరఫున న్యాయవాది వాదించారు. సినిమాల నుంచి సమాజం చాలా నేర్చుకుంటుందని ఆయన చెప్పారు. ఇక, హైదరాబాద్‌లోనే ఉన్నానని.. వర్మ వీడియోలు పెడుతున్నారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ అన్నారు. పోలీసులు ఇప్పటికే మూడు సార్లు నోటీసులు ఇచ్చారన్నారు. అయితే, ఒకే పోస్టర్‌పై 12 కేసులు నమోదు చేశారని వర్మ తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. చివరికి వర్మకు ముందస్తు బెయిల్ లభించింది.

# పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్

పోలీసుల అదుపులో నిందితుడు

**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడం కలకలం రేపింది. పవన్‌ను చంపేస్తామని హెచ్చరిస్తూ గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్, అభ్యంతరకర భాషతో సందేశాలు రావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. రంగంలోకి దిగిన పోలీసులు పురోగతి సాధించారు. ఫోన్ కాల్స్ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నూక మల్లికార్జున్ అని, మానసిక స్థితి సరిగ్గా లేదని, మద్యం మత్తులో బెదిరింపు కాల్స్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకున్న నిందితుడిని విజయవాడ పోలీసులు విచారిస్తున్నారు. గతంలో వైజాగ్?లో నూక మల్లికార్జున్?పై 354 కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పవన్‌కల్యాణ్ పేషీకి 95055 05556 నంబరు నుంచి కాల్ వచ్చినట్లు గుర్తించారు. ఈ నంబరు ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన మల్లికార్జునరావు పేరుతో ఉందని పోలీసులు తేల్చారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద టవర్ నుంచి కాల్స్ వచ్చినట్లు తేలింది. నగర కమిషనర్ రాజశేఖర్‌బాబు టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచి, లా అండ్ ఆర్డర్ విభాగాలకు చెందిన పోలీసులతో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. ఆఘమేఘాలపై గాలింపు చేపట్టినా ఫోన్ స్విచాఫ్ చేయడంతో ఎక్కడ ఉన్నదీ గుర్తించడం కష్టంగా మారింది. విజయవాడతో పాటు తిరువూరులోనూ గాలింపు చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు నిందితుడు మల్లికార్జునరావును అదుపులోకి తీసుకున్నారు.

## నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు

**విజయసాయిరెడ్డికి పంచుమర్తి అనురాధ హెచ్చరిక**



**విశ్వంభర, అమరావతి:** వైసీపీ భూబకాసురులు రాష్ట్రంలో వేల ఎకరాలు కబ్జా చేశారని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి దేవాదాయ, అసైన్డ్ భూముల వరకు అన్నీ కొట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి వచ్చిన వాటిలో 68 వేల ఫిర్యాదులు భూకబ్జాలపైనే ఉన్నాయన్నారు. బెదిరింపులతో కాకినాడ పోర్టు భూములను రూ.12 కోట్లకే కొట్టేశారన్నారు. వైసీపీ హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాలన గాలికొదిలేసి భూముల కబ్జాపైనే దృష్టి పెట్టారన్నారు. చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి వెయ్యి ఎకరాలు కబ్జా చేశారన్నారు. మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు తగలబెట్టారని, పల్నాడులో పిన్నెల్లి బ్రదర్స్ వెయ్యి కోట్ల విలువైన భూములను కొట్టేశారన్నారు. అనంతపురం జిల్లాలో కేతిరెడ్డి బ్రదర్స్ సోలార్ భూములను కూడా వదల్లేదని, మహిళా మంత్రులు రోజా, ఉష శ్రీచరణ్ కూడా భూకబ్జాలు చేశారన్నారు. చంద్రబాబుపై విజయసాయిరెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

## రెండో రోజు విచారణకు హాజరైన అవినాష్ పీఏ

**విశ్వంభర, అమరావతి:** వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి రెండో రోజు పోలీసు విచారణకు హాజరయ్యాడు. కడప సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో విచారణ జరుగుతోంది. అంతకుముందు సోమవారం 11 గంటల పాటు రాఘవరెడ్డిని పులివెందుల డీఎస్పీ ప్రశ్నించారు. వర్రా రవీందర్ రెడ్డి చేత అసభ్యకరమైన పోస్టులు పెట్టించారని రాఘవరెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. విచారణ నేపథ్యంలో పోలీస్ స్టేషన్ వద్దకు పులివెందుల నుంచి వైసీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

## నేటి నుంచి భారీ వర్షాలు



**విశ్వంభర, అమరావతి:** ఏపీ ప్రజలకు బిగ్ అలర్ట్. రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఈ అల్పపీడనం ప్రభావంతో బుధవారం నుంచి శుక్రవారం వరకు కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఏపీ ఎస్డీఎంఏ తెలిపింది. ప్రధానంగా కోస్తాంధ్ర జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, నెల్లూరు, కర్నూల్, అనంతపురం, వైఎస్సార్ జిల్లాలో సాయంత్రం వరకు వర్షాలు పడనున్నాయని పేర్కొంది. అలాగే ప్రకాశం, తిరుపతి, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో పడే అవకాశం ఉంది. దీంతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడనున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఏపీ వ్యాప్తంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తమయ్యారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కోసిన పంటలను ఇంటికి తీసుకురావాలని, వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని చెప్పారు.అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. దాదాపు మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ఇదిలా ఉండగా, సముద్ర తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకార్మికులు చేపలు పట్టేందుకు సముద్రంలోపలికి వెళ్లకూడదని సూచించారు. ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడనున్నాయని, సుమారు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## జిందాల్ ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి



**విశ్వంభర, అమరావతి:** పల్నాడు జిల్లాలోని జిందాల్ ప్రాజెక్టును మంత్రి నారాయణ పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ, ఇతర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు. “2014-19 మధ్య చాలా అధ్యయనం తర్వాత ప్లాంట్ నిర్ధయించాం. వైకాపా ప్రభుత్వం విద్యుదుత్పత్తి ప్లాంట్‌లను వదిలేసింది. 7 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ నుంచి చెత్తను ప్లాంట్‌కు తరలిస్తున్నారు. 6890 మెట్రిక్ టన్నుల చెత్తలో 2,500 టన్నులను విద్యుత్‌గా మారుస్తున్నారు. కాకినాడ, నెల్లూరులో త్వరలో ప్లాంట్ ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం ఒక్క ప్లాంట్ కూడా ఏర్పాటు చేయలేదు. చెత్త పన్ను తప్ప.. చెత్తను ఎలా నిర్వహించాలో గత ప్రభుత్వానికి తెలియదు. చట్ట సవరణ చేసి మరీ చెత్త పన్ను తొలగించాం” అని మంత్రి అన్నారు. 16 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ నిర్మించినట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌తో ప్రజలకు ఎంతో మేలని పేర్కొన్నారు. ప్లాంట్ ఏర్పాటులో చంద్రబాబు, నారాయణ కృషి ఎంతో ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి అన్నారు. విదేశీ సాంకేతికతను పరిశీలించాకే నారాయణ ఈ ప్లాంట్ నిర్మాణం చేయించారని చెప్పారు.

## ప్రపంచంలో బెస్ట్ ప్లేయర్ ఆయనే!

ఇంగ్లాండ్ బ్యాటర్ జోరూట్జో రూట్



**లండన్:** ప్రస్తుత క్రికెట్ ఫ్యాబ్4లో ఒకడిగా ఉన్న ఇంగ్లాండ్ బ్యాటర్ జోరూట్ ప్రస్తుతం ప్రపంచంలో ఉత్తమ ఆటగాడు ఎవరో చెప్పాడు. అయితే, భారత యువ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ లలో రూట్ ఒక్కరిని కూడా అత్యుత్తమ ఆటగాడిగా పరిగణించలేదు. తన సహచర ఆటగాడు హ్యారీ బ్రూక్ బెస్ట్ ప్లేయర్ అని పేర్కొన్నాడు. అతను ప్రపంచంలో అత్యుత్తమ ఆటగాడని ప్రశంసించాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో 25 ఏళ్ల బ్రూక్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో సెంచరీలు బాదాడు. 2022లో అరంగేట్రం చేసిన అతను 23 మ్యాచ్‌ల్లోనే 8 శతకాలు సాధించడం విశేషం. ఈనేపథ్యంలోనే బ్రూక్‌ను రూట్ ప్రశంసల్లో ముంచెత్తాడు. 'ప్రస్తుతానికి హ్యారీ బ్రూక్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఆటగాడు. అతడిని చూస్తే ముచ్చటేస్తుంది. ఒత్తిడిని తట్టుకొని ఆడే సామర్థ్యం అతడి సొంతం. మైదానంలో అన్నివైపులా షాట్లు ఆడతాడు. సిక్స్ కోసం తల మీదుగా స్కూప్ షాట్ అద్భుతంగా ఆడతాడు. మిగిలిన రకాల షాట్లు కూడా సునాయసంగా కొడతాడు' అని జో రూట్ పేర్కొన్నాడు. ప్రస్తుతం బ్రూక్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల కివీస్‌తో జరిగిన తొలి టెస్టులో (171బీ 191 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ శతకం బాది జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. న్యూజిలాండ్‌లో జరిగిన రెండో టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో బ్రూక్ (123బీ 115 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగాడు. రెండో ఇన్నింగ్స్‌లో (55) అర్ధశతకం చేశాడు. దీంతో ఇంగ్లాండ్ 323 పరుగుల భారీ తేడాతో కివీస్‌ను చిత్తు చేసింది. ప్రస్తుతం ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో బ్రూక్ (854 పాయింట్లు) అగ్రస్థానానికి చేరువలో ఉన్నాడు. జో రూట్ (895 పాయింట్లు) టాప్‌లో ఉన్నాడు. బ్రూక్ 23 టెస్టుల్లోనే 61.62 సగటుతో 2280 రన్స్ చేశాడు. ప్రస్తుత క్రికెట్ ఫ్యాబ్4గా విరాట్ కోహ్లీ, కేన్ విలియమ్సన్, స్టీవ్ స్మిత్, జో రూట్ అని చెబుతుంటారు. కొన్నాళ్లుగా సూపర్ ఫామ్‌లో ఉన్న రూట్.. వరుసగా రికార్డులు నెలకొల్పుతున్నాడు. టెస్టుల్లో ఇప్పటివరకు 12,886 రన్స్ చేసి అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు. మరో 492 పరుగులు చేస్తే పాంటింగ్ (13378), కలిస్ (13289), ద్రవిడ్ (13288)లను అధిగమించి ఈ జాబితాలో రెండో స్థానానికి చేరుతాడు. సచిన్ (15,921 రన్స్) అగ్రస్థానంలో ఉన్నాడు.


## టెస్టు క్రికెట్‌ను 4 రోజుల ఆటగా మార్చాలి

ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్



**లండన్:** ఒకప్పుడు టెస్టు మ్యాచ్‌లు రోజులపాటు జరిగేవి. చివరి కూడా ఫలితం తేలేవి కావు. దీంతో చాలా మ్యాచ్‌లు డ్రాగా ముగిసేవి. కానీ, గత కొన్నేళ్లుగా పరిస్థితి మారింది. దాదాపు అన్ని జట్లు డ్రా కోసం కాకుండా ఫలితం తేలడం కోసమే తమ ఆటతీరును మార్చుకున్నాయి. గత 50 టెస్టుల్లో మూడు టెస్టులు మాత్రమే డ్రా అయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ 50 టెస్టుల్లో మూడింట రెండొంతు మ్యాచ్‌లు నాలుగో రోజు లేదా అంతకంటే ముందే ముగిశాయి. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో భాగంగా ఆసీస్, భారత్ మధ్య జరిగిన తొలి టెస్టు నాలుగో రోజు ముగిసింది. అడిలైడ్‌లో జరిగిన పింక్ టెస్టు ఫలితం మూడ్రోజుల్లోనే తేలింది. ఈ నేపథ్యంలో టెస్టు క్రికెట్‌ను ఐదు రోజులు కాకుండా నాలుగు రోజుల ఆటగా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అభిప్రాయపడ్డాడు. 'దూకుడుగా ఆడుతూ అద్భుతమైన వినోదాన్ని అందించే ఆటగాళ్లు ఇప్పుడు చాలామంది ఉన్నారు. మ్యాచ్ గురువారం మొదలై ఆదివారం పూర్తయితే బాగుంటుంది. టెస్టు మ్యాచ్‌లను నాలుగు రోజులకు షెడ్యూల్ చేస్తే మంచిది. ఇలా చేస్తే మ్యాచ్ గురువారం మొదలై ఆదివారం ముగుస్తుందని అందరికి సులభంగా అర్థమవుతుంది. నిజాయితీగా చెప్పాలంటే ఆటగాళ్ల దృక్పథంలో కూడా మార్పు వచ్చింది.డబ్బు సంపాదించడం కోసం వారు వివిధ లీగ్‌ల్లో పాల్గొంటున్నారు. నేను ఆడినట్లు లేదా 1980, 90ల్లో కొన్ని జట్లు ఆడిన విధంగా వారు ఆడరు. ప్రస్తుత క్రికెటర్లు దూకుడుగా ఆడుతూ వీలైనంత తొందరగా విజయం సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. వేగంగా ఆడుతూ ప్రత్యర్థిని ఒత్తిడికి గురిచేస్తున్నారు. కాబట్టి, ప్రపంచవ్యాప్తంగా అన్ని క్రికెట్ బోర్డులు టెస్టులను ఐదు రోజులు నుంచి నాలుగు రోజులకు తగ్గించడానికి సమయం ఆసన్నమైందా? లేదా అనే అంశంపై దృష్టిసారించాలి' అని మైఖేల్ వాన్ వివరించాడు.

## జొమాటో కొత్త ఫీచర్




దిల్లీ: వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు ప్రముఖ ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్ జొమాటో ప్లాట్‌ఫామ్ సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఆర్డర్ చేసిన ఫుడ్‌పై ఫీడ్‌బ్యాక్, రేటింగ్ ఇచ్చే అవకాశముంది. అయితే, ఫలానా ఫుడ్‌ను మన స్నేహితులకు రికమండ్ చేసే అవకాశం లేదు. ఈ లోటును తీర్చేందుకు జొమాటో తాజాగా 'రికమండేషన్స్ ఫ్రమ్ ఫ్రెండ్స్' ఫీచర్‌ను తీసుకొచ్చింది. వారం క్రితమే ఈ ఫీచర్‌ను తీసుకొచ్చామని, లేటెస్ట్ వెర్షన్ యాప్‌లో ఇది అందుబాటులో ఉంటుందని జొమాటో యాజమాన్యం తాజాగా వెల్లడించింది. తాజా ఫీచర్‌తో ఫ్రెండ్స్ రికమండ్ చేసిన రెస్టరంట్‌లు, ఆహారపదార్థాలు మన జాబితాలో కనిపిస్తాయి. అందులో ఆసక్తి ఉన్నవాటిని బుక్ చేసుకునేందుకు వీలుంటుంది. " తాజా ఫీచర్.. మా కస్టమర్లు వారి స్నేహితుల ద్వారా సిఫారసు చేసిన ఆహారపదార్థాలను ఎంచుకునేందుకు వీలుకల్పిస్తుంది. వారి ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది" అని జొమాటో ఫుడ్ డెలివరీ సీఈవో రాకేశ్ రంజన్ ఓ ప్రకటనలో తెలిపారు.

# 14 నుంచి ఆసీస్‌తో మూడో టెస్టు

- భారత్ తుది జట్టులో రెండు మార్పులు జరగొచ్చు
- టీమ్ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్



**బ్రిస్బేన్:** ఆస్ట్రేలియా, భారత్ మధ్య డిసెంబరు 14 నుంచి మూడో టెస్టు ప్రారంభంకానుంది. బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ కోసం భారత్ తుది జట్టులో రెండు మార్పులు జరుగుతాయని టీమ్ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అంచనా వేశాడు. అదే విధంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎలాంటి మార్పులు చేయకుండా కెప్టెన్ రోహిత్ శర్మ ఆరో స్థానంలోనే బ్యాటింగ్‌కు దిగాలని సూచించాడు. అడిలైడ్‌లో జరిగిన పింక్ టెస్టులో కేఎల్ రాహుల్‌ను ఓపెనర్‌గా దింపిన రోహిత్ ఆరో స్థానంలో బరిలోకి దిగాడు. కానీ, రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ కలిపి 9 పరుగులే చేశాడు. "బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎలాంటి మార్పు ఉండదనుకుంటాను. రోహిత్ శర్మ ఓపెనర్‌గా రావాలని చర్చ జరిగింది. సునీల్ గవాస్కర్ కూడా రోహిత్ ఓపెనింగ్ బరిలోకి దిగాలన్నాడు. కానీ, టీమ్‌మేనేజ్‌మెంట్ అలా ఆలోచించదని నేను భావిస్తున్నాను. పెర్త్ టెస్టులో ఈ బ్యాటింగ్ వర్కౌట్ కావడంతో ఇప్పుడు అదే విధానాన్ని అనుసరించే అవకాశముంది. ఫామ్‌లో లేని రోహిత్‌ను ఓపెనర్‌గా ఎలా పంపుతారు? కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్‌లనే ఓపెనర్లుగా పంపాలి. రోహిత్ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయాలి. స్పిన్ విభాగంలో ఒక మార్పు చేస్తారనుకుంటున్నా. వాషింగ్టన్ సుందర్ తిరిగి తుది జట్టులోకి (అశ్విన్ స్థానంలో) రావొచ్చు. తొలి టెస్టులో సుందర్ రెండు వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లోనూ ఫర్వాలేదనిపించాడు. ఫాస్ట్ బౌలింగ్ విషయానికొస్తే.. హర్షిత్ రాణా స్థానంలో ప్రసిద్ధ్ కృష్ణను తీసుకునే ఛాన్స్ ఉంది. ప్రసిద్ధ్ పొడగరి కావడంతో బౌన్స్ రాబట్టగలడు' అని హర్భజన్ వివరించాడు. టీమ్ఇండియా టెస్టు స్పెషలిస్ట్ ఛతేశ్వర్ పుజారా కూడా భారత్ తుది జట్టులో ఒక మార్పు జరిగే అవకాశముందన్నాడు. గత మ్యాచ్‌లో అశ్విన్ బ్యాటింగ్ సరిగ్గా చేయకపోవడంతో అతడి స్థానంలో వాషింగ్టన్ సుందర్‌ను తీసుకుంటారని అంచనా వేశాడు. ఒక్క మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన హర్షిత్ రాణాను పక్కనపెట్టారని అభిప్రాయపడ్డాడు.

# అస్సలు తగ్గొద్దు

- ప్రత్యర్థులు మనపై ఎంత తీవ్రంగా స్పందిస్తే అదే స్థాయిలో సమాధానం చెప్పాలి
- భారత ఆటగాళ్లకు రవిశాస్త్రి సూచన





**ముంబయి:** ప్రత్యర్థులు మనపై ఎంత తీవ్రంగా స్పందిస్తే.. అదే స్థాయిలో సమాధానం చెప్పాలని మాజీ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు. ఆయన ఓ వ్యాసంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇటీవల అడిలైడ్‌లో జరిగిన మ్యాచ్‌లో సిరాజ్-ట్రావిస్ హెడ్ మధ్య తలెత్తిన ఉద్రిక్త పరిస్థితిపై రవిశాస్త్రి స్పందించారు. వారిద్దరూ ఈ వివాదాన్ని ఎలా డీల్ చేయాలో పరిపక్వత ఉన్న ఆటగాళ్లేనని అభిప్రాయపడ్డారు. ఆ వివాదం ఇప్పటికే చాలా వరకు అది సద్దుమణిగిందని పేర్కొన్నారు. "ఒక సీమర్ వేసిన బంతిని ఎవరైనా సిక్స్ కొడితే.. సహజంగా ఆ బౌలర్ నుంచి దూకుడు ప్రవర్తన ఉంటుంది. సిరాజ్ కొంచెం సేపు భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోయాడు. అది ఫాస్ట్‌బౌలర్ టెంపర్‌మెంట్. వారు అలానే ఉండాలని మీరూ కోరుకుంటారు. నేను కోచ్‌గా ఉన్నప్పుడు ఆసీస్ సిరీస్‌లో నా ఆటగాళ్లకు ఎప్పుడూ ఒక్కటే చెబుతా.. మీకు ఎలాంటి స్పందన వచ్చిందో.. మీరు అలానే ప్రతిస్పందించండి. అస్సలు వెనక్కి తగ్గొద్దు" అని సూచిస్తాను. హెడ్‌తో వివాదం జరిగిన వేళ చాలా మంది సిరాజ్‌ను కొంచెం తగ్గాలని సూచించారు. కానీ, రవిశాస్త్రి మాత్రం టీమ్ ఇండియా ఒక్క అడుగు కూడా వెనక్కి వేయకూడదన్నారు. రవిశాస్త్రి కోచ్‌గా ఉన్నప్పుడు 2018-19, 2020-21లో టీమ్ ఇండియా ఆస్ట్రేలియాలో సిరీస్ విజయాలను చవిచూసింది. కోహ్లీ, పంత్‌లు ఆ సిరీస్‌ల్లో చాలా దూకుడుగా ఆసీస్ జట్టుతో తలపడ్డారు. ఈ విషయాన్ని కూడా రవిశాస్త్రి గుర్తు చేశారు. "వెనక్కి తగ్గకూడదు అన్నది జట్టు ఫిలాసఫీగా మారిపోయింది. విరాట్ నుంచి పంత్ వరకు ప్రతిఒక్కరూ ఆసీస్‌కు జవాబు చెప్పేందుకు సిద్ధమయ్యారు" అని ఆయన చెప్పారు. హిట్‌మ్యాన్ బ్యాటింగ్ ఆర్డర్ మార్పుపై శాస్త్రి మాట్లాడుతూ "బ్రిస్బేన్‌లో రోహిత్ టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ రావాలని కోరుకుంటున్నారు. గతంలో ఇన్నింగ్స్‌ను ప్రారంభించాలి. టీమ్ ఇండియా అడిలైడ్‌లో అతడిని మిడిల్ ఆర్డర్‌లో ప్రయత్నించింది. కానీ, వారు తక్షణమే ఆ ప్లాన్ నుంచి వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మొదట్లో వచ్చి.. బ్యాటింగ్ తీరును సెట్ చేయాలి. అదే అతడి అత్యుత్తమ స్థానం" అని విశ్లేషించాడు. ఒక బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భారత్, ఆసీస్ చెరో మ్యాచ్ గెలిచి సమ ఉజ్జీలుగా నిలిచాయి. దీంతో భారత్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్స్‌కు చేరాలంటే కచ్చితంగా బ్రిస్బేన్‌లో టెస్ట్ గెలిచితీరాల్సిన పరిస్థితి నెలకొంది.

## గూగుల్ సరికొత్త క్వాంటమ్ చిప్

**ముంబయి:** టెక్ దిగ్గజం గూగుల్ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో గణనీయమైన పురోగతి సాధించింది. సరికొత్త క్వాంటమ్ చిప్‌ను ఆవిష్కరించింది. సంప్రదాయ కంప్యూటర్ల కంటే మెరుపు వేగంతో పనిచేసే 'విల్లో' క్వాంటమ్ చిప్‌ను తీసుకొచ్చింది. కాలిఫోర్నియాలోని శాంటా బార్బరాలోని కంపెనీ క్వాంటమ్ ల్యాబ్‌లో దీన్ని అభివృద్ధి చేసినట్లు గూగుల్ ప్రకటించింది. ఈవిషయాన్ని గూగుల్ తన బ్లాగ్ పోస్ట్‌లో పంచుకుంది. గూగుల్ తీసుకొచ్చిన విల్లో చిప్ ఎంతటి క్లిష్టతరమైన గణాంక సమస్యలనైనా కేవలం ఐదు నిమిషాల్లోనే పరిష్కరించగలదని కంపెనీ తెలిపింది. ప్రపంచంలోని అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్‌లు ఈ పనిని చేయాలంటే 10 సెప్టిలియన్ (ఒకటి తర్వాత 25 సున్నాలు ఉండే సంఖ్య) సంవత్సరాలు పడుతుంది. అంటే విశ్వం ఆవిర్భావం కంటే ఎక్కువ సమయం పడుతుందని గూగుల్ తెలిపింది.

**అసలేంటీ క్వాంటమ్ చిప్..**

క్వాంటమ్ చిప్ అనేది ఓ ప్రత్యేక రకమైన కంప్యూటర్ చిప్. ఇది క్వాంటమ్ మెకానిక్స్ సూత్రాలను ఉపయోగించేందుకు రూపొందించారు. ఇది సాధారణ చిప్‌నకు కాస్త భిన్నంగా ఉంటుంది. దీనిలోని ప్రత్యేక సామర్థ్యంతో సంప్రదాయక కంప్యూటర్‌ల కంటే చాలా వేగంగా సంక్లిష్ట గణనలను పూర్తిచేస్తుంది. సాధారణ కంప్యూటర్లు బైనరీ భాష మీద ఆధారపడి పనిచేస్తాయి. అది 0, 1 అనే రెండు అంకెలపై ఆధారపడిన యుగళ భాష. 0 అంటే విద్యుత్ (ఎలక్ట్రాన్ల) ప్రవాహం లేకపోవడం, 1 అంటే విద్యుత్ ప్రసారం



ఉండటం. 0, 1ని కలిపి బిట్ అంటారు. ఈ యుగళ కోడ్‌లో 1 అనే అంకె రాయడానికి 001 అని రాయాలి. 2 అనే అంకె రాయాలంటే 0011 అని రాయాలి. కంప్యూటర్‌లోని ట్రాన్సిస్టర్లు ఆగిపోతే 0 అని, ఆన్ అయితే 1 అని కోడ్ వస్తుంది. ప్రస్తుత కంప్యూటర్లు బైనరీ కోడ్‌లోనే సమాచారాన్ని నిల్వచేసి, ప్రాసెస్ చేస్తాయి. క్వాంటమ్ కంప్యూటర్ క్యూబిట్స్‌ను వాడుతుంది. క్యూబిట్ ఏకకాలంలో 0గా, 1గా ఉంటుంది. అంటే ఆన్, ఆఫ్ స్థితిలో ఉండగలదు. దీన్ని సూపర్ పొజిషన్ అంటారు. క్వాంటమ్ కంప్యూటర్ సూపర్ పొజిషన్ సాయంతో అపార సమాచారాన్ని వేగంగా ప్రాసెస్ చేస్తుంది. ఇది భవిష్యత్తులో పలు రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాయి. క్యూబిట్స్ వల్లే సంప్రదాయ కంప్యూటర్ల కంటే వేగంగా ఇవి గణనలను పూర్తి చేయగలవని నిపుణులు చెబుతున్నారు. నూతన చిప్‌లో 105 క్యూబిట్స్‌ను పొందుపరచిందీ టెక్ కంపెనీ. విల్లో క్వాంటమ్ చిప్‌ను ఆవిష్కరించిన విషయాన్ని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దీనిపై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ స్పందించారు. ఇది నిజంగా అద్భుతం అని కొనియాడారు.

## రూ.10 వేలకే మోటో కొత్త 5జీ ఫోన్

**ముంబయి:** ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ మోటోరొలా 'జీ' సిరీస్‌లో మరో కొత్త ఫోన్‌ను లాంచ్ చేసింది. మోటో జీ35 5జీ పేరిట దీన్ని తీసుకొచ్చింది. 50 ఎంపీ ప్రధాన కెమెరా, 5,000 బ్యాటరీతో ఈ మొబైల్‌ను తీసుకొచ్చింది. మోటో జీ35 5జీ కేవలం ఒక వేరియంట్‌లోనే లభిస్తుంది. 4జీబీం 128జీబీ వేరియంట్ ధర రూ. 9,999గా కంపెనీ నిర్ణయించింది. రెడ్, లీఫ్ గ్రీన్, మిడ్‌నైట్ బ్లూ రంగుల్లో లభిస్తాయి. ఫ్లిప్‌కార్ట్‌తో పాటు మోటోరొలా రిటైల్ దుకాణాల్లో కొనుగోలు చేయొచ్చు. ఇక ఫీచర్ల విషయానికొస్తే.. 6.72 అంగుళాల ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లేతో వస్తోంది. ఇందులో 120హెర్ట్జ్ రిఫ్రెష్ రేటు, 240హెర్ట్జ్ టచ్ సాంప్లింగ్ రేటు ఇచ్చారు. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3 ప్రొటెక్షన్‌తో వస్తోంది. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 6ఎస్ జనరేషన్ 3 ప్రాసెసర్‌తో పని చేస్తుంది. ఆండ్రాయిడ్ 14 ఆధారిత హల్లో యూఐ స్కిన్‌తో పనిచేస్తుంది. వెనుకవైపు 50 ఎంపీ క్వాడ్ పిక్సెల్ ప్రైమరీ



రియర్ సెన్సర్, అల్ట్రా వైడ్ యాంగిల్‌తో 8 ఎంపీ సెన్సర్, ముందువైపు సెల్ఫీల కోసం 16 ఎంపీ కెమెరా అమర్చారు. డాల్బీ అట్మోస్-బ్యాక్డ్ స్టీరియో స్పీకర్‌లు, ఐపీ52 రేటింగ్‌తో లెదర్ ఫినిష్‌తో ఈ ఫోన్ తీసుకొచ్చారు. 5,000 బ్యాటరీ కలిగిన ఈ ఫోన్ 20ఓట్స్ వైర్డ్ ఛార్జింగ్ సదుపాయానికి సపోర్ట్ చేస్తుంది. డ్యూయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 5.0, 3.5 ఎంఎం ఆడియో జాక్, యూఎస్‌బీ టైప్- సి పోర్ట్ వంటి కనెక్టివిటీ ఫీచర్లు ఉన్నాయి.

## ఆర్‌బీఐ ముందున్న అతిపెద్ద సవాలు ఇదే

శక్తికాంత దాస్

**ముంబయి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్‌గా తన చివరిరోజున విలేకరుల సమావేశంలో శక్తికాంత దాస్ మాట్లాడారు. ఆర్‌బీఐ ముందున్న సవాళ్ల గురించి మాట్లాడిన ఆయన కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న సంజయ్ మల్హోత్రా గురించి ప్రస్తావించారు. ఈసందర్భంగా 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అపారమైన అనుభవం ఉన్న మల్హోత్రా సీబీడీసీ , యూఎల్ఐ.. వంటి ఆర్‌బీఐ కార్యక్రమాలను సమర్థంగా నడిపించగలరని దాస్ ఆశాభావం వ్యక్తంచేశారు. సైబర్ సెక్యూరిటీ అనేది సవాలుగా మారుతోందన్నారు. సైబర్ బెదిరింపులను సమర్థంగా ఎదుర్కొనేందుకు కొత్త సాంకేతికతలను ఉపయోగించడంపై దృష్టిసారించాలన్నారు. ద్రవ్యోల్బణం, వృద్ధి మధ్య సమతుల్యతను పునరుద్ధరించడం అత్యంత ముఖ్యమైన అంశమన్నారు. దాదాపు నాలుగేళ్లలో అత్యంత వేగంగా కూరగాయల ధరలు పెరగడంతో అక్టోబర్‌లో ద్రవ్యోల్బణం 14నెలల గరిష్ఠ స్థాయి 6.21శాతానికి పెరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, సెంట్రల్ బ్యాంక్ బృందానికి దాస్ 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. "ఆర్‌బీఐ గవర్నర్‌గా పదవీవిరమణ అయ్యారు. ఇన్నాళ్లు నాకు మద్దతుగా నిలిచిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. ఆర్‌బీఐ గవర్నర్‌గా దేశానికి సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు. ఆయన మార్గదర్శకం, ప్రోత్సాహం మరువలేనిది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్‌బీఐల మధ్య సమన్వయం గత ఆరేళ్లుగా అత్యుత్తమంగా ఉంది" అని అన్నారు. అసాధారణమైన పరిస్థితులను ఎంతో విజయవంతంగా ఎదుర్కొన్నామని తెలిపారు.

## షమినే భారత అత్యుత్తమ బౌలర్

- బుమ్రా ఎక్కువ వికెట్లు పడగొట్టినా.. షమి దగ్గర అన్ని అస్త్రాలు
- మిగిలిన బౌలర్లతో పోలిస్తే షమిలో నిలకడ ఎక్కువ
- వెస్టిండీస్ దిగ్గజ పేసర్ ఆండీ రాబర్ట్స్ ప్రశంసలు




**వెస్టిండీస్:** టీమ్ఇండియా సీనియర్ బౌలర్ మహ్మద్ షమిపై వెస్టిండీస్ దిగ్గజ పేసర్ ఆండీ రాబర్ట్స్ ప్రశంసలు కురిపించాడు. షమి భారత అత్యుత్తమ బౌలర్ అని కితాబిచ్చాడు. 'షమి కొంతకాలంగా భారత అత్యుత్తమ బౌలర్‌గా నిలిచాడు. అతను జస్‌ప్రీత్ బుమ్రా పడగొట్టినన్ని వికెట్లు సాధించలేకపోవచ్చు. కానీ, షమి దగ్గర అన్ని అస్త్రాలు ఉన్నాయి. మిగిలిన బౌలర్లతో పోలిస్తే అతనిలో నిలకడ ఎక్కువ. షమి బంతిని స్వింగ్, సీమ్ చేస్తాడు. బుమ్రా వలె బంతిపై మంచి నియంత్రణ ఉంది' అని ఆండీ రాబర్ట్స్ పేర్కొన్నాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో బుమ్రా తర్వాత ప్రధాన పేసర్‌గా ఉన్న మహ్మద్ సిరాజ్ గురించి కూడా విండీస్ మాజీ పేసర్ మాట్లాడాడు. షమి స్థాయికి సిరాజ్ దరిదాపుల్లో కూడా లేడన్నారు. బ్రిస్బేన్ వేదికగా ఆసీస్‌తో జరిగే మూడో టెస్టులో షమిని ఆడించాలని టీమ్ఇండియా మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. బుమ్రా ఇప్పటివరకు 42 టెస్టుల్లో 185 వికెట్లు పడగొట్టగా.. షమి 64 టెస్టుల్లో 229 వికెట్లు సాధించాడు. మరోవైపు, షమి అంతర్జాతీయ పునరాగమనంపై అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. గాయం కారణంగా సుదీర్ఘకాలం ఆటకు దూరమై, దేశవాళీలో పునరాగమనం చేసిన షమి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. ముస్తాక్ అలీ టోర్నీలో 34 ఏళ్ల షమి 16 రోజుల వ్యవధిలో 8 మ్యాచ్‌లు ఆడాడు. అయితే షమి ఇంకా టెస్టు మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించలేదన్నది బీసీసీఐ వర్గాల సమాచారం. అతడు ఫిట్‌నెస్ సాధిస్తే ఆసీస్‌తో చివరి రెండు టెస్టుల్లో ఆడించాలని టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

## అబుదాబి టీ10 లీగ్‌లో ఫిక్సింగ్

అసిస్టెంట్ కోచ్‌పై ఆరేళ్ల నిషేధం



**దుబాయ్:** మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిన సన్నీ ధిల్లాన్‌కు ఆరేళ్ల బ్యాన్ విధించింది ఐసీసీ. ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అబు దాబి టీ10 క్రికెట్‌లో ఓ ఫ్రాంచైజీకి చెందిన మాజీ అసిస్టెంట్ కోచ్‌ను అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి బహిష్కరిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి తన ప్రకటనలో తెలిపింది. యాంటీ కరప్షన్ కోడ్‌ను ఉల్లంఘించిన 8 మందిలో అసిస్టెంట్ కోచ్ ధిల్లాన్ ఒకరు. 2021లో జరిగిన అబుదాబి టీ10 క్రికెట్ లీగ్‌లో ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ధిల్లాన్‌పై ఆరోపణలు ఉన్నాయి. అతను మ్యాచ్‌ను ప్రభావితం చేసే ప్రయత్నం చేసినట్లు అభియోగాలు నమోదు అయ్యాయి.

## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు.. పెరిగిన ఐటీ, మెటల్ షేర్లు




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళశారం ఫ్లాట్‌గా ముగిశాయి. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ఆ తర్వాత స్వల్పంగా దిగజారాయి. చివరకు స్వల్పంగా కోలుకొని ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే.. 81,575.96 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,726.34 పాయింట్లకు పెరిగిన సెన్సెక్స్.. చివరకు 81,182.69 పాయింట్లకు తగ్గింది. చివరక 1.59 స్వల్పంగా పెరిగి.. 81,510.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 8.95 పాయింట్లు తగ్గి.. 24,610.05 వద్ద ముగిసింది.ట్రేడింగ్‌లో దాదాపు 1,970 షేర్లు పెరిగాయి. 1,828 షేర్లు పతనమై.. మరో 122 షేర్లు మాత్రం మారలేదు. సెన్సెక్స్‌లో భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ టాప్ లూజర్‌గా నిలిచాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, శ్రీరామ్ ఫైనాన్స్ లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.3శాతం చొప్పున పెరిగాయి. పవర్, టెలికాం, మీడియా 0.5శాతం నుంచి ఒకశాతం పతనం కాగా.. ఐటీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, రియల్టీ 0.4-1 శాతం మధ్య ఎగిశాయి.అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 71 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2687 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## క్విక్ కామర్స్‌లోకి అమెజాన్

ఈ నెలాఖరులోగా సేవలు ప్రారంభం




**ముంబయి:** క్విక్ కామర్స్‌కు ఆదరణ పెరుగుతుండడంతో అనేక సంస్థలు ఈ తరహా సేవల్ని అందించేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రముఖ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ సైతం ఇదే తరహా సేవల్ని అందించాలని ఎప్పటి నుంచో సన్నాహాలు చేస్తోంది. తాజాగా ఇదే విషయంపై కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ మాట్లాడారు. ఈ నెలాఖరులోనే ఈ సేవల్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు.ఓ ఆంగ్ల మీడియా సంస్థతో మాట్లాడిన అగర్వాల్ డిసెంబర్ నెలాఖరుకల్లా తన క్విక్ కామర్స్ సేవల్ని అందుబాటులోకి తేనున్నట్లు స్పష్టం చేశారు. అయితే తొలుత బెంగళూరు నగర వాసులు ఈ సర్వీసులు వినియోగించుకోనున్నారని తెలిపారు. క్విక్‌కామర్స్ సేవల్లో భాగంగా 1,000-2,000 ఉత్పత్తులు డెలివరీలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే రానున్న రోజుల్లో ఈ సేవల్ని మరిన్ని నగరాలకు విస్తరించనున్నారు. 15 నిమిషాల క్విక్ కామర్స్ విభాగంలో అమెజాన్ ఎంట్రీ ఇవ్వడం ఇదే తొలిసారి. వాస్తవానికి 2025లో ఈ సేవలను ప్రారంభించాలని తొలుత భావించింది. అయితే, రోజురోజుకూ కొత్త ప్లేయర్లు వచ్చి చేరుతుండటంతో తన ప్రయత్నాలను వేగవంతం చేసింది. దీంతో ఇక ఈ ఏడాదిలోనే ఈ సేవల్ని పరిచయం చేసేందుకు నడుంబిగించింది. ఈ ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే ప్రత్యేకమైన రిక్రూట్‌మెంట్‌ను సైతం అమెజాన్ చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బ్లింకిట్, స్విగ్గీ, జెప్టోతో పాటు ఫ్లిప్‌కార్ట్ సైతం 'మినిట్స్' పేరిట క్విక్ కామర్స్ సేవలకు శ్రీకారం చుట్టింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూపు సైతం ఎంట్రీ ఇస్తున్నాయి.

## జాను పాపను అలా చూస్తే మతిపోవాల్సిందే



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ 'దేవర'తో తెలుగులో హిట్ కొట్టింది. తాజాగా ఈ బ్యూటీ ఫోటోలు నెట్టింట్లో తెగ వైరలవుతున్నాయి. అతిలోక సుందరి శ్రీదేవి కూతురు, బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. స్టార్ కిడ్ గా బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ తొలి సినిమాతోనే స్టార్ హీరోయిన్ గా మారింది.అతిలోకసుందరి శ్రీదేవి – నిర్మాత బోణి కపూర్ ల గారాల పట్టీ జాన్వీ టాలీవుడ్ లో అడుగుపెట్టింది. ప్రస్తుతం ఈ అమ్మడు చేతిలో రెండు బిగ్గెస్ట్ పాన్ ఇండియా మూవీస్ ఉన్నాయి.కొద్దిరోజుల క్రితం యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో 'దేవర'లో నటించి ఈ అమ్మడుపోస్టర్స్, చిందేసిన సాంగ్స్ బాగా ఆకట్టుకున్నాయి. తారక్, జాన్వీ జోడీకి అప్పుడే మంచి మార్కులు పడిపోయాయి.గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ - బుచ్చిబాబు కాంబోలో వస్తున్న సినిమా చేస్తున్నారు జాన్వీ కపూర్. మెగాస్టార్ కొడుకు, అతిలోక సుందరి కూతురు కాంబోలో వస్తున్న ఆ ప్రాజెక్ట్ మీద హై హోప్స్ ఉన్నాయి ఫ్యాన్స్ కు.గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ - బుచ్చిబాబు కాంబోలో వస్తున్న సినిమా చేస్తున్నారు జాన్వీ కపూర్. మెగాస్టార్ కొడుకు, అతిలోక సుందరి కూతురు కాంబోలో వస్తున్న ఆ ప్రాజెక్ట్ మీద ఫ్యాన్స్ కు హై హోప్స్ ఉన్నాయి.

## నటుడు ధర్మేంద్రకు ఢిల్లీ కోర్టు సమన్లు



బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్రకు ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. గరం ధరం దాబా ఫ్రాంచైజీకి సంబంధించిన చీటింగ్ కేసులో ధర్మంద్రతో పాటు మరో ఇద్దరికి ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు సమన్లు జారీ చేసింది. ఫ్రాంచైజీలో పెట్టుబడి పెట్టేందుకు తప్పుదోవ పట్టించారని ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త సుశీల్ కుమార్ చేసిన ఫిర్యాదు మేరకు సమన్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. గరం ధరం దాబా ఫ్రాంచైజీ డీల్‌లో తాను మోసపోయినట్లు సుశీల్ కుమార్ ఫిర్యాదు చేశారు. రూ.63లక్షల వరకు పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. ధర్మేంద్ర నుంచి ఎలాంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. ఈ విషయంలో తదుపరి విచారణ వచ్చే ఏడాది ఫిబ్రవరి 20న జరగనుంది. 2018లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని గరం ధరం దాబా ఫ్రాంచైజీలో భాగం కావాలని కోరుతూ కుమార్‌ను ధర్మంద్ర సంప్రదించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నెలకు రూ.70 లక్షల వరకు టర్నోవర్‌లు ఆర్జిస్తున్నట్లు ధర్మేంద్ర తెలపడంతో తాను పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. ఈమేరకు 2018లోనే ఒప్పంద పత్రంపై సంతకం చేశారన్నారు. అయితే అప్పటినుంచి ధర్మేంద్ర నుంచి స్పందన లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తాను మోసపోయానని, ఆర్థికంగా నష్టపోయానని సుశీల్ కోర్టును ఆశ్రయించారు.

## ఆమె కాల్ వస్తే నాకు టెన్షన్

జయా బచ్చన్‌పై అమితాబ్ ఆసక్తికర వ్యాఖ్యలు బాలీవుడ్ ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న టెలివిజన్ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి'. ప్రస్తుతం 16వ సీజన్ ప్రసారమవుతోంది. ఈ కార్యక్రమంలో తన సతీమణి జయా బచ్చన్ పై అమితాబ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆమె కాల్ చేస్తే ఎందుకు టెన్షన్ పడతారో చెప్పారు. ''ఇంట్లో బంధువులున్నా, అతిథులు వచ్చినా జయ వారితో బెంగాలీలోనే మాట్లాడుతుంది. తాను ఫోన్ కాల్ చేసిన సమయంలో పక్కన ఎవరైనా ఉన్నా ఆ భాషలోనే మాట్లాడడం ప్రారంభిస్తుంది. నాకేమో ఆ భాష అర్థం కాదుగానీ అర్థమైనట్టు నటిస్తా (నవ్వులు). ఇప్పటికీ నేను బెంగాలీ మాట్లాడలేను. 'నాకు ఎక్కువగా తెలియదు, కొంచెం అర్థమైంది' అని మాత్రం చెప్పగలను'' అని పేర్కొన్నారు. తన కుటుంబం గురించి మాట్లాడుతూ.. ''ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన నేను బెంగాలీ మహిళను పెళ్లి చేసుకున్నా. నా సోదరుడు సింధీ మహిళను, నా కుమార్తె పంజాబీ అబ్బాయిని, నా కుమారుడు (అభిషేక్ బచ్చన్) మంగళూరు అమ్మాయిని (ఐశ్వర్యా రాయ్) వివాహం చేసుకున్నారు. అన్ని ప్రాంతాలకు చెందిన వారు మన కుటుంబంలో ఉండాలని మా నాన్న చెబుతుండేవారు'' అని గుర్తుచేసుకున్నారు. అదే షోలో నటుడు హృతిక్ రోషన్‌పై అమితాబ్ ప్రశంసలు కురిపించారు. హృతిక్ తొలి సినిమా విడుదల రోజు స్నేహితులతో కలిసి థియేటర్ వెళ్లి చూశానని, తర్వాత హృతిక్ డ్యాన్స్‌ను కాపీ కొట్టే ప్రయత్నం చేశానని నవ్వులు పూయించారు. 80 ఏళ్ల వయసులోనూ కీలక పాత్రలతో సత్తా చాటుతున్నారు అమితాబ్. 'కల్కి' లో అశ్వత్థామ పాత్ర పోషించి మంచి క్రేజ్ సొంతం చేసుకున్నారు. అక్టోబరులో విడుదలైన రజనీకాంత్ సినిమా 'వేట్టయన్' లోనూ అమితాబ్ పాత్ర కీలకం.

### ఎట్టకేలకు ఓటీటీలోకి విక్రమ్

## తంగలాన్

ఇటీవల మన తెలుగు సినిమాలు గ్లోబల్ లెవెల్లో సెట్ చేసిన స్టాండర్డ్స్ చూసి ఇతర భాషల్లో చేసిన పలు చిత్రాలు కూడా తమ సినిమాలు గ్లోబల్ లెవెల్లో సక్సెస్ అవుతాయి అని చెబుతూ వచ్చాయి. కాగా ఈ తరహా చిత్రాలు ఎక్కువగా తమిళ చిత్రాలు నుంచి వచ్చాయి అని చెప్పాలి. మరి రీసెంట్‌గానే కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించిన భారీ చిత్రం "కంగువా" ఏమాత్రం అంచనాలు అందుకోలేకపోయింది.గ్లోబల్ గా 1000 కాదు 2000 కోట్లు కొల్లగొడతాం అని చెప్పిన మేకర్స్ బొక్క బోర్లా పడ్డారు. ఈ సినిమా కంటే ముందు తమిళ్ నుంచి వచ్చిన మరో భారీ సినిమా ఏకంగా తమకి ఆస్కార్ అవార్డు తీసుకొస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు. మరి ఇంట్రెస్టింగ్ గా ఈ రెండు చిత్రాలు కూడా ఒకే నిర్మాణ సంస్థ నుంచి రావడం విశేషం. ఈ నిర్మాతలు ఎంతో లేపినా ఈ సినిమాలు ఆ అంచనాలకి తగ్గట్టుగా రీచ్ కాలేకపోయాయి. మరి ఆ రెండో సినిమా ఏదో కాదు తమిళ ఇండస్ట్రీలో నటన అంటే ప్రాణం పెట్టేసే వెర్సటైల్ నటుడు విక్రమ్ నటించిన "తంగలాన్" సినిమానే. కాగా ఈ చిత్రాన్ని కబాలి, కాలా, సార్పట్టలు తీసిన దర్శకుడు పా రంజిత్ తెరకెక్కించగా ఈ సినిమా ఆస్కార్ తీసుకొస్తుంది అనే రేంజ్ లో ప్రాజెక్ట్ చేస్తూ రిలీజ్ కి తీసుకొచ్చారు. కానీ ఈ చిత్రం వాటి రేంజ్ లో లేదని ఆడియెన్స్ ఫీడ్ బ్యాక్ ఇచ్చేసారు. ఇలా ఈ ఏడాది ఎపుడో ఆగష్టు లో రిలీజ్ కి వచ్చిన ఈ చిత్రం యావరేజ్ గానే మిగిలిపోయింది. అయితే నాటి నుంచి ఈ చిత్రం ఇదిగో ఓటిటిలో వస్తుంది. అదిగో ఓటిటిలో వస్తుంది అని టాక్ వచ్చింది కానీ ఇప్పటి వరకు రాలేదు. అయితే ఆ మధ్య చిత్ర యూనిట్‌కి ఓటిటి సంస్థకి ఏదో డీల్ కుదరక నెల లోపే రావాల్సిన ఈ చిత్రం ఇన్ని నెలలు అయినా ఇంకా స్ట్రీమింగ్ జరగలేదు.ఈ నేపథ్యంలో "తంగలాన్" సర్‌ప్రైజ్ అండ్ సైలెంట్‌గా ఓటీటీలో స్ట్రీమింగ్‌కి వచ్చేసింది. ఈ సినిమాని అప్పట్లో భారీ ధర ఇచ్చి సొంతం చేస్తున్న ఓటీటీ దిగ్గజం నెట్ ఫ్లిక్స్‌లోనే ఈరోజు నుంచి ఈ భారీ సినిమా అందుబాటులోకి వచ్చేసింది. ఈ సినిమా నేటి నుంచి పాన్ ఇండియా భాషల్లో కాకుండా పాన్ సౌత్ భాషల్లో అందుబాటులోకి వచ్చేసింది. సో ఈ సినిమాని అప్పుడు థియేటర్‌లలో మిస్ అయ్యినవాళ్లు ఒకసారి లుక్ వేయొచ్చు. కాగా ఈ చిత్రంలో బోల్డ్ అండ్ హాట్ బ్యూటీ మాళవిక మోహనన్ నటించి.. చాలా మందిని సర్‌ప్రైజ్ చేసింది. కాగా ఈ చిత్రానికి మేకర్స్ సీక్వెల్‌ని కూడా అనౌన్స్ చేశారు. మరి మొదటి సినిమానే కాస్ట్ ఫెయిల్యూర్ దీంతో పార్ట్ 2 వస్తుందో లేదో అన్న అనుమానాలు నెలకొన్నాయి.

### నీటి వృథా తగ్గిస్తే అందరికీ మంచిది

## 'వాటర్'పై పూరి మ్యూజింగ్స్



దర్శకుడు పూరి జగన్నాథ్ 'పూరి మ్యూజింగ్స్' పేరుతో పలు అంశాలపై పాడ్‌కాస్ట్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఎపిసోడ్‌లో నీటి వినియోగం గురించి మాట్లాడారు. 'వాటర్' పేరిట సంబంధిత వీడియోను విడుదల చేశారు. ఆయన ఏమన్నారంటే? ''ప్రతి ఒక్కరూ తమ వయసు, వాతావరణం, చేసే పనిని బట్టి రోజుకి 2 నుంచి 3 లీటర్ల నీరు తాగుతారు. ఇది నేరుగా వినియోగించడం. నీటిని పరోక్షంగా కూడా వినియోగిస్తుంటాం. మనం తినే ఆహారం తయారవ్వాలంటే నీరు కావాలి. కిలో మటన్ మనం పొందగలుగుతున్నామంటే 15 వేల లీటర్లు, కిలో బియ్యానికి 2,500 లీటర్లు, కాటన్ చొక్కాకు 2,500 లీటర్లు, జత జీన్స్‌కు 8 వేల లీటర్లు, కప్పు కాఫీకి 140 లీటర్లు, బ్రెడ్ ముక్కకు 40 లీటర్ల వాటర్ అవసరం. బట్టలు ఉతకడానికి, కరెంట్‌కూ నీరు కావాలి. 60 వాట్ల బల్బ్ 12 గంటలు వెలగాలంటే 6 వేల గ్యాలన్ల వాటర్ అవసరం. ఓ పేపరుకు 100 లీటర్లు, మొబైల్ ఫోన్ తయారీకి 12 వేల లీటర్ల నీరు ఖర్చవుతుంది. వాష్‌రూమ్స్‌లోనూ నీటి వినియోగం ఎక్కువే. జలకాలాడుతూ గంటలపాటు స్నానం చేసేవారు చాలా మంది ఉన్నారు. మనం తినే కూరగాయలు తయారుకావడానికి చాలా నీరు కావాలి. వంట చేయడానికి, తిన్న ప్లేట్లు కడగడానికీ వాటర్ తప్పనిసరి'' ''ఇలా ఒక్కో మనిషికే రోజుకు ఎంతో నీరు కావాల్సి వస్తుంది. మరి, 140 కోట్లకుపైగా జనాభా కలిగిన భారతదేశానికి రోజుకు ఎంత నీరు కావాలి?ఇంత ఖర్చు చేస్తున్న మనం వాటర్ హార్వెస్టింగ్ చేస్తున్నామా? లేదు. మనం నీటిని పొదుపు చేయకపోతే.. ముఖ్యంగా నగరాల్లో గ్రౌండ్ వాటర్ అడుగంటుతుంది. అదే లేకపోతే 40- 50 అంతస్తుల అపార్ట్‌మెంట్స్ వదిలి వెళ్లిపోవాల్సి వస్తుంది. ప్రతి ఇంట్లో వాటర్ హార్వెస్టింగ్ జరిగేలా చూడాలి. లేదంటే రాబోయే 10 ఏళ్లలో కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మనం నీటిని దుర్వినియోగం చేయడం మానేయాలి. అడవిలో ఏనుగుకు ఎక్కడైనా నీరు కనిపిస్తే కొంచెం తాగి, అదే నీటితో స్నానం ముగిస్తుంది. నీటిని అదెంతో జాగ్రత్తగా వాడుతుంది. మనం నీటి వృథా తగ్గిస్తే అందరికీ మంచిది'' అని సూచించారు.

### 13న మలయాళ స్టార్ జోజు జార్జ్ "పని"

## సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్



ఇటీవల మలయాళంలోసూపర్‌హిట్టయిన స్టార్ హీరో మరియు దర్శకుడు జోజు జార్జ్ సినిమా "పని" తెలుగులో ఈ నెల 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ చిత్రంలో అభినయ కీలక పాత్రలో నటించింది. ఆమ్ వర్ద్ ఎంటర్ టైన్ మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. రాజవంశీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. పని సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈ రోజు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలోతెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు డైరెక్టర్ వీరశంకర్ మాట్లాడుతూ - పని సినిమా మలయాళంలో రిలీజ్ మంచి విజయాన్ని సాధించింది. ఇదొక సెన్సబుల్ ఫిల్మ్. పని సినిమా తెలుగులోకి నా మిత్రుడు రాజ వంశీ తీసుకొస్తున్నారు. జోజు జార్జ్ మంచి నటుడు. ఆయన ఎన్నో అవార్డ్ లు అందుకున్నారు. తెలుగు ప్రేక్షకులకూ దగ్గరయ్యారు. పని సినిమా తెలుగులోనూ ఘన విజయం సాధించాలి, రాజ వంశీతో పాటు టీమ్ అందరికీ సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా అన్నారు.తెలుగు ఫిలింఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ - మలయాళ సినిమా అంటే నాకు ప్రత్యేకమైన గౌరవం. వాళ్లు కంటెంట్ ను గౌరవిస్తారు. అందుకే మంచి విజయాలు సాధిస్తున్నారు. పని సినిమా కూడా అలాంటి స్ట్రాంగ్ కంటెంట్ తో వస్తున్న మూవీ. ప్రేక్షకులు ఈ చిత్రానికి మంచి విజయాన్ని ఇస్తారని ఆశిస్తున్నా అన్నారు.

నటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ - రాజవంశీ నాకు మంచి మిత్రులు. జోజు జార్జ్ గారికి నేను అభిమానిని. ఆయన మూవీస్ ఓటీటీలో చూస్తుంటాను. ఎప్పుడెప్పుడు ఆయనను కలుస్తానా అనుకున్నాను. ఈ వేదిక మీద కుదిరింది. చిన్న చిన్న ఎక్స్ ప్రెషన్స్ తో కూడా ఆకట్టుకోగల నటుడు. అభినయ మనల్ని ఎన్నో సినిమాలతో ఆకట్టుకుంది. వీరు కలిసి నటించిన పని సినిమా తన పనితనం ఎంటో తెలుగు బాక్సాఫీస్ దగ్గర కూడా చూపించాలి అన్నారు. మలయాళ ప్రొడ్యూసర్ సిజో వడక్కన్ మాట్లాడుతూ - పని చిత్రంతో జోజు జార్జ్, అభినయ వంటి మంచి ఆర్టిస్టులతో పనిచేసే అవకాశం కలిగింది. పని సినిమా మలయాళం, కన్నడ, తమిళంలో మంచి విజయం సాధించింది. తెలుగులోనూ అలాంటి విజయాన్నే సాధిస్తుందని కోరుకుంటున్నా అన్నారు. హీరో, దర్శకుడు జోజు జార్జ్ మాట్లాడుతూ - ఈ రోజు మా పని సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్ కు వచ్చిన గెస్ట్ లు అందరికీ థ్యాంక్స్. వాళ్లు నా గురించి గొప్పగా మాట్లాడటం సంతోషంగా ఉంది. నా దృష్టిలో మంచి సినిమాకు భాషా హద్దులు లేవు. ఏ భాషలో ప్రేక్షకులైనా ఆదరిస్తారు. తెలుగు చిత్రాల్లో నటించి మీ ఆదరణ పొందాను. పని సినిమా కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్. మా టీమ్ లోని ప్రతి మెంబర్ తన వర్క్ ను అద్భుతంగా చేశారు. అభినయతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. పని మూవీ తెలుగు ఆడియెన్స్ కు కూడా బాగా నచ్చుతుంది. మీరంతా మా మూవీని ఆదరిస్తారని కోరుకుంటున్నా అన్నారు.ఈ కార్యక్రమంలో పని సినిమాలో నటించిన నటీనటులు, ఇతర టెక్నీషియన్స్ పాల్గొన్నారు. నటీనటులు - జోజు జార్జ్, అభినయ, సాగర్ సూర్య, జునైద్, అభయ హిరణ్మయి, సీమ, బాబీ కురియన్, తదితరులు..

రిపోర్టర్స్ కావలెను
V3 NEWS లక్ష్యం సమాజహితం
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com